జులై
2021

183

సంపుటి : 16 సంచిక : 2 వెల రు. 10/-

## ఈ సంచికలో........

కులము, వర్గము: మార్క్సిస్టు అవగాహన
చైనా కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల 'లాంగ్ మార్చ్'
ఆగ్జిల్లరీ గ్రూపులు - అనుభవాలు
జనావాసాలూ, సమాజంలో దొంతరలు
కరోనా బాధితుల కోసం సిపిఐ(ఎం) ఐసోలేషన్ కేంద్రాలు
జి7, నాటో సమావేశాలు: మరో ప్రచ్ఛన్న యుద్ధానికి సన్నాహాలు
సరళీకరణ విధానాలతో తీవ్రమౌతున్న వ్యవసాయ సంక్షోభం
బీమా కోరేగావ్ కేసులో తప్పుడు సాక్షాల సృష్టి
రాష్ట్రంలో బిజెపి పెరుగుదలను నిరోధించాలి
నాల్గవ మహాసభ-పార్టీ అంతర్గత పోరాటం ప్రారంభం

# నాల్గవ మహాసభ - పార్టీ అంతర్గత పోరాటం ప్రారంభం

కమ్యూనిస్టు పార్టీ లేవనెత్తిన ప్రధాన డిమాండ్లలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు ఒకటి. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించిన అనేక రైతాంగ పోరాటాలలో కూడా ఇది ప్రధానమైన డిమాండ్. ఈ డిమాండ్‌ను అంగీకరిస్తే దేశం విచ్ఛిన్నం అవుతుందని స్వాతంత్ర్యం పొందిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని అమలు చేయడానికి అంగీకరించలేదు. ప్రభుత్వ వాదనను కమ్యూనిస్టులు అంగీకరించకుండా ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేశారు. అనేక పోరాటాలను నడిపారు.

ప్రజానీకం దేశ ఆర్థిక, రాజకీయ, ప్రజాస్వామ్య వ్యవస్థల పునర్నిర్మాణంలో సంపూర్ణంగా పాల్గొనడానికి, దేశం అభివృద్ధి వైపు పురోగమించటానికి భాషా ప్రయుక్త రాష్ట్రాలు తప్పనిసరిగా ఏర్పడాలని పార్టీ భావించింది. భారతదేశం ఐక్యంగా ఉండడానికి భాషా ప్రయుక్త రాష్ట్రాలే గట్టి పునాదిగా ఉంటాయని, దాని ఆధారంగానే ప్రజాతంత్రం, సమానత్వాలను ప్రజల సాధించ గలుగుతారని భావించింది. ప్రజా ఉద్యమం ద్వారా 1953లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడడాన్ని స్వాగతించింది.

1954 ఏప్రిల్‌లో జరిగిన కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సమావేశం రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ తీర్మానాన్ని అమోదించింది. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు కమిషన్‌ను ఏర్పాటు చేయడాన్ని స్వాగతించింది. అయితే ఆర్థికంగా నిలదొక్కుకోగలగడం, పరిపాలనకు వెసులుబాటే ప్రధాన గీటురాయిగా తీసుకోవటాన్ని, భాష, సంస్కృతులను కమిషన్ ప్రాతిపదికగా తీసుకోకపోవటాన్ని విమర్శించింది. ప్రభుత్వం భాషా ప్రయుక్త రాష్ట్రాల నిర్మాణంలో జాప్యం చేయకూడదని, దాని వలన వివిధ తరగతుల ప్రజల మధ్య సత్సంబంధాలకు గండి పడుతుందని పార్టీ పేర్కొంది. 20 రాష్ట్రాల ఏర్పాటుకు నిర్దిష్ట సూచనలు చేసింది. 1954 సెప్టెంబర్ నాటికి కమిటీ మధ్యంతర రిపోర్టు ఇవ్వాలని డిమాండ్ చేసింది.

రాజప్రముఖులకు, సంస్థానాధీశులకిచ్చే భృతి, ఇదివరకటి రాజులకిచ్చే అన్ని సౌకర్యాలు 'రద్దు చేయాలనీ డిమాండ్ చేసింది. సంస్థానాధీశులు, రాజుల వద్ద ఉన్న వ్యక్తిగత ఆస్తులన్నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, వాటిని దేశ పునర్నిర్మాణానికి, అప్పులను తీర్చడానికి ఉపయోగించాలని డిమాండ్ చేసింది. భాష ప్రాతిపదికన ఏర్పడ్డ రాష్ట్రాలలో మాతృభాషలో విద్య నేర్పాలని కూడా డిమాండ్ చేసింది.

గిరిజన ప్రాంతాలను ఆయా ప్రాంతాలలోని గిరిజనుల భాష, సంస్కృతుల ఆధారంగా రాష్ట్రాలలో విలీనం చేయాలని కూడా డిమాండ్ చేసింది. ఆ ప్రాంతాలకు స్వయం ప్రతిపత్తిని కూడా ఇవ్వాలని డిమాండ్ చేసింది. చిన్న చిన్న సరిహద్దు తగాదాలలో శక్తిని వృధా చేయకూడదని, గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధన కోసం పోరాటం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ డిమాండ్ల పై పార్టీ కమిషన్‌కి ఒక విపులమైన నివేదిక అందచేసింది.

కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల ఏర్పాటును పార్టీ స్వాగతించింది. కానీ బొంబాయిని మహారాష్ట్ర నుండి విడగొట్టి కేంద్ర పాలిత ప్రాంతంగా ఉంచడాన్ని విమర్శించింది. అలాగే బీహార్‌ను బెంగాల్‌తో కలపడాన్ని కూడా వ్యతిరేకించింది. ఈ డిమాండ్లపై అనేక పోరాటాలు చేసింది. ఆ పోరాటాలలో అనేక మంది కార్యకర్తలు పోలీసుల దెబ్బలు తిన్నారు, అరెస్టు చేయబడ్డారు. ఈ నిరసనలలో ఆరుగురు కేంద్ర కమిటీ సభ్యులు అరెస్ట్ చేయబడ్డారు. కొన్నిచోట్ల పోలీసులు జరిపిన కాల్పులలో అనేకమంది చనిపోయారు.

ఈ కాలంలో నెహ్రూ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు - భారతదేశ విదేశాంగ విధానం, పంచవర్ష ప్రణాళికలు- 'సోషలిస్టు తరహా సమాజం' నిర్మించడం అనే కాంగ్రెస్ పార్టీ మోసపూరిత పిలుపును- విశ్లేషించడంలో పార్టీలో తీవ్రమైన చర్చ మొదలయింది. ఈ పిలుపులకు ఆకర్షితులై జాతీయ బూర్జువా వర్గం రెండుగా చీలిపోయిందని- ఒకటి పూర్తిగా సామ్రాజ్య వాదులతో, భూస్వాములతో మిలాఖత్ అయిన గుత్తాధిపతుల తరగతి, రెండోది సామ్రాజ్యవాదాన్ని భూస్వాములను వ్యతిరేకించే అభ్యుదయవాదులని, వారికి నెహ్రూ ప్రాతినిధ్యం వహిస్తున్నాడని వాదించారు. ఈ వర్గ సామరస్య పంథాను కేంద్రకమిటీ తిరస్కరించినప్పటికీ ఈ వాదన కొనసాగింది.

1955 మార్చిలో జరిగిన ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ ఓడిపోయిన తరువాత ఈ విబేధాలు మరింత తీవ్రతరమయ్యాయి. రాష్ట్రంలో పార్టీ గెలుస్తుందని అంచనా ఉండేది. పాలక వర్గాలు తీవ్రమైన దుష్ప్రచారం చేసినప్పటికీ, కాంగ్రెస్ పార్టీ విపరీతంగా భయభ్రాంతులను చేస్తూ బెదిరింపులకు పాల్పడినప్పటికీ ప్రజల నుండి వచ్చిన విశేష స్పందన, జరిగిన పెద్ద పెద్ద బహిరంగ సభలు, ప్రదర్శనలు, పార్టీ గెలుస్తుందన్న పొరపాటు అవగాహనను కలిగించాయి. కమ్యూస్టులను ఓడించడానికి ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేసింది. ఎన్నికల ఫలితాలు పార్టీని తీవ్రమైన దిగ్భ్రాంతికి గురిచేశాయి. చాలామంది సభ్యులు కేవలం అయిదు ఓట్ల తేడాతో ఓడిపోయారు. 31 శాతం ఓట్లు వచ్చినా, పార్టీ కేవలం ఏడు శాతం సీట్లనే పొంద గలిగింది. దాదాపు వంద మంది కమ్యూనిస్టులకు ఎన్నికలలో 47 శాతం ఓట్లు వచ్చాయి. ఇందుకు భిన్నంగా కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు 50 శాతం ఓట్లను మాత్రమే తెచ్చుకొన్నప్పటికీ 74 శాతం సీట్లను సంపాదించాయి. పార్టీలో ఉన్న అంతర్గత విబేధాల కారణంగా ఈ ఎన్నికల ఫలితాలను పార్టీ సరిగ్గా సమీక్షించలేకపోయింది.

ఈ నేపథ్యంలో 1956 ఏప్రిల్ 19-29 మధ్యకేరళలోని పాల్ఘాట్(ఇపుడు పాలక్కాడ్)లో పార్టీ నాల్గవ మహాసభ జరిగింది. అప్పటికి పార్టీ సభ్యత్వం 75,000, కాండిడేట్ సభ్యత్వం 30,000 ఉండేది.

ఈ కాలంలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో, ముఖ్యంగా సోవియెట్ కమ్యూనిస్టు

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. నాల్గవ మహాసభ -పార్టీ అంతర్గత పోరాటం ప్రారంభం ..................... 2

2. కులము, వర్గము: మార్క్సిస్టు అవగాహన
బివి రాఘవులు ............. 4

3. చైనా కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల 'లాంగ్ మార్చ్'
ఆర్ అరుణ్ కుమార్ .......... 12

4. ఆగ్జిల్లరీ గ్రూపులు - అనుభవాలు
ఎస్ వీరయ్య ................. 17

5. జనావాసాలూ, సమాజంలో దొంతరలు
ఎంవిఎస్ శర్మ ............... 20

6. కరోనా బాధితుల కోసం సిపిఐ(ఎం) ఐసోలేషన్ కేంద్రాలు ....................... 22

7. జి7, నాటో సమావేశాలు : మరో ప్రచ్ఛన్న యుద్ధానికి సన్నాహాలు
ఎస్ వెంకట్రావు............. 24

8. సరళీకరణ విధానాలతో తీవ్రమౌతున్న వ్యవసాయ సంక్షోభం
ఎ కోటిరెడ్డి ................. 28

9. బీమా కోరేగావ్ కేసులో తప్పుడు సాక్షాల సృష్టి
ఎజి నూరాని .......... 31

10. రాష్ట్రంలో బిజెపి పెరుగుదలను నిరోధించాలి
బివి రాఘవులు..... 33



సంపాదకుడు:

**ఎస్. వెంకట్రావు**

సంపాదక వర్గం:

**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరఫున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ఫోన్: ఎడిటర్ : 9490099333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 9490098977**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com


# చైనా పార్టీకి శతవార్షిక జేజేలు

ఈ నెల 1న శతవార్షికోత్సవాలు జరుపుకున్న చైనా కమ్యూనిస్టు పార్టీ గత వందేళ్లలో సాధించిన విజయాలను కేవలం చైనా ప్రభుత్వమూ, ప్రజలే కాక మొత్తం ప్రపంచ మానవాళి సమీక్షించుకుని అనుభవాలనూ, గుణపాఠాలనూ ఆకళింపు చేసుకోవాల్సిన సమయమిది. 1921లో చైనా వాణిజ్య రాజధాని షాంఘైలో కేవలం 50 మంది సభ్యులతో ఆవిర్భవించిన చైనా కమ్యూనిస్టు పార్టీ నేడు 9 కోట్లకు పైగా సభ్యులతో ప్రపంచంలోనే అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించింది. సభ్యుల సంఖ్య పెరగడం వెనుక పార్టీ ఈ వందేళ్లలో చేసిన త్యాగపూరితమైన కృషి, సాధించిన విజయాలు ఉన్నాయన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.


చైనా పార్టీ సాధించిన విజయాల్లో ముఖ్యమైనది, అత్యంత వెనుకబడిన దేశ పరిస్థితులకు మార్క్సిజం–లెనినిజాన్ని నిర్ధిష్టంగా వర్తింపజేసి ఫ్యూడల్ సంబంధాలు బలంగా ఉన్న పెద్ద దేశంలో విప్లవం సాధించడం. రెండోది, ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల దేశంలో ప్రజలను అర్ధబానిసత్వం నుండి విముక్తి చేసి దున్నే వారందరికీ భూమి పంచడం. మూడోది, భారత దేశంతో సహా ఆసియాలోని అనేక దేశాలకన్నా వెనుకబడి ఉన్న చైనాను నేడు ప్రపంచంలోనే అత్యధిక దేశాలకు పారిశ్రామిక సరుకులు, యంత్రాలు ఎగుమతి చేసే దేశంగా తీర్చిదిద్దడం. నాలుగోది, తూర్పున రోగగ్రస్త దేశం (సిక్ మేన్ ఆఫ్‌ది ఈస్ట్)గా పిలవబడిన దేశంలో ప్రజలందరినీ పేదరికం నుండి విముక్తి చేసి, శాస్త్ర–సాంకేతిక రంగాలోనే కాకుండా క్రీడా, సాంస్కృతిక రంగాల్లో నూతన జవసత్వాలు నింపడం.

చైనా కమ్యూనిస్టు పారీ ఇంతటి మహత్తర విజయాలు సాధించడానికి, ఆ పార్టీ మార్క్సిజం– లెనినిజం సిద్ధాంతానికి అచంచలంగా కట్టుబడి పనిచేయడమే కారణం. లెనిన్ నాయకత్వంలో రష్యాలో జరిగిన మహత్తర అక్టోబరు విప్లవంతో స్ఫూర్తి పొందిన చైనా కమ్యూనిస్టులు మావో నాయకత్వంలో సుదీర్ఘమైన పోరాటాలు చేసి, 30 లక్షల మందికి పైగా ప్రాణాలు త్యాగం చేసి 1949లో విప్లవం సాధించుకున్నారు. ఆ విప్లవాన్ని రక్షించుకోడానికి కూడా పార్టీ అనేక త్యాగాలు చేసింది. బయటి శత్రువులనూ, అంతర్గత శత్రువులనూ ఎదుర్కొని నిలబడింది. 1960 దశకంలో వచ్చిన సాంస్కృతిక విప్లవ పెడపోకడలను అదిగమించింది. 1978లో ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి విప్లవాత్మక మార్పులు ప్రవేశపెట్టింది. 1990 తరువాత సోషలిస్టు వ్యవస్థ పని అయిపోయిందని చంకలు గుద్దుకున్న సామ్రాజ్యవాదులు ఇంకొద్ది రోజుల్లో చైనా కథ కూడా ముగిసిపోనున్నదని చెప్పుకొచ్చారు. అయితే చైనాలో సోషలిజం నిలదొక్కు కుంది. 2008 నుండి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో పడి ఇప్పటికీ కోలుకోలేక కొట్టుమిట్టాడుతోంది. దానికి భిన్నంగా చైనా సోషలిస్టు నిర్మాణంలో దూసుకు పోతోంది. నేడు చైనా ప్రపంచంలోనే రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. సాస్త్ర, సాంకేతిక రంగాల్లో కొత్త కొత్త ఆవిష్కరణలు చేస్తూ ప్రపంచ నెం1 స్థానానికి ఎగబాకుతోంది. ప్రపంచ మానవాళికి భవిష్యత్తు సోషలిజంలోనే ఉందన్న సందేశాన్ని ఇస్తోంది.

ఆయా మలుపుల్లో చైనా కమ్యూనిస్టు పార్టీకి మార్గదర్శనం వహించింది మార్క్సిస్టు–లెనినిస్టు సిద్ధాంతం మాత్రమే. ఆ సిద్ధాంతాన్ని కాలానుగుణంగా మారుతూ వచ్చిన పరిస్థితులకు వర్తింపజేస్తూ మావో, డెంగ్ సియావోపింగ్ వంటి నాయకులు సోషలిజం నిర్మాణాన్ని ముందుకు తీసుకుపోయారు. పార్టీ 100 వార్షికోత్సవం జరుపుకుంటున్న వేళ దాని ముందు మరికొన్ని నిర్ధిష్ట లక్ష్యాలు పెట్టుకుంది. 2020 నాటికి చైనాను ఒక మోస్తరు అభివృద్ధి చెందిన యూరప్ దేశాల స్థాయికి తీసుకుపోవాలన్న లక్ష్యాన్ని కరోనా మహమ్మారి కాలంలో కూడా అది సాధించగలిగింది. 2030 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా, 2049లో చైనా విప్లవ శతవార్షికోత్సవం నాటికి దేశాన్ని ఆధునికి సోషలిస్టు దేశంగా అభివృద్ధి చేయాలని పార్టీ నిర్ణయించుకుంది. వాస్తవానికి ప్రపంచంలోని మహామహా కొమ్ములుతిరిగిన దేశాలనుకుంటున్న అమెరికా, పశ్చిమ యూరప్ దేశాలు కరోనాతో తల్లకిందులైపోతే, లక్షలాది ప్రజలు చనిపోయి, ఆర్థిక వ్యవస్థలు, ప్రజల జీవనం కకావికలమైతే చైనా మాత్రం తన దేశంలో కరోనాను తొలినాళ్లలోనే కట్టడి చేయడమే కాకుండా, ఆర్థికాభివృద్ధిని గాడిలో పెట్టింది. సోషలిస్టు చైనా ఎదుగుదలను సహించలేని అమెరికా దాని మిత్ర దేశాలు చైనా అభివృద్ధిని నిలువరించడానికీ, సోషలిజం విశిష్టతను ప్రజల ముందు తక్కువ చేసి చూపించడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. విష ప్రచారాలు సాగిస్తున్నారు.

ఈ విష ప్రచారాలు, సామ్రాజ్యవాదుల అడ్డంకులు అధిగమించి చైనా పార్టీ, ప్రజలు తాము నిర్ణయించుకున్న లక్ష్యాలు సాధిస్తారని ఆశిద్దాం.

# కులము, వర్గము: మార్క్సిస్టు అవగాహన



రచయిత సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

బివి రాఘవులు

కులం - వర్గం ఈ రెండు అంశాలు విస్తారమైనవి. వారు నమ్మిన సిద్ధాంతాలను, వీటిపై ఒక్కొక్కరు ఒక్కో విధంగా వ్యాఖ్యానం చేస్తుంటారు. ఈ అంశాలపై వాదోపవాదాలు జరుగుతున్న ఈ నేపథ్యంలో వాటన్నింటినీ కూలంకషంగా చర్చించడానికి వివిధ పుస్తకాలు, గ్రంథాలు, విశ్లేషకుల అభిప్రాయాలను అధ్యయనం చేయటం అవసరం. చారిత్రక భౌతికవాద దృక్పథంతో కులం-వర్గం గురించి విశ్లేషించేందుకు ఈ విషయాన్ని నేను చెబుతున్నాను.

భావవాద దృక్పథం లేదా మత దృక్పథం నుంచి విశ్లేషణ చేస్తే ఒక రకంగా ఉంటుంది. లేదూ పెట్టుబడిదారీ సమాజం న్యాయమైంది, సబబు అయింది, అది అందరి ప్రయోజనాల్ని నెరవేర్చుతుందనే దృక్పథం-అంటే దీన్నే బూర్జువా ప్రజాస్వామ్య దృక్పథం, అంటే లిబరల్ దృక్పథం అంటాం- నుంచి పరిశీలించే వారికి ఈ అంశం ఇంకోరకంగా కనపడుతుంది. అయితే మనం ఏ దృక్పథాన్ని అనుసరించాలి అనేది ముఖ్యం. ఏ దృక్పథం అయితే కుల వ్యవస్థను నాశనం చేయడానికి పనికి వస్తుందో, ఏ దృక్పథం అయితే కుల వివక్షని, అంటరానితనాన్ని, సాంఘిక అసమానతల్ని సమూలంగా నిర్మూలించి సమానత్వం సాధించడానికి ఉపయోగపడుతుందో అటువంటి దృక్పథం శాస్త్రీయమైనదని మనం చెప్పుకోవాలి. ఇప్పటి వరకు వేల సంవత్సరాల పాటు ఆత్మగౌరవాన్ని, సమానత్వాని కోల్పోయిన వారంతా వాటిని తిరిగి సాధించుకోడానికి కావల్సిన దృక్పథం ఏదైతే ఉందో దానినే శాస్త్రీయ దృక్పథంగా భావించాలి. అటువంటి దృక్పథంతో మనం కులం-వర్గం అంశాల్ని అధ్యయనం చేయాలి.

డు మాంట్ అనే ఒక ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త కుల వ్యవస్థపై 'హోమో హైరాకిస్' అనే పుస్తకాన్ని రాశారు. ఆయన కుల వ్యవస్థని భావవాద దృక్పథంతో చూశాడు. మనుధర్మ శాస్త్రం గురించి తెలిసిందే. ఇవేకాకుండా చాలా రకాల సిద్ధాంతాలున్నాయి. 'అనిహిలేషన్ ఆఫ్ క్యాస్ట్' అనే గ్రంథంలో అంబేద్కర్ మరో దృక్పథం గురించి చెప్పారు. ఆ దృక్పథంలో కులవ్యవస్థ హిందూ మతం యొక్క అంతర్లీనమైన లక్షణం. ఆ హిందూ మతాన్ని సంస్కరించకుండా, మార్పు చేయకుండా ఈ కుల వ్యవస్థ నిర్మూలన సాధ్యం కాదని ఆయన దాంట్లో ప్రధానంగా చెప్పారు. ఇది కూడా ఒక రకమైన భావవాద సిద్ధాంతం, మానసిక పరివర్తనా సిద్ధాంతాన్ని దాంట్లో ఆయన ప్రతిపాదించాడు. కుల నిర్మూలన కోరుకుంటూనే, ఆ కుల నిర్మూలన కోసం మానవుల ఆలోచనల్లో, మతంలో మార్పులు రావాలని ఆయన చెప్పారు. అయితే ఆ తర్వాత కాలంలో అసలు ఈ మతం మారేది కాదు, ఈ మతాన్ని అనుసరించే వారి మనసులూ మారేవీ కావు. కాబట్టి ఈ మతాన్నే తిరస్కరించడం మార్గమని చెప్పి ఇంకో మతాన్ని ఆశ్రయించడం ద్వారా కుల వివక్షపై పోరాటం చేయాలనుకున్నాడు.

గాంధీగారు కూడా కుల వ్యవస్థ మౌలికంగా మంచిది, అది సమాజంలో ఎవరి పని వాళ్లు చేయడానికి అవసరమైన పద్ధతి అని ప్రతిపాదించారు. అంటరానితనం, హెచ్చు తగ్గులు, అంటు ముట్టడాలు ఇవన్నీ కొంత మంది స్వార్థపరులు, వాళ్లూ వీళ్లు జోడించినవే తప్ప వాస్తవంగా కుల వ్యవస్థలో అంతర్భాగం కాదని చెప్పారు. ఆయన కులవ్యవస్థను సమర్థిస్తూనే అందులో అసహ్యించుకునే కొన్ని లక్షణాలు మంచివి కావని చెప్పాడు. ఆ సిద్ధాంతాన్ని ఈనాటికీ నమ్మేవాళ్లు, ప్రచారం చేసేవాళ్ళూ ఉన్నారు.

ఇప్పుడు ఆర్ఎస్ఎస్, సంఘ పరివార్ వారు కూడా ఒక సిద్ధాంతాన్ని చెబుతున్నారు. వారు సాధారణంగా మనుధర్మ శాస్త్రాన్ని నమ్ముతారు. మనుధర్మ శాస్త్రమే దేశానికి మార్గదర్శకంగా ఉండాలని చెబుతారు. ఒక రకమైన ఆధ్యాత్మిక అవసరం కోసం ఈ కుల వ్యవస్థ భారతదేశంలో ఏర్పడింది. ఆ ఆధ్యాత్మిక అవసరం అనేది చాలా గొప్ప విషయం. ఎవరి వృత్తి వారు చేస్తూ, ఆ రకంగా వారు ముక్తి పొందేదానికి అవకాశం ఉంటుంది. ఆ రకంగా వృత్తులన్నీ సమానం. అన్ని వృత్తులూ మోక్షమార్గాలే కాబట్టి ఒక వృత్తి ఎక్కువ, ఒక వృత్తి తక్కువ కాదని వ్యాఖ్యానం చేస్తున్నారు. మరి అంటరానితనం, హెచ్చు తగ్గులు, అవమానాలు వీటి సంగతి ఏమిటి? అని ప్రశ్నిస్తే ముస్లిములు ఈ దేశంపై దాడి చేసి, హిందూ మతాన్ని అప్రతిష్టపాలు చేయడానికి కులవ్యవస్థని వక్రీకరించారు. అంటరానితనం కాని, మహిళల్ని కించపర్చడం ఇస్లామ్ మతస్థులు చేసినవే తప్ప కుల వ్యవస్థలో లేవని చెబుతున్నారు. అందుకని వాళ్లు ఈ మధ్య కాలంలో సమరసతా-సామరస్యం- అనే సంస్థని ఏర్పాటు చేశారు. దాని ద్వారా ఇటువంటి సిద్ధాంతాల్ని ప్రచారం చేస్తున్నారు. అంటే ఒకవైపున సనాతన హిందూ సాంప్రదాయాలు కలిగినవాళ్లు అటువంటి దుర్మార్గమైన అంశాల్ని సమర్థిస్తుంటారు. మరోవైపు రాజకీయంగా ఈ రోజు పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అందర్నీ ఆకర్షించి, దళితులు, ఇతరుల ఓట్లని సంపాదించాలి కాబట్టి కులాల సామరస్యం కోసం సంస్థని ఏర్పాటు చేసి, దాని ద్వారా ఈ కుల వ్యవస్థలో కొద్దిగా మార్పులు చేస్తే సరిపోతుందని ప్రచారం చేస్తున్నారు. ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే కులాన్ని అర్థం చేసుకోవడం, కులం - వర్గం మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవడం అనేది వారి వారి ప్రయోజనాలను బట్టి, వారి అవసరాల్ని బట్టి ఉంటుంది. కాబట్టి వర్గ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని

> **" అయితే ఈ పని విభజనపై ఆధారపడి ఇంకో లక్షణం కూడా ఏర్పడింది. దానిని సామాజిక పని విభజన అంటాం.సమాజం మొత్తం మీద చూస్తే ఈ పని విభజన ఎవరికి నచ్చినట్లు వారు చేసుకుంటే సరిపోదు. మొత్తం సమాజంలో శ్రమనంతటినీ నిర్దిష్టమైన నిష్పత్తిలో ఒక్కో పనికి కేటాయించాల్సి ఉంటుంది. ఉదాహరణకు మన సమాజంలో కుల వ్యవస్థలో బ్రాహ్మణులు మంత్రాలు చదివి, పూజలు చేసి కొన్ని క్రతువుల్ని నిర్వహిస్తారు. దానికి కొంత శ్రమను కేటాయి స్తున్నారు. "**

వాళ్లు చెప్పే సిద్ధాంతాల్ని పరిశీలన చేయకపోతే ఏది నిజం, ఏది కాదనే విషయం మనకు అర్థంకాదు.

### పనివిభజన

కులం లేదా వర్గం గురించి అర్థం చేసుకోవటానికి సమాజంలో శ్రమ, శ్రమ విభజన గురించి అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఈ శ్రమ, శ్రమ విభజన గురించి మార్క్స్, అంబేద్కర్, ఆడమ్‌స్మిత్, డేవిడ్ రికార్డో వంటివారు అనేకుమంది చెప్పారు. దాదాపుగా సమాజాన్ని పరిశీలించేవారంతా శ్రమ, శ్రమ విభజన గురించి చెప్పాల్సిందే. ఎందుకంటే ఆదిమ కాలంలో అన్ని పనులు ఒక్కరే చేసుకునే దగ్గర నుంచి ఒక్కో పనిని ఒక్కొక్కరు చేసుకొనే విధంగా సమాజం క్రమంగా అభివృద్ధి అవుతూ వచ్చింది. ఇప్పటికీ ఆ మార్పు జరుగుతూనే ఉంది. అంటే ఒకప్పటి అవసరాలు తక్కువ. ఆ అవసరాల్ని తీర్చుకోవడానికి ఒక మనిషో, ఒక కుటుంబమో అన్ని రకాల శ్రమ చేసుకునే పద్ధతి ఉండేది. క్రమేణా అవసరాలు పెరిగాయి. అలాగే ఆ అవసరాల్ని తీర్చే వస్తువులూ పెరిగాయి. ఆ అవసరాల్ని తీర్చుకోవడానికి, వాటిని తయారు చేసుకోవడానికి వస్తువుల్ని ఉత్పత్తి చేసుకోవడానికి ఆయా ఉత్పత్తి పరికరాలు అభివృద్ధి చెందాయి. ఒక అవసరాన్ని తీర్చుకోవడానికి అవసరమైన వనరులు తాను ఉన్న చోటు కాకుండా ఎక్కడో ఉంటాయి. కాబట్టి ఇతరుల ద్వారా ఆ అవసరాలు తీర్చుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. వీటన్నింటి మూలంగా అవసరాన్ని తీర్చుకోవడానికి అవసరమైన పనిని ముక్కలుగా చేసుకుని, ఒక్కో ముక్క ఒక్కొక్కరు చేసే పద్ధతి వచ్చింది. దీనినే పని విభజన అంటాం. కొన్ని ఉదాహరణల ద్వారా ఈ అంశాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. ఒక రైతుకు కుటుంబం ఉంది. ఆ కుటుంబంలో ఆడవాళు ఇంట్లో వంట చేసేవారు. మగవాళ్లు బయటపనికి పోయేవాళ్లు. అలాగే ఆడవాళ్లు నీళ్లు తెచ్చేవారు, కట్టే పుల్లలు కొట్టుకుని తెచ్చేవాళ్లు, పాలు పితికేవాళ్లు, మగవాళ్లు పొలం పోయి అరక దున్నేవాళ్లు, వ్యవసాయం చేసేవాళ్లు, మోపులు కట్టేవాళ్లు, మోత మోసేవాళ్లు. కాబట్టి వాళ్లకు కావాల్సిన ఆహారం ఉత్పత్తి చేసుకోవడం అనే ఒక అవసరాన్ని ఈ రకంగా ముక్కలు చేసుకుని ఆ కుటుంబంలో ఉండే పిల్లలు, ఆడవాళ్లు, మగవాళ్లు, ఒక్కొక్కరూ ఒక్కోపని చేయడం ద్వారా తీర్చుకోవటం నేర్చుకున్నారు. అంటే ముందు ఆడ, మగా మధ్య పని విభజన జరిగింది. ఆ తర్వాత ఇంట్లో ఉండే ముసలివాళ్లు కొన్ని రకాల పనులు, యువకులు కొన్ని రకాల పనులు చేసే పరిస్థితి వచ్చింది. ఆ రకంగా కుటుంబంలో పని విభజనను చూస్తాం. ఇప్పుడు మనం ఆధునిక ఫ్యాక్టరీలోకి వెళ్లామనుకోండి. ఆ ఫ్యాక్టరీలో ఒక యంత్రం ఉంది. ఒక వస్తువు తయారు కావాలి. ఒక చెప్పు తయారు కావాలి అనుకుందాం. ఆ చెప్పు తయారు చేసే దాంట్లో, ఆ ఫ్యాక్టరీలో ఒకరు తోలుని నునుపు చేస్తాడు. ఇంకొకరు తోలును కత్తిరిస్తారు. మరొకరు తోలుని కుడతారు. వేరొకరు తోలుకు వాటి అప్పర్ పార్ట్‌ని అంటిస్తారు. ఆ చెప్పుల్ని ఇంకొకరు అట్టపెట్టెలో పెడతారు. ఇంకొకరు దానికి లేబుల్ అంటిస్తారు. వాటిని ఇంకొకరు ప్యాక్ చేసి రవాణాకి సిద్ధం చేస్తారు. మరొకరు వాహానంలో తీసుకెళ్ళి, అవసరమైన వినియోగదారుడికి అందిస్తారు. అంటే ఒక చెప్పును తయారు చేయడానికి ఆ పనిని చాలా ముక్కలు చేశారు. ప్రతి ఒక్క కార్మికుడు ఆ శ్రమనంతటినీ ఉపయోగించి ఈ పనులన్నింటినీ ఒక్కడే సంపూర్ణంగా చేయవచ్చు. వివిధ రకాల పనులు ఒక శ్రామికుడు చేయడం అనే పద్ధతిని శ్రమ విభజన అనం. కాని వాటిని ముక్కలు చేసి ఒక్కరే చెప్పుని తయారు చేసే బదులు ఆ చెప్పుని పదిమంది పది ముక్కలుగా చేసుకుని తయారు చేయడం, దీనిని శ్రమ విభజన అంటాం.

ఈ రకమైన శ్రమ విభజన అన్నీ వ్యవస్థల్లో ఉంటుంది. ఆదిమ కమ్యూనిస్టు వ్యవస్థలో తెగంతా ఒక జంతువును వేటాడేందుకు వెళుంది. ఒకరి దగ్గర విల్లంబులు ఉంటాయి. వాళ్ళలో వాళ్లు ఒకరు ఉత్తర దిక్కున వెళ్లాలని, ఒకరు దక్షిణ దిక్కు వెళ్లాలని పని విభజన చేసుకుంటారు. ఎవరు దానిని భయపెట్టేందుకు అరవాలి, ఎవరు ఆ జంతువును పారిపోకుండా చూసుకోవాలి, ఎవరు ముందు బాణం వేయాలి, ఇటువంటి పని విభజన చేసుకుంటారు. ఏ విధంగా పని విభజన చేసుకున్నా అందరి లక్ష్యం జంతువును వేటాడటం. అలాగే ఇంతకు ముందు చెప్పుకున్నట్టు వ్యవసాయం వచ్చిన తర్వాత కూడా పని విభజన జరిగింది. అంటే ఆడవాళ్లు, మగవాళ్లు, పెద్దవాళ్లు, పిల్లలు, యువకులు వాళ్లు పొలంలో రకరకాల పనులు చేసి పంటలను పండించేవాళ్లు. పనిని ముక్కముక్కలుగా చేయటం వలన ఉత్పత్తి ఎన్నోరెట్లు పెరుగుతుంది. దీనిని ఉత్పాదకత పెరగడం అంటాం. అందుకని సమాజంలో జనాభా పెరిగే కొద్దీ ఉత్పాదకతను పెంచుకో వలసిన అవసరం వచ్చింది. అలాగే ఒక పనిని ఒక్కరే కొనసాగింపుగా చేస్తూ ఉంటే నైపుణ్యం కూడా పెరుగుతుంది.ఆ నైపుణ్యంతో పని ముట్లను తయారు చేసుకునే శక్తి కూడా వస్తుంది. దీని వల్ల మరింతగా ఉత్పత్తి పెరుగుతుంది. కాబట్టి శ్రమ విభజనతో ఆర్థిక ఉత్పత్తికి, సంపద పోగుపడడానికి కీలకమైన మార్పు ఈ సమాజంలో వచ్చిందని అర్థం చేసుకోవచ్చు.

### సామాజిక పని విభజన

అయితే ఈ పని విభజనపై ఆధారపడి ఇంకో లక్షణం కూడా ఏర్పడింది. దానిని సామాజిక పని విభజన అంటాం. (సోషల్ డివిజన్ ఆఫ్ లేబర్.) సమాజం మొత్తం మీద చూస్తే ఈ పని విభజన ఎవరికి నచ్చినట్లు వారు చేసుకుంటే సరిపోదు. మొత్తం సమాజంలో శ్రమనంతటినీ నిర్దిష్టమైన నిష్పత్తిలో ఒక్కో పనికి కేటాయించాల్సి ఉంటుంది. ఉదాహరణకు మన సమాజంలో కుల వ్యవస్థలో బ్రాహ్మణులు మంత్రాలు చదివి, పూజలు చేసి కొన్ని క్రతువుల్ని నిర్వహిస్తారు. దానికి కొంత శ్రమను కేటాయిస్తున్నారు. మానవ సమాజంలో ఉండే మనుషులందరి శ్రమను మంత్రాలు చదివి, పూజలు చేసి, క్రతువుల్ని నిర్వహించటానికి వినియోగించామనుకోండి. ఏమౌతుంది? సమాజం ముందుకు నడవదు. కుల వ్యవస్థలో క్షవరం చేసేందుకు ఒక ప్రత్యేక కులం ఉంది. ఇక్కడ కులం పక్కన పెడదాం. క్షవరం చేసే శ్రమ ఉ

“ సమాజం తన అవసరాల్ని బట్టి ఈ సామాజిక శ్రమ విభజనను నియంత్రణ చేస్తుంది. దానికి అనుగుణంగానే ఆ ప్రత్యేక శ్రమలో ఎంతమంది ఉండాలో నిర్ణయం అవుతుంది. అందుకని కుల వ్యవస్థలోనూ చాలా కులాల వారు తక్కువ సంఖ్యలో ఉన్నారు. ఎందుకు అలా ఉన్నారంటే సామాజిక శ్రమ విభజన అవసరాల రీత్యా ఆ రకంగా నిష్పత్తి ఏర్పడింది తప్ప ఇంకో కారణమేమీ కాదు. ”

ందనుకోండి. సమాజంలో ఉన్న అందరూ క్షవరం చేసే పని మొదలు పెడితే ఏమౌతుంది? అంతశ్రమ ఆ పనికి అవసరం లేదు. అలా చేస్తే ఆ సమాజం నడవదు. వ్యవసాయం ముఖ్యమైంది. వ్యవసాయం చేస్తేకాని బతకలేం. అయినా అందరూ వ్యవసాయం చేస్తే సమాజం నడవదు. ప్రతీ సమాజంలోని అవసరాల రీత్యా ఆ సమాజం సజావుగా నడవాలంటే, వివిధ రకాల కార్యకలాపాల కోసం మానవు లను వివిధ రకాల శ్రమల మధ్య అవసర నిష్పత్తిలో విభజన చేయాల్సి ఉంటుంది. సమాజం యొక్క అవసరాల్ని తీర్చడానికి ఒక్కో తరహా అవసరానికి ఎంత నిష్పత్తిలో శ్రమను కేటాయించాలో జనాభాని ఆ నిష్పత్తిలో భాగించి, ఆ శ్రమ చేయించడాన్ని సామాజిక పని విభజన అంటాం.

సమాజం తన అవసరాల్ని బట్టి ఈ సామాజిక శ్రమ విభజనను నియంత్రణ చేస్తుంది. దానికి అనుగుణంగానే ఆ ప్రత్యేక శ్రమలో ఎంతమంది ఉండాలో నిర్ణయం అవుతుంది. అందుకని కుల వ్యవస్థలోనూ చాలా కులాల వారు తక్కువ సంఖ్యలో ఉన్నారు. ఎందుకు అలా ఉన్నారంటే సామాజిక శ్రమ విభజన అవసరాల రీత్యా ఆ రకంగా నిష్పత్తి ఏర్పడింది తప్ప ఇంకో కారణమేమీ కాదు. సామాజిక అవసరాలు మరాయనుకుంటే ఆ నిష్పత్తి కూడా మారుతుంది. ఆ రూపంలో మనం ఈ సామాజిక శ్రమ విభజనను అర్థం చేసుకోవాలి.

ఈ సామాజిక శ్రమ విభజన ప్రాముఖ్యతను అర్థం చేసుకుంటే వర్గాన్ని, కులాన్నీ అర్థం చేసుకోవడం తేలికౌతుంది. దీనిని మార్క్స (డివిజన్ ఆఫ్ లేబర్–సోషల్ డివిజన్ ఆఫ్ లేబర్) సాధారణ పని విభజన, సామాజిక పని విభజన అని చెప్పారు. దీనిని అంబేద్కర్ ఇంకో రకంగా చెప్పారు. పని విభజన – పనివాళ్ల విభజన అని చెప్పారు. అయితే అంబేద్కర్ గారు ఏ అర్థంలో ఈ రెండు పదాల్ని వాడాడో ఆయన సాహిత్యంలో పూర్తి వివరణ ఇవ్వలేదు. పనివాళ్ల విభజన అంటే మార్క్స ప్రకారం ఒక్కో వృత్తికి ఎంత జనాభా అవసరమో ఆ నిష్పత్తి ప్రకారం సమాజంలోని ఉండే వ్యక్తులందరూ వివిధ పనుల కోసం కేటాయించబడతారు. కాబట్టి ఒక్కో రంగానికి ఎంతెంత శ్రమ అవసరమో ఆయా వ్యక్తులు ఆ రంగంలో మనగలుగుతారు. దీన్నే సోషల్ డివిజన్ ఆఫ్ లేబర్ అన్నారు. కాని అంబేద్కర్ ఏం చెప్పారు? డివిజన్ ఆఫ్ లేబరర్స్ అన్నారు. దీనిని రెండు రకాలుగా అర్థం చేసుకుంటున్నారు. అదేంటంటే పనివాళ్లను కులాలు ముక్కలు చేశాయని అది ఓ చెడ్డ విషయంగా చెబుతున్నారు. ఒక్కో ముక్క ఒక్కో విధంగా అంటే, ఎక్కువ తక్కువగా చేశారు. ఆ రకంగా అణచివేత జరిగిందని, అలా డివిజన్ ఆఫ్ లేబరర్స్ వచ్చిందని అర్థం చెబుతారు. ఈ కుల వ్యవస్థలో అంతరాలు ఎందుకు పెరిగాయి? ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనే నిచ్చెన మెట్లు ఎందుకు వచ్చాయి? అందులో అసమానతలు, హీనంగా చూడడం, అంటు, ముట్లు ఎందుకు వచ్చాయి? అంటే డివిజన్ ఆఫ్ లేబర్ కాకుండా, డివిజన్ ఆఫ్ లేబరర్స్ వచ్చింది, ఇదే కుల వ్యవస్థకు ముఖ్యం అనే అర్థంలో అంబేద్కర్ చెప్పి ఉండొచ్చు. ఇంకో విధంగా కూడా అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే పని విభజనే కాదు, సమాజంలో పనివాళ్ల విభజన కూడా జరగాల్సిందని ఇంతకు ముందు చెప్పుకున్నాం కదా. క్షవర వృత్తివారు, బట్టలుతికేవాళ్లు తక్కువగా ఎందుకుంటారు, వ్యవసాయం చేసే రైతాంగం ఎందుకు ఎక్కువగా ఉంటారు? మంత్రాలు చదివే పౌరోహితులు, బ్రాహ్మణులు అతి తక్కువ సంఖ్యలో ఎందుకుంటారు? ఆ పనులు చేయడానికి అంతకన్నా ఎక్కువ శ్రమ అవసరం లేదు కాబట్టి. అందుకని ఆ నిష్పత్తిలోనే ఆ కులం సంఖ్య ఉండేట్టు సమాజం నియంత్రణ చేస్తుంది. ఇది శ్రామికుల యొక్క విభజనే. దీనిని డివిజన్ ఆఫ్ లేబరర్స్ అనే అంటాం. అందుకని డివిజన్ ఆఫ్ లేబరర్స్‌ని మనం తప్పించుకోవడం సాధ్యం కాదు. ప్రతి సమాజంలోనూ వివిధ రంగాల మధ్య, వివిధ పనుల మధ్య నిర్దిష్టమైన నిష్పత్తిలో పనివాళ్లు విభజన అవుతారు. అది ఆదిమ కాలంలో ఒక రకంగా ఉండొచ్చు. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇంకో రకంగా ఉంటుంది. అవసరాలు, పనుల్లో, నైపుణ్యాల్లో మార్పులు రావడమే ఇందుకు కారణం. ఎందుకంటే ఈ సామాజిక శ్రమ విభజన అమెరికాలో, ఇంగ్లాండులో, రష్యాలో, చైనాలో, మన భారతదేశంలో అనాది కాలం నుండి అన్ని దేశాల్లోనూ ఉంది. కానీ ఈ సామాజిక శ్రమ విభజన భారతదేశంలోనే ఎందుకు ఘనీభవించింది. మిగతా చోట్ల ఎందుకు ఘనీభవించలేదు. సామాజిక శ్రమ విభజనలో హెచ్చు తగ్గులు అసమాన హోదాలు మనదేశంలోనే కాదు, అన్ని దేశాలలోనూ ఉన్నాయి. కూలివాడు ప్రతిదేశంలోనూ ఏరా అనే పిలువబడ్డాడు, పూజారి ప్రతిదేశంలోనూ ఉన్నతంగానే పిలువబడ్డాడు. పరిపాలకులు, రాజులు ప్రతిదేశంలోనూ ఉన్నతంగానే చూడబడ్డారు. రైతులు ప్రతిదేశంలోనూ మధ్యస్థంగానే ఉన్నారు. కాని ఆ కులంలో, ఆ తరగతిలో ఉన్నవాళ్లు ఆ తరగతిలోనే ఉండాలి. వాళ్లు అందులోనే పుట్టాలి, పైకి ఎగబాకేందుకులేదు, మారేదానికి లేదని చెప్పే ఒక ఘనీభవించిన సిద్ధాంతం మన దేశంలో కులవ్యవస్థ రూపంలో వచ్చింది. దానికి కారణమేంటి? అనాది కాలం నుండి భారతదేశంలో ఈ సామాజిక గుర్తింపు అనేది సామాజిక అసమానతలు, సామాజిక అసహ్యత, అంటే సామాజికంగా వెలివేసే స్థితికి, అదికూడా ఇక శాశ్వతంగా వెలివేత అని, అది ఘనీభవించడానికి అదనంగా ఏం తోడ్పడిందనేది పరిశీలన చేసుకోవాలి.

ఈ సామాజిక పని విభజనలో నుంచి సమాజంలోని ఒకానొక దశలో ప్రతి మనిషీ తన శ్రమ ద్వారా తన అవసరాలు తీర్చుకోవడంతో పాటు, అంతకు మించి ఇతరుల అవసరాలు తీర్చగలిగేంత ఉత్పత్తి చేయగలిగే స్థితి వచ్చింది. దీన్నే మనం అదనపు ఉత్పత్తి చేయగలిగే సామర్థ్యం అంటున్నాం. ఇది శ్రమ విభజన, సామాజిక శ్రమ విభజన ద్వారా సాధ్యమైంది. ఒకప్పుడు శ్రమ విభజన

> **❝ కుల వ్యవస్థ ఎప్పుడు పుట్టింది, ఎలా పరిణామం చెందింది, ఎలా మార్పులు చెందుతూ వచ్చింది, ఇప్పుడు ఏ రూపంలో ఉంది, ఎటువంటి లక్షణాలు కలిగి ఉందో అధ్యయనం చేయాలి. వేదకాలం నాడు వర్ణాల రూపంలో ముందుకు వచ్చింది. ఆ తర్వాత వ్యవసాయం స్థిరపడి, గ్రామాల ఏర్పాటుతో ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందింది. దానిలోకి అనేక తెగలు ప్రవేశించటంతో పాత వర్ణవ్యవస్థ రూపం నుండి జాతి కుల వ్యవస్థలోకి మారింది. ❞**

లేని కాలంలో సమాజానికి అవసరమైనవి కూడా ఉత్పత్తి చేసుకోలేకపోయేవారు. చాలా సందర్భాల్లో పస్తులు ఉండాల్సి వచ్చేది. అటువంటప్పుడు జనం చనిపోయేవాళ్ళు, అంటే వాళ్లు ఎంతైతే ఉత్పత్తి చేయగలిగేవాళ్లో అంత ఉత్పత్తికి సరిపోయే జనాభాకే తిండి ఉండేది. కానీ ఎప్పుడైతే పని విభజన బాగా పెరిగిందో, తమకు సరిపోయిన దాని కన్నా ఎక్కువ ఉత్పత్తి చేయగలిగే శక్తి వచ్చింది. దీన్నే మనం అదనపు ఉత్పత్తి చేసే సామర్థ్యం అని అంటాం. దీనికి కారణం ప్రధానంగా పని విభజన, సామాజిక పని విభజన. అయితే ఈ అదనపు ఉత్పత్తి వచ్చిన తర్వాత సమాజంలో రెండు పరిణామాలు జరిగే అవకాశం ఉంది. ఈ అదనపు ఉత్పత్తిని అందరికీ పంచి, వాళ్లు అదనంగా ఆహారాన్ని, అదనపు సౌకర్యాల్ని పొందే అవకాశం ఉంది. ఆదిమ సమాజాల్లో ఇలా జరిగేది. లేదా కొంత మంది పనిచేసి మిగతా వారు విశ్రాంతి తీసుకునే అవకాశం వుంటుంది. ఇది ఇప్పటికీ కొన్ని గిరిజన తెగల్లో ఉంది. బాగా పంటలు పండే ప్రాంతాల్లో వారు కొద్దిరోజులు పనులకు పోరు. వారి వద్ద మిగులు ఉత్పత్తి అయిపొయ్యేసరికి మళ్లీ పనిలోకి వెళతారు. లేదా కొంత మంది పనిచేస్తూ ఉంటే, పని చేయని కొంతమంది ఈ ఉత్పత్తిని అనుభవించవచ్చు. ఉదాహరణకి కొంతమంది పౌరోహితులుగా, వారికి రక్షణగా కొంతమంది, రాజ్యాన్ని నిర్వహించే కార్యకలాపాల్ని సాగించేందుకు, అవసరమైన ఇతర పనుల్ని చేయడానికి కొంతమంది ఉండొచ్చు. ఈ అదనపు ఉత్పత్తి జరిగిన తర్వాత ఆ ఉత్పత్తిపై ఆధారపడి, ఉత్పత్తితో సంబంధం లేని కొన్ని పనులలో కుదురుకొని బతికే సమాజాలు వచ్చాయి. వీటినే వర్గ సమాజాలు అంటాం. అంటే అదనపు ఉత్పత్తి వచ్చినప్పుడు ఉత్పత్తికి సంబంధం లేని పనుల్ని చేయడం కాని లేదా ఏ పనీ చేయకుండా అజమాయిషీ, ఆధిపత్యం చేసే పనుల మీద ఉండికానీ, ఈ అదనపు ఉత్పత్తిపైన ఆధారపడి బతికే సమాజాలు వచ్చాయి. ఇవి సమాజంలో ఉత్పత్తి చేసే తరగతులు, ఇతరులు చేసిన ఉత్పత్తి మీద ఆధారపడి పనిచేసే తరగతులుగా విభజన జరిగింది. భారతదేశంలో మొదట నాలుగు వర్ణాలు ఏర్పడ్డాయి. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు. వాస్తవంగా శూద్రులు, వైశ్యులు వీళ్లు ఉత్పత్తిలో పనిచేసేవాళ్లు. వైశ్యులు వ్యవసాయదారులు, శూద్రులు వ్యవసాయంలో శ్రమ చేసేవాళ్లు. క్షత్రియులు పరిపాలన చేసేవాళ్లు. బ్రాహ్మణులు క్రతువులు, కర్మకాండలు నిర్వహించేవారు. ఇదో రకమైన సామాజిక శ్రమ విభజనగా అభివృద్ధి అయింది. మొదటి రెండు తరగతులు ఉత్పత్తి కార్యక్రమంలో పాల్గొనేవారు కాదు. చివరి రెండు తరగతులు ఉత్పత్తి, అదనపు ఉత్పత్తి చేస్తే ఆ ఉత్పత్తిని పంచుకోవడం ద్వారా వీళ్లు బతికేవాళ్లు. ఈ విధంగా ఇతరులు చేసే అదనపు ఉత్పత్తి మీద ఆధారపడే వర్గాలు మొట్టమొదటిసారిగా వచ్చాయి. దీనిని వర్గ సమాజం అని చెబుతాం. కాబట్టి ఇటు నిచ్చెనమెట్లు లాగా కుల సమాజం రావడానికి లేదా వర్గ సమాజం రావడానికి శ్రమ విభజన, ఉత్పాదకత పెరగటమే కార ణం. ఇతర దేశాల్లో ఎస్టేట్‌లు ఉన్న సమాజాలు కూడా వర్గ సమాజాలే. ఎస్టేట్ అంటే కులీన తరగతులు అంటే రాజులు, చర్చి ప్రభువులు, రైతులు, అర్ధ బానిసలు దిగువ తరగతివారు. ఈ రకంగా మూడు వర్గాలుగా విభజన అయింది. ఇక్కడ మనం శూద్రులు, వైశ్యులు, క్షత్రియులు, బ్రాహ్మణులు ఎలాగో అక్కడ త్రీ ఎస్టేట్స్ అలాగ. ఇటువంటివన్నీ అన్నీ సమాజాల్లోనూ వచ్చాయి. భారతదేశంలో వర్ణ వ్యవస్థ, ఆ తర్వాత కుల వ్యవస్థ రూపంగా మారింది. వర్గాల ఆవిర్భావం, వర్గ దోపిడీ, ఆ వర్గాల ప్రాతిపదిక మీద రాజకీయ వ్యవస్థ ఏర్పాటు, రాజ్యం, ఆధ్యాత్మిక ఇతర మేధోపర మైన పనులు చేసేవాళ్లు ఇతరులు చేసిన ఉత్పత్తిలో భాగం పంచుకుని బతికే సమాజాలు వచ్చాయి.

**కులం**

కులం తర్వాత వర్గం గురించి, ఈ రెండింటి మధ్య ఉన్న సంబంధాల్ని గురించి తెలుసుకుందాం. కుల వ్యవస్థ ఎప్పుడు పుట్టింది, ఎలా పరిణామం చెందింది, ఎలా మార్పులు చెందుతూ వచ్చింది, ఇప్పుడు ఏ రూపంలో ఉంది, ఎటువంటి లక్షణాలు కలిగి ఉందో అధ్యయనం చేయాలి. వేదకాలం నాడు వర్ణాల రూపంలో ముందుకు వచ్చింది. ఆ తర్వాత వ్యవసాయం స్థిరపడి, గ్రామాల ఏర్పాటుతో ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందింది. దానిలోకి అనేక తెగలు ప్రవేశించటంతో పాత వర్ణవ్యవస్థ రూపం నుండి జాతి కుల వ్యవస్థలోకి మారింది. మనం ఆ పాత వర్ణవ్యవస్థని వర్గ వ్యవస్థకు నమూనాగా చూడవచ్చు. ఈ జాతి వ్యవస్థ వచ్చిన తర్వాత వర్గ వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. క్రీస్తు శకం 300–500 గుప్తుల కాలం నాటికి వచ్చేసరికి అంటరాని తరగతి అనేది తోడైంది. ఆనాడే మనుధర్మ శాస్త్రం వచ్చింది. ఈ జాతి వ్యవస్థ పూర్తిగా ఘనీభవించి, క్రీస్తుశకం 600 నాటికి పుట్టుక ప్రాతిపదిక మీద కుల వ్యవస్థ కర్కోటకంగా కొనసాగే పద్ధతి వచ్చింది. తర్వాత ఇస్లాం మతస్తులు రావడం, ఫ్యూడల్ వ్యవస్థ బలపడటం, బ్రిటీషువాళ్లు రంగంలోకి రావడం, భారతదేశంలో స్వచ్ఛమైన బానిస, ఫ్యూడల్ వ్యవస్థలు ఏర్పడకపోవడం, యూరప్‌లలో లాగా అర్ధ బానిసలు రూపొందకపోవడం, జాతుల రూపంలో ఇక్కడ కొనసాగడం, పాశ్చాత్య దేశాల్లోని బానిస, ఫ్యూడల్ వ్యవస్థలు రెండూ మేళవించిన పద్ధతిలో ఇక్కడ వ్యవస్థ ఆవిర్భవించటం చూశాం. వీటికి సంబంధించి కూడా వాదోపవాదాలు ఉన్నాయి. కుల వ్యవస్థకు సంబంధించిన లక్షణాలపై అనేకమంది సామాజిక విశ్లేషకులు వాఖ్యానం చేశారు. మార్క్స్ కూడా చేశారు. కుల వ్యవస్థలో మొదటి లక్షణంగా. 'ప్రతి కులానికి ఒక వృత్తి" అని చెప్పారు. ఏ కులంలో పుట్టినవారు ఆ వృత్తిలోనే కొనసాగాలి. రెండోది కులమనేది నీ ఇష్టం కాదు. ఏ కులంలో పుడితే ఆ కులమే నీకు వంశపారంపర్యం అవుతుంది. అలాగే ఇది దొంతర వ్యవస్థ, ఒక కులంపై ఇంకో కులం ఉండేట్లుగా ఏర్పడింది. కింది కులం, పైకులం, ఆ పై కులం, ఆ రకంగా కుల వ్యవస్థలోని హెచ్చుతగ్గులు ఉంటాయి. అందుకని కుల వ్యవస్థలో ప్రతి కులానికీ స్థానం ఉంటుంది. కులవ్యవస్థలో దాని స్థానాన్ని బట్టి ఆ కులానికి ఇచ్చే సామాజిక గౌరవం నిర్ణయించబడుతుంది.

> " సమాజంలో శ్రమ చేసే వ్యక్తులు నిర్వహిస్తున్న పాత్రను బట్టి, ఉత్పత్తి సాధానాల మీద ఆ వ్యక్తుల యొక్క యాజమాన్యం, ఉత్పత్తిలో వారు తీసుకునే భాగాన్ని బట్టి వర్గాన్ని నిర్ణయిస్తాం. దీనిని విడివిడిగా చెప్పాలంటే మూడు అంశాలుం టాయి. 1 ఉత్పత్తిలో ఆ వ్యక్తి శ్రమ పాత్ర ఎలా ఉంది? 2 ఆ ఉత్పత్తిలో ఉపయో గించే ఉత్పత్తి సాధనాలతో ఆ వ్యక్తికి ఉండే సంబంధం. 3 అయిన ఉత్పత్తిపై ఆ వ్యక్తికుండే సంబంధం ఏంటి? ఈ 3 అంశాలపై ఆధార పడి ఉత్పత్తిలో ఆ వ్యక్తి స్థానం నిర్ణయమౌతుంది. "

అలాగే ప్రతి కులానికీ దానికి ఉండే స్వచ్ఛతా, మాలిన్యం నిర్ణయించబడుతుంది. మాలిన్యం స్థాయిని బట్టే పరస్పరం సహకరించుకోవడం, కలుసుకోవడం, పరస్పర సంబంధాలు ఏర్పాటు చేసుకోవటం తదితరాలు ఉంటాయి. కింది స్థాయివారిని హీనంగా చూసే కొన్ని పద్ధతులు, వాళ్లని అంటుకోకపోవడం వంటివి ఉంటాయి. అలాగే ఏ కులంలో పుడితే ఆ కులంలోనే పెళ్లి చేసుకోవాలి. కులాంతర వివాహం అనేది నిషేధం. మరికొన్ని కులాలకు చదువు నిషేధిం చబడింది. ఆస్తి హక్కు నిషేధించ బడింది. ఇవి కులవ్యవస్థలోని ప్రత్యేక లక్షణాలుగా మనం చెప్పుకోవచ్చు. మనుధర్మ శాస్త్రంలో, ఇతర గ్రంథాల్లో ఇటువంటి లక్షణాలను గురించి చెప్పారు. వీటిల్లో కొన్ని మినహాయింపులు, మార్పులు కూడా తర్వాత వచ్చాయి.

సామాజిక శ్రమ విభజన, సామాజిక అసమానతలు ప్రతి సమాజంలో ఉన్నాయని చెప్పుకున్నాం. అలాగే ఈ సామాజిక అంతరాలు అంటే స్టేటస్ కూడా ఒక్కొక్క అంతస్తుకి ఒక్కొక్క సామాజిక స్థాయి ఉన్నది. మన సమాజంలో కులవ్యవస్థ ద్వారా వచ్చిన ఈ అసమానతలకు మిగతా సమాజాల్లో ఉండే అసమానతలకు తేడా ఉంది. యూరోపియన్ సమాజాల్లో వాషర్ మెన్‌లు, బార్బర్లు, కార్పెంటర్‌లు, వ్యవసాయదారులు, అర్ధ బానిసలు, నొబిలిటీ, లార్డ్స్ ఆ రకంగా వృత్తుల వాళ్లున్నారు. దీన్నే సోషల్ డివిజన్ ఆఫ్ లేబర్, వృత్తుల విభజన అంటాం. ఈ పద్ధతి యూరప్, చైనా వంటి దేశాల్లో ఉంది. ఆ దేశాల్లో ఒక వృత్తి చేసేవాడు మరో వృత్తిలోకి మారేందుకు అవకాశం ఉంది. ఒక వృత్తి నుండి మరో వృత్తిలోకి మారేందుకు భారతదేశంలో ఉన్న నిషేధం ఇతర దేశాల్లో లేదు. ఒక వ్యక్తి ఉన్నతమైన శక్తి సామర్థ్యాల్ని కలిగి ఉంటే హీనంగా ఉండే ఒక వృత్తి నుంచి ఉన్నతమైన వృత్తులకు మారేందుకు అవకాశం ఉంది. కాని భారతదేశంలో ఉన్న కులవ్యవస్థ ఆ రకంగా మారటాన్ని అసాధ్యం చేసింది. మతం, దాని ప్రాతిపదికగా రాజ్యం కూడా దానిని శాసించాయి. అక్కడేమో సామాజిక ఒత్తిడి మూలంగా ఆ వృత్తిలోనే కొనసాగాల్సిన పరిస్థితులున్నాయి. ఇక్కడ సామాజిక ఒత్తిడే కాకుండా, మతం, రాజ్యం ఒత్తిడి, శిక్షలు విధించటం ద్వారా నిరోధించారు. కాబట్టి ఇక్కడ పుట్టుకతో వచ్చిన వృత్తిలో నుంచి ఇంకో వృత్తిలోకి మారేందుకు అవకాశం లేదు. అక్కడేదో సులభంగా ఇంకో వృత్తిలోకి మారేందుకు అవకాశం ఉందని అనలేం. అక్కడ కూడా మార్పుని నిరోధించే సామాజిక ఒత్తిళ్లున్నాయి. ఆధ్యాత్మిక ఒత్తిడి. ఆపై రాజ్యం, శిక్షలు ఆ రకమైన పరిస్థితులు అక్కడ లేవు. అలాగే వంశ పారంపర్యం, అంటే ఒక కులంలో పుట్టిన వాడు అదే కులంలో కొనసాగాలి. వ్యక్తిగతంగా, స్వేచ్ఛగా నచ్చినట్లు మారేదానికి సాధ్యం కాని పరిస్థితులున్నాయి. మరి ఒక వృత్తిలో, ఒక సామాజిక స్థాయిలో పుట్టిన వాడు ఇంకో సామాజిక స్థాయిలోకి పడిపోవడానికి, ఎదిగేందుకు ఇతర సమాజాల్లో అవకాశం ఉందా అంటే అక్కడ కూడా అంత సులువు కాదు. అయితే అక్కడ నిషేధం లేదు. కాని కుల వ్యవస్థలో అలా కాదు. నీకు ట్యాలెంట్ ఉండి రకరకాల విషయాల్లో తెలివితేటల్ని ప్రదర్శించినా తక్కువ కులం, మతంలోని ఆధ్యాత్మిక ప్రాతిపదిక వల్ల వారికి ప్రభువు వేరే స్థానాన్ని ఇవ్వడానికి అసాధ్యమైన పరిస్థితులు ఇక్కడ ఉన్నాయి.

ఇతర సమాజాల్లో అటువంటివి ఎందుకు సాధ్యం అయ్యాయంటే పని విభజన జరిగి, కొత్త రకమైన పని వచ్చినప్పుడు ఆ పనికి కొత్త కులం కావాలి. అక్కడ నైపుణ్యం ఉన్నవాడు ఏ సోషల్ స్టేటస్‌కు ఎగపాకేందుకైనా అవకాశం ఉంటుంది. అక్కడ కొత్త పని వచ్చి, పని విభజన జరిగి అప్పటి వరకూ సమాజంలో లేని నైపుణ్యమైన పని వస్తే అంతకముందు దానికి దగ్గరగా ఉండే వృత్తిచేసే మరో కొత్త వృత్తి సముదాయం ఏర్పడుతుంది. అలా వివిధ రకాల సామాజిక తరగతులలో నైపుణ్యం గలవాళ్లు వచ్చి ఆ వృత్తిలోకి వెళ్లేందుకు ఎటువంటి సమస్యా రాదు. కులానికి ఏటువంటి లక్షణాలు చెప్పుకుంటున్నామో ఇటువంటివన్నీ ఇతర సమాజాల్లోనూ ఉన్నప్పటికీ ఆ సమాజాల్లో లేనిది ఇక్కడ ఉన్నది ఏంటంటే సోషల్ స్టేటస్, హెచ్చుతగ్గులు, ముట్టుకోవడం, అంటుకోవడంపై నిషేధాలు. మానవ శక్తి, కృషితో తమ స్థానాలను కాస్త అటూ ఇటూ మార్చుకోవడానికి అక్కడ అవకాశాలున్నాయి. కాని కుల వ్యవస్థలో పాటు, మతం, చట్టం, రాజ్యం, శిక్షలు ఇటువంటివాటిని జోడించి అసాధ్యం చేసే పరిస్థితి వచ్చింది. అందుకనే దీనిని (ఫ్రోజెన్ సిస్టమ్) (ఘనీభవించిన వ్యవస్థ) అని మార్క్స్ అన్నాడు.

## వర్గం

మరీ ఈ కుల వ్యవస్థని మనం వర్గ వ్యవస్థ అనవచ్చా? కులానికి, వర్గానికి సామ్యం ఉందా? అదీ ఇదీ ఒకటేనా? ఏదైనా వ్యత్యాసం ఉందా? అనేది తెలుసుకోవాంటే వర్గం గురించి కూడా చెప్పుకోవాలి. వర్గం అనే భావం కూడా చాలా వివాదాస్పదమైనదే. వర్గం అనే మాటని అంబేద్కర్ చాలా సార్లు వాడారు. మార్క్స్ కూడా వాడారు. మాక్స్ వెబర్, ఆడమ్‌స్మిత్, రికార్డో వంటి వారు కూడా వర్గం అనే మాటని వాడారు. వర్గం గురించి అంబేద్కర్ భావన మాక్స్ వెబర్‌కు దగ్గరగా వుంటుంది. వర్గం అనే మాటని మనం కూడా రకరకాల సందర్భాల్లో వింటున్నాం.

వర్గాన్ని నిర్వచించడానికి ఆదాయంతో పాటు ప్రధానంగా అధికారం, హోదాలను మాక్స్‌వెబర్ కొలబద్దలుగా తీసుకున్నారు. వ్యక్తులు ఉత్పత్తి వ్యవస్థలో నిర్వహించే పాత్రను మార్క్స్ ప్రధానాంశంగా తీసుకున్నారు.

మనం కూడా అప్పుడప్పుడు అంటే రోజువారీ మాటల్లో, రాతల్లో, ఉపన్యాసాల్లో ఆదాయాన్ని బట్టి వర్గాన్ని విశ్లేషిస్తాం. ఈ రకమైన విభజన శాస్త్రీయమైనది కాదు. ఉదాహరణకు ఒకడు ఏ పనీ చేయకుండా బిక్షాటన చేసుకుంటూ ఉంటాడు. అలాగే ఒక వ్యక్తి కూలీగా పనిచేస్తుంటాడు. భిక్షాటన చేసేవారు ఉత్పాదక కార్యక్రమంలో పాల్గొనరు. కానీ కూలీలుగా పనిచేసేవారు పాల్గొంటారు. అలాగే సామాజిక శ్రమ విభజనలో భాగస్వాములు. కాని భిక్షాటన చేసేవారు సామాజిక శ్రమ విభజనలో భాగాస్వాములు కాదు. వారు భిక్షాటన చేయకపోతే సమాజం ఏమీ ఆగిపోదు. కాని కూలీ పని చేసుకునేవారు పనికి పోకపోతే ఆ మేరకు ఉత్పత్తి ఆగిపోతుంది. కానీ ఇద్దరూ

పేదరికాన్ని అనుభవిస్తున్నారు. ఆదాయ కొలబద్ధ అయితే ఇద్దరూ ఒక వర్గం అవుతారు. ఉత్పత్తి కొలబద్ధ అయితే వేర్వేరు వర్గం అవుతారు. సమాజంలో శ్రమ చేసే వ్యక్తులు నిర్వహిస్తున్న పాత్రను బట్టి, సమాజంలో ఉండే ఉత్పత్తి సాధానాల మీద ఆ వ్యక్తుల యొక్క యాజమాన్యం, ఉత్పత్తిలో వారు తీసుకునే భాగాన్ని బట్టి వర్గాన్ని నిర్ణయిస్తాం. దీనిని విడివిడిగా చెప్పాలంటే మూడు అంశాలుంటాయి. ఒకటి ఉత్పత్తిలో ఆ వ్యక్తి శ్రమ పాత్ర ఎలా ఉంది? రెండోది ఆ ఉత్పత్తిలో ఉపయోగించే ఉత్పత్తి సాధనాలతో ఆ వ్యక్తికి ఉండే సంబంధం. మూడోది అయిన ఉత్పత్తిపై ఆ వ్యక్తికుండే సంబంధం ఏంటి? ఈ మూడు అంశాలపై ఆధారపడి ఉత్పత్తిలో ఆ వ్యక్తి స్థానం నిర్ణయమౌతుంది. ఒకే రకమైన స్థానం గల వ్యక్తులందర్నీ ఒక వర్గంగా మనం భావిస్తాం. ఇంకా సూక్ష్మంగా చెప్పాలంటే, సమాజంలో ఉత్పత్తి కార్యకలాపాల్లో ఒక వ్యక్తి నిర్వహించే శ్రమ ప్రాతిపదిక మీద అతని వర్గ స్థానం నిర్ణయిస్తాం తప్ప అతనికి వచ్చే ఆదాయ ప్రాతిపదిక మీద కాదు. ఆధునిక సమాజంలో ఫ్యాక్టరీ ఉందనుకోండి. అక్కడ శ్రమ చేసేవాళ్లు, యంత్రాలు, పరికరాలు, షెడ్లు ఉంటాయి. ఆ యంత్రాలు, పరికరాలతో శ్రమ చేసేవాళ్లకు సంబంధం ఉండదు. అవన్నీ యజమానికి చెందినవి. అంటే యజమాని వాటికి అధిపతి అవుతాడు. అలాగే ఆ ఫ్యాక్టరీలో వస్తువుల్ని ఉత్పత్తి చేస్తారు. ఆ ఉత్పత్తితో శ్రామికుడికి సంబంధం ఉండదు. ఆ ఉత్పత్తి శ్రామికుడిది కాదు. దానిలో నుండి ఆ వ్యక్తికి వాటా రాదు. అది పూర్తిగా యజమానికే చెందుతుంది. కాబట్టి ఈ మూడు అంశాల్ని చూసినప్పుడు ఇక్కడ శ్రమ చేయనివాడు యజమాని, అతనిని పెట్టుబడిదారుడు అని, శ్రమ చేసిన వానిని కార్మికుడు అంటాం.

గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామి, ధనిక రైతు, మధ్యతరగతి, పేద రైతు, వ్యవసాయ కార్మికుడు ఇలా విభజిస్తాం. పట్టణాల్లో అయితే కార్మికుడు, పెట్టుబడిదారుడు, సెల్ఫ్ ఎంప్లాయ్ ఈ మూడు రకాలుగా విభజిస్తాం. ఈ మూటింటికి సంబంధం లేకుండా ఉండేవాళ్లు కొంతమంది ఉంటారు. వారు ఈ వర్గాలకి దూరంగా ఉంటారు. వారు ఉత్పత్తి కార్యకలాపాల్లో పాల్గొనరు. ఉదాహరణకు భిక్షాటన చేసుకునేవాళ్లు.

### కులం – వర్గం

ఇప్పుడు కులాన్ని, వర్గాన్ని పోల్చి చూదాం. కుల వ్యవస్థను మనం వర్గ వ్యవస్థ అనవచ్చా? ఎందుకంటే వీటి మీద కూడా రకరకాల వాదోపవాదాలున్నాయి. వివిధ దేశాల్లో వర్గ వ్యవస్థ ఉంది. భారతదేశంలో కుల వ్యవస్థ ఉంది. కాబట్టి కులవ్యవస్థ భారతదేశ వర్గ వ్యవస్థ అని వాదన చేసే వాళ్లున్నారు. మరో వాదన కులం వేరు, వర్గం వేరు అని అంటున్నారు. కులం అనేది ఒక వ్యక్తి యొక్క ఆస్తి సంబంధాల్లో, శ్రమ సంబంధాల్లో నిర్ణయించేది కాదు. అందుకనే వర్గ వ్యవస్థగా అనుకోకూడదనే వాదన ఉంది.

> ❝ ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ దగ్గరకు వచ్చేసరికి వర్గ వ్యవస్థ పాత కాలపు కుల వ్యవస్థ, ఈ రెండు పూర్తిగా విడిపోయి, కుల వ్యవస్థ అనేది వర్గ వ్యవస్థను వ్యక్తీకరించే స్థాయి లేకుండా పోయింది. వర్గ వ్యవస్థ పూర్తిగా భిన్నమైపోయిందని మనం చెబుతాం. ❞

ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ దగ్గరకు వచ్చేసరికి వర్గ వ్యవస్థ పాత కాలపు కుల వ్యవస్థ, ఈ రెండు పూర్తిగా విడిపోయి, కుల వ్యవస్థ అనేది వర్గ వ్యవస్థను వ్యక్తీకరించే స్థాయి లేకుండా పోయింది. వర్గ వ్యవస్థ పూర్తిగా భిన్నమైపోయిందని మనం చెబుతాం.

ఆధునిక పెట్టుబడిదారీ విధానానికి ముందున్న కుల వ్యవస్థకీ, వర్గ వ్యవస్థకీ ఉన్న సామ్యాన్నీ లేదా తేడాని మనం పరిశీలిద్దాం. భారతదేశంలో కుల వ్యవస్థను తీసుకుంటే ఇక్కడ నాలుగు వేల నుంచి ఐదు వేల కులాలున్నాయి. ఇప్పుడు మనం దళితులుగా చెబుతున్నవారు కూడా అనేక కులాల సముదాయం. అలాగే గిరిజనులలో అనేక తెగలు ఉన్నాయి. గిరిజనులను కులం అనడం సాధ్యమా! తెగలు అంటాం. కులమే వర్గం అనేపనైతే ఈ తెగల్ని ఎక్కడ వేయాలి? కులాలు, తెగలూ వేరుగా ఉన్నాయి. భారతదేశంలో కులమే వర్గం అయిన తర్వాత ఈ తెగలు ప్రత్యేకంగా ఉండకూడదు కదా. మన దేశంలో జనాభా లెక్కల ప్రకారం దాదాపుగా 8 శాతం జనాభా తెగల్లో ఉన్నారు. రెండోదేంటంటే కులమే వర్గం అయినప్పుడు నాలుగువేల కులాల్ని నాలుగువేల వర్గాలు అని అనలేం కదా. కాబట్టి కులమే వర్గం అనే వాదన సరైంది కాదు. కొన్ని కులాల సమూహాన్ని ఒక వర్గం అనొచ్చు. ఉదాహరణకు దళితులే ఉన్నారనుకోండి. అంటే పాత కాలంలో అస్పృశ్యులున్నారని చెప్పుకున్నామో వారికి ఆస్తి లేకుండా, చదువు లేకుండా ఒక రకంగా పూర్తి స్థాయి బానిసలు కాకపోయినా, అర్థ బానిసల పద్ధతిలో వాళ్లు వ్యవసాయంలో పనిచేశారు. దానికి సంబంధించిన కులాలన్నింటినీ కలిపి ఒక వర్గంగా చెప్పుకోవచ్చు. భూమిపైన శ్రమ చేస్తూ ఉన్న వర్గాన్ని రైతాంగంగా, భూమిపై ఆధిపత్యం ఉండి, శ్రమ చేయకుండా సంపదను దోచుకుంటున్న వారిని భూస్వామ్యవర్గంగా విభజన చేయాల్సి ఉంటుంది. అలాగే క్షత్రియులు అని అంటాం. వీరు పరిపాలనా చేసేవాళ్లు. యూరోపియన్ దేశాల్లో వీళ్లని నోబిలిటీ అంటారు. బ్రాహ్మణులు, క్షత్రియులు వంటి పరిపాలన చేసే కులాలు. వీరందర్నీ కలిపి ఒక బృందంగా చెప్పవచ్చు. కుల వ్యవస్థని వర్గ వ్యవస్థతో పోల్చితే ఎటువంటి సామ్యం ఉంది అంటే కొన్ని కులాల సముదాయాల్ని కలిపి ఒక వర్గ బృందంలో చేర్చవచ్చు తప్ప ప్రతి కులాన్ని ఒక వర్గంగా చెప్పడం సాధ్యం కాదు. శ్రమ చేస్తూ ఉత్పత్తి సాధనాలపైన ఏ యాజమాన్యం లేనివాళ్లు ఒక వర్గం అనుకుంటే, రకరకాల కులాల వారికి ఈ లక్షణం ఉంది. ఇటువంటి లక్షణాలు గల కులాలన్నింటినీ తీసుకొచ్చి ఒక వర్గంలో పెట్టాల్సి ఉంటుంది. ఆ రకంగా చూసినప్పుడు కులవ్యవస్థలో ప్రతి కులం ఒక వర్గం కాదు.

గ్రామంలో రైతాంగం ఉంది. వారు ఈ అంటరాని కులాల వాళ్లతో పని చేయించుకుంటున్నారు. మరి వాళ్లు శ్రమ చేస్తున్నారు, ఉత్పత్తి చేస్తున్నారు. ఇక్కడ కులవ్యవస్థలో ప్రత్యక్ష దోపిడీ ఎవరు చేస్తున్నట్లు? భూస్వాములు, ఆధిపత్యం చెలాయించే వారు అగ్రకులాలు పరిమిత సంఖ్యలోనే ఉంటారు. వారికి ఎక్కువ భూమిపై ఆధిపత్యం ఉంటుంది. ఎక్కువ సంపద పోగుచేసుకుంటారు. అదే కులంలో ఉండే పేద రైతులు పేదలుగానే ఉంటారు. వీరందరూ ఒకే కులంలో ఉంటారు. కాని వారి మధ్య ఆర్థిక వ్యత్యాసాలుంటాయి. అయినా కులాధిపత్యంతో వచ్చే సోషల్ స్టేటస్‌ను ప్రదర్శిస్తుం

❝ ఇప్పుడు కార్మికుల్లో కూడా అన్ని కులాల నుంచి వచ్చిన వాళ్లున్నారు. అగ్రకులాల నుండి అంటరాని కులాలని ముద్రవేసినవాళ్లు అందరూ ఉన్నారు. వారితో పాటు ఆనాటి పాత సమాజంలో ఉండే వాసనలు కూడా వస్తాయి. కనుక భారతదేశంలో కార్మికవర్గం ఏర్పడిన తీరును చూసినప్పుడు ఆధునిక ఫ్యాక్టరీల రీత్యా, ఉత్పత్తి రీత్యా, విజ్ఞానం రీత్యా, అలాగే దాని యొక్క నైపుణ్యాల రీత్యా అత్యంత ఆధునిక మైంది. ఆలోచనలో మాత్రం పాత వ్యవస్థలో నుంచి వచ్చిన అవశేషాలు ఇంకా ఉన్నాయి. ❞

టారు. శ్రమ రీత్యా చూసుకుంటే ఒకే కులంలోని వాళ్లు కూడా దోపిడీ చేయబడుతుంటారు. అటువంటప్పుడు వారిని దోపిడీలో భాగం పంచుకుంటున్నవాళ్ల వర్గం అని ఎలా అంటాం? వీరందర్నీ అదే వర్గంలో ఎలా వేస్తాం? అప్పుడు కులాన్ని మొత్తంగా తీసుకెళ్లి ఒక వర్గంలో వేయలేం కదా. అందుకనీ శ్రమ రీత్యా చూస్తే ఒక కులం మొత్తాన్ని ఒక వర్గంలో వేయడం సాధ్యం కాదు.

అందుకే వర్గం గురించి ఆలోచించినప్పుడు శ్రమదోపిడీకి గురవుతున్నారా లేదా అనే తేడాకి ప్రాధాన్యత ఇవ్వాలి. సామాజిక అసమానతలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఆ కులం మొత్తాన్ని సమూహంగా చూడాల్సి ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ కూడా వర్గానికీ, కులానికీ వ్యత్యాసం ఉంది అని అర్థం చేసుకోవాలి. అందుకని వర్గానికీ, కులానికీ భారతదేశంలో ఇప్పుడూ, పాత కాలంలోనూ చాలా వ్యత్యాసాలున్నాయి. మొత్తం దేశవ్యాపితంగా చూసినప్పుడు కొన్ని కులాల బృందాల్ని ఒక వర్గంలో వేసి, ఆ రకంగా మొత్తం కులాల్ని కొన్ని బృందాలుగా చేసి వాటన్నింటినీ వర్గాలుగా పరిగణించే అవకాశం ఉంది. కుల వ్యవస్థని వర్గ పద్ధతిలో విభజన చేసి పరిశీలన చేసినప్పుడు ఈ కుల వ్యవస్థ మొత్తాన్ని ఒక భాగంగా చూసి దానికి వర్గ వ్యవస్థకుండే సామ్యాన్ని పరిశీలన చేయవచ్చు.

పాత కాలపు ఫ్యూడల్ సమాజం నుంచి బానిస సమాజం వరకూ ఏ సమాజంలోనూ తమను తాము వర్గాలని ఎక్కడా చెప్పుకోలేదు. ఎందుకంటే వర్గం అనే అవగాహన ఈ కాలంలో వచ్చింది తప్ప ఆ కాలంలో మేధా వులు పరిశోధన చేసి ఇవి వర్గాలు అని చెప్పింది లేదు. అందుకని యూరప్‌లో ఎస్టేట్‌లు అని అన్నారు. ఇక్కడ కులాలు అని అన్నారు.

**పెట్టుబడిదారీ విధానంలో కులం–వర్గం**

ప్రస్తుతం మన దేశంలో వర్గం – కులం ఎలా ఉంది? బ్రిటీషు వారు భారతదేశం వచ్చి పరిపాలన చేసిన కాలంలో ఈ కులం – వర్గం యొక్క సంబంధాలలో చాలా తీవ్రమైన మార్పులు వచ్చాయి. ఒకటి పెట్టుబడిదారీ విధానంతో గతంలో లేని ఆధునిక వర్గాలు వచ్చాయి. ఇంతకు ముందు సమాజంలో కార్మికులు లేరు. మనదేశంలో మౌర్యుల కాలం నుండి సైనికులున్నారు. కాని ఆధునిక కార్మికులు లేరు. ఉత్పత్తి, రవాణ సౌకర్యం, ఫ్యాక్టరీలు, కొత్తరకమైన పనులు, పని విభజనకు అవసరమైన శ్రామికులు ఆధునికంగా వచ్చారు. అందుకని ఈ రోజు మనం కార్మిక వర్గం అనిదేనినైతే అంటున్నామో అది ఆధునిక వర్గమే తప్ప మొదటి నుంచి లేదు. కొత్తగా వచ్చినప్పుడు అది ఎక్కడ నుంచి వచ్చింది? ఉన్న సమాజంలోని వివిధ తరతగతుల నుంచి, ఇంకా చెప్పాలంటే వివిధ కులాల నుంచి వచ్చిన వారితో నూతన కార్మికవర్గం ఏర్పడింది. అలాగే పెట్టుబడిదారీ వర్గం కూడా నూతన వర్గమే. పెట్టుబడిదారీ వర్గంలో పాతకాలం షావుకార్లు, వడ్డీ వ్యాపారస్తులు ఉండొచ్చు. వాళ్లు ఫ్యూడల్ దోపిడీదారులు. యంత్రాల్ని పెట్టడం, కార్మికులను కూలికి పెట్టుకొని పని చేయించుకోవటంతో పెట్టుబడిదారీ వర్గం ఏర్పడింది. పెట్టుబడిదారీ వర్గం కూడా ఎక్కడి నుంచో రాలేరు. ఈ సమాజంలో వివిధ తరగతుల నుంచి వచ్చిన వారే. యూరప్‌లో అయితే చేతిదార్లనుండి వృత్తి, ఎక్కువగా కార్ఖానాల నుండి వచ్చారు. మాస్టర్ వృత్తిదారులు నలుగురు–ఐదుగురు పనివాళ్లను పెట్టుకుని గిల్డు వ్యాపారం చేసుకునేవారు. ఈ తరగతి నుంచే ఎక్కువగా అక్కడ పెట్టుబడిదారులు, శాస్త్రజ్ఞులు, యంత్రాల్ని, పరికరాల్ని కనిపెట్టేవారు వచ్చారు. కాని భారతదేశంలో అది జరగలేదు. భారతదేశంలో కొత్త పెట్టుబడిదారీ వర్గం అప్పటికే పెట్టుబడితో ముడిపడి ఉన్న వడ్డీ వ్యాపారులు, వైశ్యులు, మార్వాడీల నుండి ప్రధానంగా ఏర్పడింది. ఈ విధంగా పెట్టుబడిదారీ వర్గం, శ్రామిక వర్గాలు కొత్తగా సృష్టి అయినాయి. అలాగే బ్రిటీషు వాళ్లు వచ్చిన తర్వాత లాయర్లు, డాక్టరు, బ్యాంకు మేనేజర్లు, ఎడ్మినిస్ట్రేటర్లు, గుమస్తాల వంటి కొత్త మధ్య తరగతి ఏర్పడింది. వీరు పాత వ్యవస్థ నుండి పుట్టుకు వచ్చినవారే. మొట్ట మొదట మనం గమనించాల్సిందేంటంటే ప్రాచీన కుల వ్యవస్థపై ఆధారపడిన సమాజం లోని మనుషులతోనే భారతదేశంలో ఆధునిక వర్గాలు ఏర్పడ్డాయి. అందుకనే ఉత్పత్తి రీత్యా చూస్తే ఇవి కొత్త వర్గాలు, పొందిక రీత్యా చూస్తే పాత సమాజంలోని అవశేషాలతో ఏర్పడిన వర్గాలు అని మనం అర్థం చేసుకోవాలి. వివిధ సామాజిక తరగతులు, కులాల నుంచి ఒక చోటుకు పోగు చేయడం ద్వారా ఈ కొత్త వర్గాలు ఏర్పడ్డాయి. అంటే పుట్టుకతోటే సామాజిక అసమాన భావనతో ఉండే వివిధ తరగతులు, కులాల నుంచి వచ్చిన వ్యక్తులతో కొత్త వర్గాలు ఏర్పడ్డాయి. అంటే ఆ సామాజిక తరగతులు, సామాజిక వాతావరణంలో ఎటువంటి అవలక్షణాలుంటాయో అవి కూడా ఈ వర్గాలలో ప్రవేశించాయని అర్థం చేసుకోవాలి.

ఇప్పుడు కార్మికుల్లో కూడా అన్ని కులాల నుంచి వచ్చిన వాళ్లున్నారు. అగ్రకులాల నుండి అంటరాని కులాలని ముద్రవేసినవాళ్లు అందరూ ఉన్నారు. వారితో పాటు ఆనాటి పాత సమాజంలో ఉండే వాసనలు కూడా వస్తాయి. కనుక భారతదేశంలో కార్మికవర్గం ఏర్పడిన తీరును చూసినప్పుడు ఆధునిక ఫ్యాక్టరీల రీత్యా, ఉత్పత్తి రీత్యా, విజ్ఞానం రీత్యా, అలాగే దాని యొక్క నైపుణ్యాల రీత్యా అత్యంత ఆధునిక మైంది. ఆలోచనలో మాత్రం పాత వ్యవస్థలో నుంచి వచ్చిన అవశేషాలు ఇంకా ఉన్నాయి. పై మార్పులో ఇమిడి ఉన్న అంశం ఏంటంటే పాతకాలంలో కొన్ని కులాల బృందం వర్గం అయినప్పటికీ, పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రవేశించిన తర్వాత ప్రతి కులంలోనూ వర్గాలు ఏర్పడ్డాయి. దీన్నే కులంలో వర్గ విభజన అని చెప్పాం.

భారతదేశంలో కులానికి సంబంధించి పాత కాలపు పునాది ఏదైతే ఉందో అది బద్దలయింది. ఉదాహరణకు వృత్తి, ఇంకా కులవృత్తుల్లోనే కొంతమంది కొనసాగుతున్నారంటే ఇంకో మెరుగైన అవకాశం లేక కొనసాగడమే తప్ప కుల ఆంక్షల మూలంగా కాదు. ఈ కులంలో పుట్టాం కనుక వంశపార్యం పరంగా ఈ వృత్తే చేయాలని చెప్పే సామాజిక, ఆర్థిక, చట్ట నిబంధనలు లేవు. అలాగే ఎక్కువ తక్కువ, అంటరానితనం, అస్పృశ్యత వంటివి

> **“ పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ చేస్తోంది. ఆ దోపిడీని మరింత పెంచుకోవటానికి కుల వ్యవస్థను నాశనం చేసే కంటే, దీనిని ఉపయో గించుకోవడమే మంచిదనే నిర్ణయానికి వచ్చింది. వారికి కుల చైతన్యం ఉంటేనే బలహీన వర్గాల్ని ఉపయోగపెట్టుకోవడం సాధ్యపడుతుంది. అందుకని పెట్టుబడి దారీ వ్యవస్థ పెరగడానికి కుల వ్యవస్థ అవసరం లేకపోయినా దాని లాభాల కోసం, మనుగడ కోసం కొనసాగిస్తోంది. ”**

మనుస్మృతిలో ఉన్నాయి. ఇవి నేడు సామాజిక, మతపరంగా ఉన్నాయి తప్ప చట్టరీత్యా లేవు. పైగా అంటరానితనం, అస్పృశ్యత వంటివి చట్టంలో నేరాలుగా పరిగణించబడుతున్నాయి. కాని ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో భూస్వాముల పెత్తనం, సామాజిక ఒత్తిడిళ్లు, ఫ్యూడల్ అవశేషాలు కనపడుతుంటాయి. కులాంతర వివాహాల పై కొన్ని కులాల్లో కొన్ని రకాల నిషేధాలు కొనసాగుతున్నాయి. అంటే ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థ వచ్చినా కులానికి సంబంధించిన పాత కాలపు సాంప్రదాయాలు అనేకం బద్దలవకుండా ఇంకా స్థిరంగా కొన సాగుతూనే ఉన్నాయి. అలాగే దళితులకు ఆస్తి ఉండకూడదనేది కూడా చట్టబద్దంగా రద్దు అయింది. వాళ్లకు ఆస్తి ఉండటం చట్టబద్ధమే. అయితే ఆస్తులు సంపాదించుకోవడాన్ని పెట్టుబడిదారీ విధానం అడ్డుకుంటుంది. ఈ రోజు పెట్టుబడిదారీ విధానం బాగా అభివృద్ధి చెంది ఆధునిక పరిశ్రమల్లో అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించి ఉంటే పాత కాలపు కుల వృత్తులపై ఆధారపడి బతకాల్సిన పరిస్థితి ఉండదు. అటువంటి ఉపాధి అవకాశాలను ఈ రోజు పెట్టుబడిదారీ విధానం సృష్టించలేక పోతోంది. అది జరిగినప్పుడు కుల వ్యవస్థలో మిగిలిన పునాదులు కూలిపోతాయి.

మరో ముఖ్యమై అంశం మానసిక స్థితి, సాంప్రదాయాల రీత్యా చూస్తే ఇప్పుడు కులాలు బలపడినట్లు కనిపిస్తాయి. వాటిల్లో పాతకాలం లక్షణాలు పోతుండగా, కొన్ని కొత్త లక్షణాలు తోడవుతున్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అవసరాల రీత్యా ఈ కుల భావనల్ని ప్రోత్సహిస్తున్నారు. బూర్జువా పార్టీలు ఓటు బ్యాంకుల కోసం ఆ రకంగా చేస్తున్నాయి. ఆ రకంగా కుల చైతన్యం పెరుగుతోంది. అలాగే ప్రతి కులంలోనూ వర్గ విభజన జరిగిందని చెప్పుకున్నాం. కులాలోని ఒక తరగతి అధికారం లో భాగం పొందడానికి కాస్త సంపా దించిన తర్వాత తాము కూడా రాజకీయాల్లోకి రావడానికి కుల చైతన్యం ద్వారా తమవారిని సమీకరించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు. ఒక వర్గంలో భాగంగా ఉన్న కులంలో అంతర్గతంగా వర్గ విభన ఏర్పడి, ఆ రకంగా దాంట్లో ఏర్పడిన ధనిక వర్గం మొత్తం ఈ కులంలో ఉండే పేదల్ని తమ వెనుక సమీకరించుకుంటోంది.

పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ చేస్తోంది. ఆ దోపిడీని మరింత పెంచుకోవటానికి కుల వ్యవస్థను నాశనం చేసే కంటే, దీనిని ఉపయో గించుకోవడమే మంచిదనే నిర్ణయానికి వచ్చింది. వారికి కుల చైతన్యం ఉంటేనే బలహీన వర్గాల్ని ఉపయోగపెట్టుకోవడం సాధ్యపడుతుంది. మనమంతా సమానం అనుకుంటే అత్యధిక లాభాలను సంపాదించడం దోపిడీదారులకు సాధ్యం కాదు. కుల తదితర అస్థిత్వ భావాలను పెంచడం ద్వారా ప్రజల వర్గ ఐక్యతను విచ్చినం చేసి, విభజించు, పాలించు ప్రాతిపదికన పాలక వర్గాలు తమ పాలనకు ఇబ్బంది లేకుండా చూసుకోగల్గుతారు. పెట్టుబడిదారులు తమ దోపిడీకి అవసరమైనప్పుడు నిరుద్యోగుల సంఖ్యను సులభంగా తగ్గించడానికి, పెంచుకోవ డానికి కుల, లింగ, మత భేదాలు, ఆలోచనలు బాగా ఉపయోగపడతాయి. అందుకని పెట్టుబడిదారీ వ్యవస్థ పెరగడానికి కుల వ్యవస్థ అవసరం లేకపోయినా దాని లాభాల కోసం, మనుగడ కోసం కొనసాగిస్తోంది.

ఆర్థిక పునాది మారినా మానసిక పునాది మారనివ్వని పరిస్థితుల్ని అర్థం చేసుకుంటేనే భారతదేశంలో కుల వ్యవస్థని నిర్మూలించగలం. దానికి ఆర్థిక ప్రాతిపదిక పోయినా మానసిక ప్రాతిపదిక పెరుగూతూ, ఇంకా బలపడుతూ ఎందుకు ముందుకుపోతుందో అవగాహన చేసుకోవాలి. పెట్టుబడిదారీ వ్యవస్థని బలపర్చుకోవడం ద్వారా కుల వ్యవస్థని నిర్మూలించుకోవచ్చని కొంతమంది వాదిస్తున్నారు. కాని కుల వ్యవస్థలో మార్పులు, సర్దుబాట్లు చేసి పెట్టుబడిదారీ వ్యవస్థ ఉపయోగించుకుంటోంది. పెట్టుబడిదారీ విధానాన్ని అంతం చేయడం ద్వారానే కుల్యవస్థను సమూలంగా శాశ్వతంగా నిర్మూలించగం. ❋

**‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

ఈ మాసం ప్రత్యేకం

# చైనా కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల 'లాంగ్ మార్చ్'



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు

**ఆర్ అరుణ్ కుమార్**

ఈ ఏడాది జులై 1వ తేదీ నాటికి చైనా కమ్యూనిస్టుపార్టి ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తయింది. చైనాలో విప్లవం జయప్రదం చేయటం కోసం, విప్లవం జయప్రదం అయిన తర్వాత ఏడు దశాబ్దాల కాలంలో పార్టి నాయకత్వంలో చైనా ప్రజా రిపబ్లిక్ అభివృద్ధి చెందిన తీరు గురించి ఈ సందర్భంలో తెలుసుకుందాం. విప్లవానికి ముందు చైనా వలస పాలకులు, స్థానిక యుద్ధ ప్రభువుల పాలనలో ప్రజలు తీవ్రమైన కష్టాలను అనుభవించారు. వివిధ దేశాల వలస పాలకులు చైనాను తమ మధ్య పంచుకున్నారు. తమ దోపిడీని కొనసాగించటం కోసం దేశంలో ఉన్న ఫ్యూడల్ ప్రభువులలో ఎక్కువ మంది వలస పాలకులతో కుమ్మక్కైనారు. ఫలితంగా చైనా అర్ధవలస, అర్ధ ఫ్యూడల్ సమాజంగా ఉండిపోయింది. ఫ్యూడల్ దోపిడి, వలస పాలనకు వ్యతిరేకంగా అనేక దఫాలుగా రైతాంగ పోరాటాలు జరిగినప్పటికీ, 1911 వరకు అవి నిర్మాణరూపం సంతరించుకోలేదు.

1911 విప్లవం ప్రధానంగా సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా, వారి చేతిలో కీలుబొమ్మగా ఉన్న క్వింగ్ రాజవంశాన్ని అధికారం నుండి తొలగించాలన్న పిలుపుతో జరిగింది. విప్లవం జయప్రదం అయింది. అది ప్రజాస్వామిక చైతన్యం, ప్రజలలో విప్లవ భావాలు పెరగటానికి దారితీసింది. కాని ఫ్యూడల్ శక్తులతో రాజీపడటం వలన అది దోపిడీని అంతం చేయటం, ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను నెరవేర్చటంలో విఫలమైంది. చైనాపై సామ్రాజ్యవాదుల ఆధిపత్యం కొనసాగింది. దీనితో అణచివేత, దోపిడీల నుండి బయటపడటానికి సరైన మార్గం కోసం అన్వేషణ ప్రారంభమైంది.

1917లో రష్యాలో జయప్రదమైన అక్టోబరు విప్లవం గొప్ప ఉత్తేజాన్ని కలిగించి, అభ్యుదయ శక్తులను ఉత్సాహపరిచింది. తమదేశంతో అనేక పోలికలున్న దేశంలో ఈ విప్లవం జరగటాన్ని వారు గుర్తించారు. మార్క్సిజం, శాస్త్రీయ సోషలిజం మొదటిసారిగా ఆశలు రెకెత్తించి, విప్లవమార్గాన్ని చూయించాయి. మార్క్సిజాన్ని అధ్యయనం చేయటంలో ఆసక్తి పెరిగింది. ఈ పూర్వరంగంలో మొదటి ప్రపంచయుద్ధం పూర్తయిన తర్వాత సామ్రాజ్యవాదుల డిమాండ్లకు చైనా లొంగిపోయిందనే వార్త ప్రజలలో తీవ్ర ఆగ్రహం కలిగించింది. ఈ లొంగుబాటుకు వ్యతిరేకంగా 1919, మే 4వ తేదీన బీజింగ్‌లో సామ్రాజ్యవాద వ్యతిరేక విద్యార్థి ఉద్యమం ప్రారంభమైంది. అపుడే రంగంలోకి వస్తున్న కార్మికవర్గం కూడా విద్యార్థులకు మద్దతుగా ప్రదర్శనలలో పాల్గొంది. చైనాలోని ఆధునిక వర్గాలు చైతన్యవంతం కావటం, కమ్యూనిస్టు పార్టి ఆవిర్భావానికి పునాదులు పడటానికి ఈ పరిణామాలు దారితీశాయి.

చైనాలో పారిశ్రామిక, కార్మికవర్గ కేంద్రమైన షాంఘైలో 1920 ఆగస్టులో మొదటి కమ్యూనిస్టు గ్రూపు ఏర్పడి, పార్టి ప్రణాళికను రూపొందించింది. 1921లో షాంఘైలో జరిగిన మహాసభలో 50 మందికిపైగా సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తూ మావో సేటుంగ్‌తో పాటు 12 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. తమపై గూఢచర్యం జరుగుతుందని తెలుసుకున్న ప్రతినిధులు ఝెజియాంగ్ ప్రావిన్స్‌లోని జియాజింగ్‌లో ఉన్న నాన్హు సరస్సులోని బోటులోకి తమ మహాసభను మార్చుకున్నారు. మార్క్సిజం-లెనినిజం ప్రాతిపదికగా కార్య క్రమాన్ని రూపొందించుకొని, చైనా కమ్యూనిస్టు పార్టి (సిపిసి)ఏర్పాటైనట్లు ప్రకటించారు. చైనాలో సోషలిస్టు యూత్‌లీగ్‌ను, 1922లో చైనాలో మొదటి లేబర్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటు చేయటంలో కమ్యూనిస్టుపార్టి ముఖ్యపాత్ర నిర్వహించింది. కార్మికవర్గ పోరాటాలలో చురుకుగా పాల్గొన్నారు. సామ్రాజ్యవాదం, ఫ్యూడలిజాలను వ్యతిరేకిస్తూ ప్రజాస్వామిక విప్లవం సాధించాలని, అందుకోసం ఐక్య ప్రజాస్వామిక సంఘటనను ఏర్పాటు చేయాలని పిలుపునిస్తూ సిపిసి తన రెండవ మహాసభలో కార్యక్రమాన్ని ఆమోదించింది. పార్టిని శ్రామికవర్గ పార్టీగా పేర్కొంటూ నిబంధనావళిని కూడా ఆమోదించారు.

సామ్రాజ్యవాదులు, వారి కీలుబొమ్మలుగా ఉన్న యుద్ధ ప్రభువులు కమ్యూనిస్టుపార్టి నాయకత్వంలో జరిగిన కార్మికవర్గ పోరాటాలను రక్తపుటేరుల్లో ముంచారు. వందలాది మంది మరణించగా, వేలాదిమంది గాయాల పాలయ్యారు. ఈ అనుభవాలు వారిని మరింత రాటుదేల్చాయి. 1923లో జరిగిన జాతీయ మహాసభలో కొమింటాంగ్‌తో ఉండాల్సిన సంబంధాలపై తీర్మానం చేశారు. పార్టి సభ్యులు కొమింటాంగ్‌లో చేరిపనిచేస్తూ, కమ్యూనిస్టుల సంఖ్యను పెంచాలని పార్టి నిర్ణయించింది. కొమింటాంగ్‌తో చేస్తున్న ఉమ్మడి కార్యక్రమాలు, పెరుగుతున్న సిపిసి పలుకుబడి 1923లో సన్ యట్ సేన్ నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన జాతీయ వాద కొమింటాంగ్ ప్రభుత్వం చేస్తున్న సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక ప్రకటనలలో ప్రతిబింబించాయి.

1925లో నగరాలలో సామ్రాజ్యవాద అణచివేతకు వ్యతిరేకంగా కార్మికవర్గ పోరా

టాలు, సమ్మెలు పెరిగాయి. చైనా సమాజంలోని వర్గాలు, వర్గాల మధ్య సంబంధాలను అధ్యయనం చేసిన తర్వాత మావో సామ్రాజ్యవాదం, యుద్ధ ప్రభువులు, భూస్వాములు, దళారీవర్గాలు, మధ్య తరగతులలోని అభివృద్ధి నిరోధకులను అధికారం నుండి తొలగించటం కోసం కార్మిక వర్గం చైనా సమాజంలో మెజారిటీగా ఉన్న పేద, మధ్య తరగతి రైతులతో కలవాలని, మధ్య తరగతులలోని వామపక్ష భావాలున్న వారిని (ప్రధానంగా జాతీయ బూర్జువాలను) తమవైపు తెచ్చుకోవాలని, వారితో కలిసి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని చెప్పాడు. ఈ అవగాహనతో మొదటిసారిగా సిపిసి 'దున్నేవానికే భూమి' అన్న నినాదాన్ని తన తీర్మానంలో చేర్చింది. జాతీయ బూర్జువాలతో అధికారంలో కొనసాగాలన్న కొమింటాంగ్ విధానానికి ఇది పూర్తిగా భిన్నమైనది.

కమ్యూనిస్టులు కొమింటాంగ్‌లో ఉండి పనిచేయటం వారి పలుకుబడి పెరగటానికి దారితీసింది. యుద్ధ ప్రభువులకు వ్యతిరేకంగా వారు అనేక విజయాలను సాధించారు. కొమింటాంగ్ నాయకత్వం చేపట్టిన చియాంగ్ కై షేక్ పెరుగుతున్న కమ్యూనిస్టుల పలుకుబడిని చూసి భయపడ్డాడు. కమ్యూనిస్టు వ్యతిరేక చర్యలను తీవ్రం చేశాడు. ఫలితంగా సిపిసి, కొమింటాంగ్ మధ్య సంబంధాలు దెబ్బ తిన్నాయి. సిపిసి నాయకత్వం అనుసరించిన రాజీవాద విధానాలు దీనిని చక్కదిద్దటానికి దోహదం చేయలేదు. మరోవైపున పార్టీలో ఆధిపత్య స్థానానికి వచ్చిన మితవాద నాయకత్వం కొమింటాంగ్ నాయకత్వాన్ని సంతృప్తి పరచటం కోసం పెద్దసంఖ్యలో పేదరైతులను ఆకర్షిస్తున్న దున్నేవానికి భూమి నినాదాన్ని వదులుకున్నది. దీనితో ధైర్యం తెచ్చుకున్న చాంగ్ కై షేక్ తనస స్థానాన్ని బలపరచుకొని, అన్ని బాధ్యతాయుత స్థానాల నుండి కమ్యూనిస్టులను తొలగించాడు. ఐదవ మహాసభలో సిపిసి మితవాద అవకాశవాదాన్ని, బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా పోరాటం చేయటంలో విఫలం కావటాన్ని విమర్శించింది. కొమింటాంగ్ కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా పనిచేయటాన్ని విమర్శించి, జాతీయ ప్రభుత్వం నుండి ఉపసంహరించుకొంది.

సాయుధ విప్లవ పోరాటాలపై తన స్వతంత్ర నాయకత్వాన్ని బలపరచుకొంటూ సిపిసి ప్రజా విప్లవసైన్యాన్ని(పీపుల్స్ రివల్యూషనరి ఆర్మి) ఏర్పాటు చేసింది. హాంకౌ, జూజాంగ్‌లలో బ్రిటిష్ వారు తమ

> **❝ వివిధ విప్లవకేంద్రాల అనుభవాలను తీసుకొని 1930లో 'కార్మికుల, రైతుల స్వతంత్ర సాయుధ రాజ్యం', 'గ్రామీణ ప్రాంతాల నుండి నగరాలను ముట్టడించాలని,' 'గ్రామీణ ప్రాంతాలలో కమ్యూనిస్టు పార్టీ అధికారాన్ని నెలకొల్పి, విస్తరింప చేయాలని', 'పరిస్థితులు అనుకూలించినపుడు జాతీయ రాజకీయ అధికారాన్ని స్వాధీనం చేసుకోవాలన్న' భావాలను మావో అభివృద్ధి చేశాడు. ❞**



1921లో షాంఘై నగరంలో చైనా కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక సమావేశం జరిగిన భవనం

రాయితీలను వదులుకొనేలా చేయటం ద్వారా సిపిసి పెద్ద విజయం సాధించింది. సాయుధ పోరాటాలుగా మారుతున్న కార్మిక తిరుగుబాట్లను దారుణంగా అణచివేయటం వలన సిపిసి కొన్ని తీవ్రమైన పరాజయాలను కూడా ఎదుర్కొన్నది. కొమిం టాంగ్ విప్లవ ప్రతీఘాతుక పాత్ర కమ్యూనిస్టులు, శ్రామికవర్గ నాయకులను ఊచకోత కోయటానికి దారితీసింది. సిపిసి, సోవియట్‌కు వ్యతిరేకంగా కొమింటాంగ్ బహిరంగంగా ప్రచారం చేయటం ప్రారంభించింది. ఈ దాడులను తిప్పికొట్టాలని, వ్యవసాయ విప్లవాన్ని కొనసాగించాలని సిపిసి నిర్ణయించింది. అనేక ప్రాంతాలలో ధాన్యం నూర్పిళ్ళ సమయంలో తిరుగుబాట్లు చేసింది. రైతులలో సిపిసి పలుకుబడి, ప్రతిష్ఠ పెరిగింది. ఛూటే నాయకత్వంలో ఉన్న సైన్యం వచ్చి కలవటంతో రెడార్మి సైనికశక్తి కూడా పెరిగింది. అయినప్పటికీ ఈ సమయంలో 'గొప్ప విప్లవం' అని పిలిచిన 1927-28 తిరుగుబాటు విఫలమైంది. కొన్ని వామపక్ష అతివాద తప్పులను పార్టీ గుర్తించింది. నిరంతరం దాడులు చేయాలంటూ వెనక్కు తగ్గటానికి అంగీకరించకపోవటం, విప్లవ పరిస్థితులను అతిగా అంచనా వేయటం ఈ నష్టాలకు కారణాలని విశ్లేషించారు. ఈ నష్టాలు జరిగినప్పటికీ విప్లవ భావజాలం విస్తరించింది. గ్రామీణ విప్లవ కేంద్రాలు ఏర్పడ్డాయి.

వివిధ విప్లవకేంద్రాల అనుభవాలను తీసుకొని 1930లో 'కార్మికుల, రైతుల స్వతంత్ర సాయుధ రాజ్యం', 'గ్రామీణప్రాంతాల నుండి నగరాలను ముట్టడించాలని,' 'గ్రామీణ ప్రాంతాలలో కమ్యూనిస్టు పార్టీ అధికారాన్ని నెలకొల్పి, విస్తరింప చేయాలని', 'పరిస్థితులు అనుకూలించినపుడు జాతీయ రాజకీయ అధికారాన్ని స్వాధీనం చేసుకోవాలన్న' భావాలను మావో అభివృద్ధి చేశాడు. పార్టీని బలపరచటానికి ఆటంకంగా, ప్రజాస్వామిక విప్లవానికి, సోషలిస్టు విప్లవానికి మధ్య ఉన్న తేడాను మసకబార్చే విధంగా ఉన్న సబ్జెక్టివిజం, వ్యక్తిగతవాదం, వామపక్ష అవకాశవాదం, అతి

**" అంతర్గత పోరాటాన్ని అంతం చేయటం లో వైఫల్యం, జపాన్‌కు వ్యతిరేకంగా ఐక్య సంఘటనను నిర్మించటాన్ని వ్యతిరేకించటంపై అసంతృప్తి చెందిన కొమింటాంగ్ ఈశాన్య సైన్యం చాంగ్ కై షేక్‌ను జియాన్‌లో నిర్బంధం లోకి తీసుకొంది. సిపిసితో కలిసి ఐక్య సంఘ టనను ఏర్పాటు చేసి, జపాన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయటానికి చాంగ్ కై షేక్ బలవం తంగా అంగీకరించినప్పటికీ కొమింటాంగ్ నాయకత్వ దృక్పథంలో చెప్పుకోదగిన మార్పు రాలేదు. "**

అంచనాలపై పోరాటాన్ని తీవ్రం చేశారు. సైన్యంపై పార్టీ రాజకీయ నాయకత్వం ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. రాజకీయ కర్తవ్యాలను నెరవేర్చటం కోసం పార్టీ నాయకత్వంలో ఏర్పడిన సాయుధశక్తిగా రెడార్మీ పాత్రను నిర్వహించారు.

పార్టీని సరైన మార్క్సిస్టు-లెనినిస్టు మార్గంలో నడపటానికి జరుగుతున్న ఈ అంతర్గత పోరాటంతో పాటు కొమింటాంగ్ అనుసరించిన 'చుట్టుముట్టి, నాశనం చేయటం' అన్న విధానానికి వ్యతిరేకంగా కూడా పోరాటం చేయాల్సి వచ్చింది. శత్రువుల చక్రవ్యూహం నుండి బయటపడి, తన శక్తులను కూడదీసుకోవటం కోసం సిపిసి 1934లో చారిత్రాత్మకమైన 'లాంగ్ మార్చ్'ను ప్రారంభించింది. పార్టీ అనుసరించిన అతివాద విధానాలు తీవ్రమైన నష్టాలకు దారితీశాయి. ఈ తప్పులను సరిచేసుకోవాలని, శతృవుకు బలహీనమైన స్థానంలో దాడిచేయాలని, చురుకుగా కదులుతూ శతృవును దెబ్బతీసే(మొబైల్ వార్‌ఫేర్) విధానాలను అనుసరిస్తూ, ఉత్తరం వైపుగా సాగిపోవాలని1935లో జరిగిన పొలిట్‌బ్యూరో విస్తృత సమావేశంలో నిర్ణయిం చారు. పార్టీ నిలదొక్కుకోవటానికి, శక్తిని కూడ దీసుకోవటానికి ఈ లాంగ్‌మార్చ్ కీలకంగా ఉపయోగపడిందని రుజువైంది.

అనేక కష్టనష్టాల కోర్చి నిర్వహించిన దీర్ఘయాత్ర అత్యంత సాహసోపేతమైన ఘటనగా చరిత్రలో నిలిచిపోయింది. అత్యంత అంకితభావంతో, దృఢ నిశ్చయంతో, శత్రువు పెడుతున్న ఆటం కాలను, భారీస్థాయిలో మోహరించిన కొమిం టాంగ్ సైన్యాన్ని ఎదుర్కొంటూ, సహజ ఆటంకాలుగా ఉన్న మంచుతో కూడిన పర్వతాలను, నదులు, గడ్డిభూములు, తీవ్రమైన చలి, ఆకలి, గాయాలు, అనారోగ్యాలు, వీటితో పాటు పార్టీ అంతర్గత సమస్యలను ఎదుర్కొంటూ దీర్ఘయాత్రను కొనసాగించింది. విప్లవం విజయం సాధిస్తుందనే పరిపూర్ణ విశ్వాసంతో తీవ్రమైన కష్టాల మధ్య రెడార్మీ దీర్ఘయాత్రను పూర్తిచేసింది. అది 370 రోజులు, 12,500 కిలోమీటర్లు నడిచింది. కఠినమైన ఈ ప్రయాణంలో వేలాదిమంది కామ్రేడ్స్ మరణించినప్పటికీ శత్రువు చక్రవ్యూహాన్ని ఛేదించి, 1935లో షాంగ్జి ప్రావిన్స్‌కు చేరింది.

దీర్ఘయాత్ర ముగిసేనాటికి రెడార్మీ సంఖ్య 30,000ల కన్నా తక్కువకు పడిపోయింది. అన్ని కఠిన పరీక్షలను ఎదుర్కొని నిలిచిన ఈ సైన్యం కమ్యూనిస్టు పార్టీ, రెడార్మీ అత్యున్నత శక్తిగా రూపొందింది. వీరు ప్రయాణించిన మార్గంలో ప్రతిచోటా విప్లవబీజాలను నాటారు. చైనా విప్లవం జయప్రదం కావటంలో దీర్ఘయాత్రకు చారిత్రాత్మక ప్రాధాన్యత ఉన్నది. షాంగ్జిలో జపాన్ దురాక్రమణదారులతో పోరాటం చేస్తున్న సైన్యాలతో రెడార్మీ కలిసింది. జపాన్‌తో జరుగుతున్న యుద్ధజ్వాలలు దేశమంతా వ్యాపించాయి.

### జనతా ప్రజాస్వామిక విప్లవసాధన కోసం కృషి

1932లో జపాన్ చైనాను ఆక్రమించుకోవటం ప్రారంభించింది. అంతర్గత పోరాటానికి స్వస్తి చెప్పి, జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాడదామని సిపిసి చేసిన ప్రతిపాదనను అన్ని తరగతుల ప్రజలు ఉత్సాహంతో స్వీకరించారు. కొమింటాంగ్ ఈ ప్రతిపాదనను పట్టించుకోకుండా కమ్యూనిస్టు పార్టీపై దాడులను కొనసాగిస్తూ, జపాన్ దురాక్రమణ విషయాన్ని తర్వాత చూడవచ్చుననే వైఖరిని అవలంభించింది. 'కమ్యూనిజానికి వ్యతిరేకంగా జపాన్, చైనా ఉమ్మడి పోరాటం' పేరుతో కమ్యూనిస్టు వ్యతిరేక శక్తులన్నింటినీ సమీకరించటానికి జపాన్ ప్రయత్నం చేసింది. అతివాదశక్తుల ప్రభావంలో ఉన్న సిపిసి తొలిదశలో జపాన్ దురాక్రమణ, చాంగ్ కై షేక్‌కు వ్యతిరేకంగా ఒకేసారి పోరాడాలని చెప్పింది. కాని త్వరలోనే సిపిసి తన విధానాన్ని సవరించుకొని, ప్రతిఘటన పోరాటంలో కార్మికులు, రైతులు, పట్టణ పెటి బూర్జువాలు, మేధావులు మౌలికశక్తులుగా ఉంటారని, కాని 'జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా జాతీయ బూర్జువావర్గంతో జాతీయ ఐక్య సంఘటన ఏర్పాటు చేయటం' సాధ్యమేనని ఎత్తుగడలపై ఆమోదించిన తీర్మానంలో పేర్కొంది. చాంగ్ కై షేక్ వ్యతిరేక నినాదాన్ని విడనాడి, శాంతి చర్చల కోసం కొమింటాంగ్‌ను ఆహ్వానించింది. వాక్ స్వాతంత్ర్యం, సమావేశాలు జరుపుకొనే హక్కు, రాజకీయ ఖైదీల విడుదల, అన్ని తరగతులను భాగస్వాములను చేస్తూ జాతీయ సమావేశాన్ని జరపటం, ప్రజల జీవన ప్రమాణాలను పెంచటం, జపాన్ వ్యతిరేక పోరాటాన్ని బలపరిస్తే కొమింటాంగ్‌తో కలిసి పనిచేయటానికి సిద్ధమేనని సిపిసి ప్రతిపాదించింది. సిపిసి ప్రతిపాదనలపై ఏమీ తేల్చకుండానే కొమింటాంగ్ సిపిసి కి వ్యతిరేకంగా చేస్తున్న దాడులను కొనసాగించింది.

అంతర్గత పోరాటాన్ని అంతం చేయటంలో వైఫల్యం, జపాన్‌కు వ్యతిరేకంగా ఐక్య సంఘటనను నిర్మించటాన్ని వ్యతిరేకించటంపై అసంతృప్తి చెందిన కొమింటాంగ్ ఈశాన్య సైన్యం చాంగ్ కై షేక్‌ను జియాన్‌లో నిర్బంధం లోకి తీసుకొంది. సిపిసితో కలిసి ఐక్య సంఘటనను ఏర్పాటు చేసి, జపాన్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయటానికి చాంగ్ కై షేక్ బలవంతంగా అంగీకరించినప్పటికీ కొమింటాంగ్ నాయకత్వ దృక్పథంలో చెప్పుకోదగిన మార్పు రాలేదు. రాయబార మార్గాల ద్వారా దురాక్రమణ విషయాన్ని పరిష్కరించుకోవచ్చునని వారింకా ఆశిస్తున్నారు. సిపిసి పిలుపునిచ్చిన 'పూర్తి ప్రతిఘటన'కు భిన్నంగా, జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా 'పాక్షిక ప్రతిఘటన' అన్న వారి వైఖరితో ఈ విషయం స్పష్టమైంది. కార్మికవర్గ నాయకత్వం కింద జాతీయ ఐక్య సంఘటనను ఏర్పాటు చేయాలని, శత్రువుకు వెనుకభాగంలో గెరిల్లా యుద్ధతంత్రాన్ని అనుసరించాలని, కొమింటాంగ్ పాలిస్తున్న ప్రాంతా లలో పోరాట కేంద్రాలను ఏర్పాటు చేయాలని, జపాన్ వ్యతిరేక పోరాట కేంద్రాలను ఏర్పాటు చేయాలని, జపాన్ వ్యతిరేక ఉద్యమాల ద్వారా కొమింటాంగ్ పాలిత ప్రాంతంలో రాజకీయ, ఆర్థిక హక్కులను సాధించుకోవాలని నిర్ణయించింది. ప్రజలను సమీకరించటానికి, అన్ని తరగతులలో ఉన్న దేశభక్తులను ఏకం చేయటానికి, గెరిల్లా యుద్ధానికి మద్దతు

సమీకరించుకోవటానికి సిపిసికి ఈ ఎత్తుగడలు ఉపయోగపడ్డాయి.

జాతీయ ప్రభుత్వంలో కాని, ఏ కార్యనిర్వాహక యంత్రాంగంలో కాని భాగస్వామి కారాదని సిపిసి నిర్ణయించింది. "ఆ విధంగా భాగస్వామి కావటం కమ్యూనిస్టు పార్టి ప్రత్యేకతలను మరుగుపరచటానికి, కొమింటాంగ్ నిరంకుశ ప్రభుత్వపాలనను మరింతకాలం పొడిగించటానికి, ఐక్య ప్రజాస్వామిక ప్రభుత్వం అధికారంలోకి రావటానికి చేసే ప్రయత్నాలను వేగిరం చేయకపోగా ఆటంకపరచటానికి దారితీస్తాయి" అని చెప్పింది. జపాన్ దురాక్రమణను ఎదిరించటానికి, దేశాన్ని రక్షించటానికి సిపిసి సూచించిన 10 పాయింట్ల కార్యక్రమం అమలు కోసం ఉత్తర్వులు జారిచేసిన తర్వాత మాత్రమే అటువంటి ప్రభుత్వంలో భాగస్వామిని అవుతానని పేర్కొంది. సిపిసి ప్రతిఘటన, ప్రజల నుండి వస్తున్న వత్తిడి వలన కొమిం టాంగ్ సిపిసి చట్టబద్ధ హక్కులను గుర్తించటమే కాక, కొమింటాంగ్, కమ్యూనిస్టు సహకార విధానాన్ని అమలుచేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఐనప్పటికీ 'ఐక్యసంఘటన' ఎప్పుడూ ఐక్యంగా లేదు. మరోవైపున జపాన్ వ్యతిరేక సంఘటనను విస్తృతం చేయటం, బలపరచుకొనే సమస్యపై సిపిసిలో కొన్ని మితవాద, అవకాశవాద ధోరణులు తలెత్తాయి. సిపిసి స్వతంత్రత, చొరవ, ప్రజాస్వామ్యం, ప్రజల జీవనాధారాలు, గెరిల్లా యుద్ధం తదితరాలపై చర్చలు ముందుకుతెచ్చారు. 'అన్ని కార్యక్రమా లనూ ఐక్య సంఘటన ద్వారానే చేయాలని', ' శ్రామికవర్గ నాయకత్వ విధానాన్ని' వదులుకో వాలని, విజయం కోసం కొమింటాంగ్‌పై ఆధారపడాలని వారు వాదించారు. ఈ లొంగుబాటు విధానాలకు వ్యతిరేకంగా మావో, ఇతర నాయకులు పోరాటం చేశారు. ఐక్య సంఘటనలో స్వతంత్రవైఖరి, చొరవతో వ్యవహరించాల్సిన అవసరాన్ని స్పష్టంగా వివరించారు.

కొమింటాంగ్ ప్రభుత్వ రాజధాని అయిన నాన్‌జింగ్‌ను జపాన్ 1937లో ఆక్రమించుకొని, నగరంలో 3,00,000 మందిని ఊచకోత కోసింది. నాన్‌జింగ్ హత్యాకాండగా ఇది ప్రసిద్ధి చెందింది. జపాన్ క్రూరత్వం దేశాన్ని కుదిపివేసింది. కొమింటాంగ్ ప్రభుత్వ పోరాటశక్తిని ఇది మరింతగా హరించివేసింది. 1938 నాటికి విస్తారమైన భూభాగాన్ని కోల్పోయింది. జపాన్ అత్యాచారాలతో కదిలిపోయి, ప్రపంచంలోని అనేకదేశాల నుండి వైద్యబృందాలు చైనాకు సహాయం అందించటం కోసం వచ్చాయి. కెనడా నుండి డాక్టర్ నార్మన్ బెథూన్, భారతదేశం నుండి డాక్టర్ ద్వారకానాథ్ కోట్నీస్‌లు అటువంటి రెండు బృందాలకు నాయకత్వం వహించారు. జపాన్‌కు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టి చేస్తున్న కఠినమైన గెరిల్లా పోరాటాన్ని కొనసాగిస్తూ, దక్షిణాన జపాన్ సైన్యానికి వెనుక మరొక యుద్ధరంగాన్ని ప్రారంభించింది. సిపిసికి మాత్రమే జపాన్ ఎదిరించి, దేశాన్ని రక్షించగల శక్తి ఉన్నదని ప్రజలు గుర్తించటం ప్రారంభించారు. యువకులు పెద్దసంఖ్యలో సిపిసి వెనుక సమీకృతమై, గెరిల్లా యుద్ధంలో చురుకైన పాత్ర పోషించారు. బేస్ ఏరియాలలో ఉత్పత్తిని పెంచటం, పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ(పిఎల్ఎ) రిజర్వులను బలపరచటానికి వీరు కృషిచేశారు.

> ❝ వైరుధ్యాలను వినియోగించుకొని 'ఎక్కువ మందిని మన వైపుకు తెచ్చుకోవటానికి, కొద్దిమందిని వ్యతిరేకిస్తూ శత్రువులను ఒకరి తర్వాత ఒకరిని ఓడించే విధంగా' ఎత్తుగడలను అమలు చేయాలి. తనలో తలెత్తిన తప్పుడు విధానాలను సరిదిద్దు కోవటానికి, మార్క్సిజం-లెనినిజాలను సక్రమంగా అర్థం చేసుకోవ టానికి సిపిసి దిద్దుబాటు ఉద్యమాన్ని ప్రారంభించింది. సబ్జెక్టివిజం, సెక్టేరియనిజం, మూసపోత పద్ధతులకు వ్యతిరేకంగా పోరాటం చేయటానికి ఈ క్యాంపెయిన్ ఉద్దేశించబడింది. ❞



విప్లవానంతరం 1949 అక్టోబర్ 1వ తేదీన చైనా ప్రజా రిపబ్లిక్ ఏర్పడినట్లు ప్రకటిస్తున్న మావో

గొప్ప పరిపక్వతను, సంయమనాన్ని ప్రదర్శిస్తూ సిపిసి జపాన్ వ్యతిరేక పోరాటంలో ఐక్యత కావాలన్న తన విధానాన్ని పునరుద్ఘాటించింది. అమెరికా, బ్రిటన్‌లు ఇస్తున్న మద్దతుతో ఈ పిలుపులన్నింటినీ పెడచెవిన పెట్టి, సిపిసిపై దాడులు చేసే విధానాన్ని కొమింటాంగ్ కొనసాగించింది. ఈ వైరుధ్యాలను వినియోగించుకోవటానికి ప్రయత్నించిన జపాన్ దురాక్రమణదారులు విముక్తి ప్రాంతాలను తిరిగి తమ ఆధీనంలోకి తెచ్చుకోవటానికి ప్రయత్నం చేశారు. ఐక్య సంఘటనను బలపరచాలని, అదే సమయంలో కొమింటాంగ్ చేస్తున్న అనవసర దాడులను ఏ మాత్రం రాజీలేకుండా తిప్పికొట్టాలని సిపిసి నిర్ణయించింది. సిపిసి తీసుకున్న ఆత్మరక్షణ విధానం ప్రజల మద్దతు పొందటంతో కొమింటాంగ్ దాడులను నిలువరించి, తిప్పికొట్టగల శక్తి సిపిసికి వచ్చింది. ప్రతిఘటన యుద్ధంలో విజయం సాధించటం కోసం ఉత్తరాదిన తన బేస్‌ను బలపరచుకోవాలని, మధ్యప్రాంతంలో సైనిక ఉనికిని పెంచుకోవాలని, దక్షిణాదికి విస్తరించాలని సిపిసి నిర్ణయించింది. ఈ వ్యూహాత్మక కర్తవ్యాలను నిర్వహించటానికి తగిన వ్యక్తులను ఆయా ప్రాంతాలకు పంపింది. ఈ ప్రయత్నాల వలన సిపిసి సభ్యత్వం 40,000 నుండి 1940 చివరి నాటికి 8,00,000లకు పెరిగింది.

శత్రువును ఓడించటం, విప్లవాన్ని ముందుకు తీసుకుపోవటంలో 'ఐక్యసంఘటన, సాయుధ పోరాటం, పార్టి నిర్మాణం' మూడూ ప్రధాన సాధనాలుగా ఉపయోగపడ్డాయని సిపిసి వివరించింది. ఐక్య సంఘటన ఎత్తుగడలను

**" 1949, అక్టోబరు 1వ తేదీన పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా(పిఆర్‌సి) ఏర్పడినట్లు మావోజెడాంగ్ ప్రకటించాడు. అది నూతన ప్రజాస్వామిక లేదా జనతా ప్రజాస్వామిక విప్లవం అని, దానికి 'కార్మికవర్గం నాయకత్వం వహించిందని, దానికి 'కార్మిక, కర్షక మైత్రి పునాదిగా ఉన్నదని, అది అన్ని ప్రజా స్వామిక వర్గాలను,జాతులను ఏకం చేసిందని' ఆయన ప్రకటించాడు. "**

వివరిస్తూ అంతర్గత సర్క్యులర్‌ను జారిచేసింది. 'సర్వ ఐక్యత, పోరాటం లేకుండటం లేదా అంతర్గత పోరాటం, ఐక్యత లేకుండటం కాదు. అది ఐక్యత, పోరాటాలను కలగలిపినది' అని పేర్కొంది. వైరుధ్యాలను వినియోగించుకొని 'ఎక్కువ మందిని మనవైపుకు తెచ్చుకోవటానికి, కొద్దిమందిని వ్యతిరేకించటం, శత్రువులను ఒకరి తర్వాత ఒకరిని ఓడించే విధంగా' ఎత్తుగడలను అమలుచేయాలి. తనలో తలెత్తిన తప్పుడు విధానాలను సరిదిద్దుకోవటానికి, మార్క్సిజం-లెనినిజాలను సక్రమంగా అర్థం చేసుకోవటానికి సిపిసి దిద్దుబాటు ఉద్యమాన్ని ప్రారంభించింది. సబ్జెక్టివిజం, సెక్టేరియనిజం, మూసపోత పద్ధతులకు వ్యతిరేకంగా పోరాటం చేయటానికి ఈ క్యాంపెయిన్ ఉద్దేశించబడింది. దిద్దుబాటు ఉద్యమంతో రాటుదేలిన సైన్యం, ప్రజలు శత్రువు ఆశలను వమ్ముచేశారు. అనేక బేస్ ఏరియాలను శత్రువు దురాక్రమణ నుండి తిరిగి విముక్తి చేశారు.

మరోవైపున కొమింటాంగ్ కొద్ది యుద్ధాల లోనే జపాన్‌ను ఎదుర్కొంది. ఎక్కువ భాగం యుద్ధాలలో మొదటి దాడిలోనే ఓటమి చెందింది. కమ్యూనిస్టు వ్యతిరేకతతో 1945లో కూడా సిపిసి నిరంతరం చేస్తున్న ఐక్య ప్రజాస్వామిక ప్రభుత్వ ఏర్పాటు ప్రతిపాదనలను తిరస్కరించింది. రాజకీయంగా అవినీతిలో కూరుకుపోయిన కొమింటాంగ్ నాయకత్వం తమ సైన్యాన్ని ఉత్తేజపరచి, పోరాటంలో ముందుకు పోయేలా చేయలేకపోయింది. జరుగుతున్న పరిణామాలతో ఆందోళన చెందిన్న అమెరికా కొమింటాంగ్‌ను నిలబెట్టటానికి ప్రయత్నం చేసినా విఫలమైంది. 1945లో సోవియట్ యూనియన్ చైనా ఈశాన్య ప్రాంతంలోకి ప్రవేశించి, జపాన్ ఫాసిస్టులకు వ్యతిరేకంగా భారీగా దాడులు చేయటం వారి ఓటమిని త్వరితం చేసింది. సిపిసి నాయకత్వంలోని పిఎల్‌ఎ వారిని సంపూర్ణంగా ఓడించి, వారు లొంగిపోయేలా చేసింది. జపాన్‌కు వ్యతిరేకంగా జరిగిన ప్రతిఘటన పోరాటం విదేశీ వలసవాదు లకు వ్యతిరేకంగా శతాబ్దానికి పైగా జరిగిన చైనా జాతీయ విముక్తి పోరాటం. దానిలో చైనా మొదటిసారిగా సంపూర్ణ విజయం సాధించింది. మొత్తంగా 2.1 కోట్లమంది చనిపోగా వారిలో 6,00,000 ల మంది సిపిసి పోరాటయోధులు ఉన్నారు. సిపిసి బలం పెరిగింది. 10 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్న 10 లక్షల కిలో మీటర్లకు విముక్తి ప్రాంతం విస్తరించింది. పిఎల్‌ఎ ప్రధాన సైన్యం 12 లక్షలకు, ప్రజా ప్రతిఘటన దళాలు 26 లక్షలకు పెరిగాయి. నూతన ప్రజాస్వామిక విప్లవం విజయం సాధించటానికి ఇవి పునాదులు వేశాయి.

'ఐక్యత, విజయసాధన' మహాసభగా పిలువబడిన సిపిసి 7వ మహాసభ తమ సాయుధపోరాట అనుభవాలను సమీక్షిస్తూ ' మూడు ఆయుధాలు 'తమ పురోగమనానికి, విజయానికి దోహదం చేశాయని పేర్కొంది. సిద్ధాంతం-ఆచరణలను మేళవించటం, ప్రజల తో సన్నిహిత సంబంధాలను ఏర్పాటు చేసుకోవ టం, విమర్శ-ఆత్మవిమర్శ ఆ మూడు ఆయు ధాలని చెప్పింది. జపాన్ సామ్రాజ్య వాదంపై విజయం సాధించిన తర్వాత అమెరికాపై ఎటువంటి భ్రమలు పెట్టుకోకుండా, తిరిగి మరొక అంతర్గత పోరాటాన్ని చాంగ్ కై షేక్ రాజేస్తాడని పూర్తిగా ఎరిగివుండి శాంతి, స్థిరత్వం కోసం సిపిసి ప్రయత్నం చేసింది. చాంగ్ కై షేక్ ఆయుధ, ఆర్థిక సహకారాన్ని అందించటం ద్వారా సిపిసి పెరుగుదలను అడ్డుకోవటానికి అమెరికా మరొకసారి ప్రయ త్నం చేసింది. దీనితో ధైర్యం తెచ్చుకున్న చాంగ్ కై షేక్ ఆరు మాసాల క్రితం చేసుకున్న సంధిని ఉల్లంఘిస్తూ 1946 జూన్ నుండి పిఎల్‌ఎ పై దాడులకు పూనుకున్నాడు. 'చైనాను వలస'గా మార్చటానికి ప్రయత్నిస్తున్న 'అమెరికా, చాంగ్ కై షేక్‌లను ఒంటరి చేయండి' అన్న విధానంతో సిపిసి దీనిని ఎదుర్కొంది. పిఎల్‌ఎ తన మొబైల్ వార్‌ఫేర్ విధానంతో బలమైన శత్రువుపై పైచేయి సాధించింది.

పార్టీ ఒక ఆదేశాన్ని విడుదల చేస్తూ విముక్తి యుద్ధం విజయం పొందిన రెండవ సంవత్సరంలో దేశవ్యాపిత ప్రతిఘటన ప్రధానాంశంగా ఉండాలని పేర్కొంది. సిపిసి నాయకత్వంలోని ప్రజాసైన్యాలు దేశవ్యాపితంగా విజయాలు సాధించటం చరిత్రలో కీలకాం శంగా నిలిచింది. సామ్రాజ్యవాదం, ఫ్యూడ లిజం, నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా కార్మికవర్గ నాయకత్వాన జరిగిన విప్లవ పోరాటంగా సిపిసి దీనిని అభివర్ణిం చింది. ఫ్యూడల్ దోపిడీని అంతం చేయటానికి, భూస్వాముల భూములను స్వాధీనం చేసుకొని భూమిలేని పేదలకు పంచటానికి విముక్తి ప్రాంతాలలో సిపిసి 1947లో ' ముసాయిదా భూ చట్టాన్ని తీసుకొచ్చింది. పేదరైతులపై పూర్తిగా ఆధారపడటం, మధ్యతరగతి రైతులతో ఐక్యత, ఫ్యూడల్ దోపిడీని అంతం చేసి వ్యవసాయోత్పత్తిని పెంచటం భూసంస్కరణల అమలుకు ప్రాతిపదికగా ప్రకటించింది. ఈ చర్యలను ప్రజలు విస్తృతంగా బలపరిచారు. కొమింటాంగ్‌పై సిపిసి విజయానికి ఇవి దోహదం చేశాయి.

తన సైన్యాలు గుణాత్మకంగా, సంఖ్యా పరంగా ఆధిక్యశక్తిగా మారాయని సిపిసి ప్రకటించింది. దానితో విప్లవం విజయవంతం కావటానికి, శాంతి లభించటానికి అవకాశం కలిగింది. 'మొదట గ్రామాలు, తర్వాత నగరాలు' అన్న తన నినాదాన్ని 1949 ఫిబ్రవరి లో 'మొదట నగరాలు, తర్వాత గ్రామాలు'గా సిపిసి మార్చింది. 1949లో తన రాజధాని నాన్‌జింగ్‌లో ఓటమి చెందటంతో కొమింటాంగ్ పరాజయం సంపూర్ణమైంది.

1949, అక్టోబరు 1వ తేదీన పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా(పిఆర్‌సి) ఏర్పడినట్లు మావోజెడాంగ్ ప్రకటించాడు. అది నూతన ప్రజాస్వామిక లేదా జనతా ప్రజాస్వామిక విప్లవం అని, దానికి 'కార్మికవర్గం నాయకత్వం వహించిందని, దానికి 'కార్మిక, కర్షక మైత్రి పునాదిగా ఉన్నదని, అది అన్ని ప్రజాస్వామిక వర్గాలను,జాతులను ఏకం చేసిందని' ఆయన ప్రకటించాడు. పిఆర్‌సి ఏర్పడటంతో అర్ధ వలస, అర్ధ ఫ్యూడల్ దేశమైన చైనా సోషలిస్టు దేశంగా మారే పరివర్తన క్రమం ప్రారంభమైంది.

**(అనువాదం: ఎ కోటిరెడ్డి)**

# ఆగ్జిల్లరీ గ్రూపులు - అనుభవాలు

ఎస్ వీరయ్య



రచయిత సిపిఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు

పార్టీ అభివృద్ధిలో ప్రాథమిక శాఖ పాత్ర ఏమిటి? ఆగ్జిల్లరీ గ్రూపు కన్వీనర్, పార్టీ శాఖ కార్య దర్శుల బాధ్యతలేమిటి?ప్రజాపునాది ఎట్లా బలపడుతుంది?.....

ఇవన్నీ సహజంగా వచ్చే ప్రశ్నలే ! వీటికి సమాధానం వెతకటం అవసరం కూడా. గతంలో తెలంగాణలో కొన్ని ప్రాంతాలలో బలమైన ప్రజాపునాది ఉన్నది. ఎనభైయవ దశకం వరకు కమ్యూనిస్టులు దాదాపు స్వంత బలంతోనే కొన్ని సీట్లు గెలవగల పరిస్థితి ఉన్నది. అదే పునాది తర్వాత కాలంలో ఇతర పార్టీలతో ఎన్నికల అవగాహనకు, సీట్ల సర్దుబాట్లకు కూడా తోడ్పడ్డది. మరిన్ని సీట్లు గెలవడానికి కూడా ఉపయోగపడ్డది. ఆ పునాది ఎట్లా ఏర్పడ్డదో పరిశీలిస్తే అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. మన ప్రియతమ నాయకుడు, వీరతెలంగాణ రైతాంగ సాయుధ పోరాటనేత పుచ్చలపల్లి సుందరయ్య మరణానికి ముందు తన జీవిత చరిత్ర రికార్డు చేసే సమయంలో ఒక విషయం చెప్పారు. "ఎత్తుగడల విషయంలో కొన్ని పొరపాట్లు జరిగినప్పటికీ నేడు కొన్ని ప్రాంతాలలో ప్రజాపునాది బలంగా ఉన్నదంటే....దానికి కారణం పోరాట కాలంలో భూమి పంచటం, దాన్ని వారే దున్నుకొని ఫలితం అనుభ వించటం, తీవ్రమైన వర్గ పోరాటం జరగటమే" అన్నారాయన. నిజమే కదా! ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలు, ఇబ్రహీం పట్నం ప్రాంతం వంటి చోట్ల శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు గెలిచారంటే ఆ పునాదే ఆధారం కదా ! ఆ ఉద్యమ వారసత్వం అందు కుని పనిచేసిన పార్టీ సభ్యులు కూడా పార్టీ పట్ల అచంచల విశ్వాసం ప్రదర్శించారు. పెద్దగా చదువు లేదు. మార్క్సిస్టు సిద్ధాంతం అధ్యయనం చేసే అవకాశాలు కూడా లేవు. అయినా ప్రాణాలకు తెగించి నిలబడ్డారు. వర్గపోరాటంలో రాటుదేలిన ఫలితం అది.

భయంకరమైన దాడులు జరుగుతున్న కాలం. ఏ క్షణంలో ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితులు. నిరంతరం దాడినీ, పోలీసుల దౌర్జన్యాలనూ ఎదుర్కొంటూ పనిచేసిన కాలం. అది ప్రజాక్షేత్రంలో వర్గ సంఘర్షణ కాలం. ఇప్పుడు నిర్వహిస్తున్నట్టుగా, ఒక క్రమ పద్ధతిలో ఆగ్జిల్లరీ గ్రూపులు, పార్టీ శాఖల సమావేశాలు జరిపే అవకాశాలు తక్కువ. కానీ నేటి పరిస్థితికన్నా తీవ్రమైన, అత్యంత కఠినమైన పరీక్షలకు తట్టుకొని నిలిచినవారే పార్టీ సభ్యులయ్యారు. అందుకే ఎలాంటి దాడులు జరిగినా సాహసోపేతంగా నిలబడ్డారు. రైతాంగపోరాట కాలంలో బలపడిన ప్రజా పునాదిని నిలబెట్టుకోవటం అంత సులభంగా జరగలేదు. క్షేత్రస్థాయిలో ఆర్థిక, రాజకీయ రంగాలలో జరిగిన తీవ్రమైన వర్గపోరాట ఫలితంగానే ఆ పునాది నిలబడ్డది. పార్టీ నాయకులనూ, కార్యకర్తలనూ కాపాడుకునేందుకు తమ ప్రాణాలను కూడా లెక్కచేయలేదు. ఎన్నికలలో కూడా డబ్బు, పదవులలాంటివి ఎరవేసినా లొంగలేదు. పార్టీ సభ్యులే కాదు... ప్రజలు కూడా ఎర్రజెండా మీద అచంచల విశ్వాసం ప్రదర్శించారు. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాలు, రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం ప్రాంతంలో 1975-90ల మధ్య క్షేత్రస్థాయిలో శత్రుమూకల భయానక దాడులకు 89 మంది అమరవీరులు నేలకొరిగారు. ఈ వ్యాసం చివరలో ప్రజాఉద్యమంలో నేలకొరిగిన అమరవీరుల వివరాలు చూడవచ్చు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమే కాదు, చరిత్రలో పోరాటాలు అనేకం జరిగాయి. ప్రజల జీవితం మీద, రాజకీయ రంగం మీద తీవ్ర ప్రభావం చూపగల స్థాయిలో జరిగిన ప్రజా ఉద్యమాల ఫలితంగా ఏర్పడిన ప్రజాపునాది అది. ఆ తర్వాత కాలంలో మళ్ళీ అనేక పోరాటాలు జరిగినప్పటికీ, ఆనాటి పోరాటాలతో పోల్చదగినవి కాదు. ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో వచ్చిన మార్పుల ఫలితం. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, సరళీకృత ఆర్థిక విధానాలు, గ్రామీణ ప్రాంతాలకు పెట్టుబడిదారీ సంబంధాల విస్తరణ, పాతకాలపు ఫ్యూడల్ సంబంధాలలో మార్పులు రాజకీయ రంగం మీద కూడా పెద్దయెత్తున ప్రభావం చూపాయి. కమ్యూనిస్టు ఉద్యమం ఇందుకు మినహాయింపు కాదు. ప్రజాజీవితం అనేక మార్పులకు లోనైన కాలంలో పార్టీ సభ్యత్వంలో విప్లవ చైతన్యం గురించీ, పార్టీ పని విధానంలో అనేక మార్పుల గురించీ కోల్‌కతా ప్లీనం కొన్ని కర్తవ్యాలు మన ముందుంచింది. ఈ నేపథ్యంలోనే ఆగ్జిల్లరీ గ్రూపుల పని విధానం, శాఖల పనివిధానం పరిశీలించాలి. ప్రజాపునాది పెంపుదలకు కృషి చేయాలి.

గత అనుభవాలు పరిశీలించినపుడు ఆయా ప్రాంతాలలో రాజకీయంగా తీవ్ర ప్రభావం చూపించగల సమరశీల ప్రజా ఉద్యమాలకు ఏమాత్రం అవకాశం ఉన్నా వదలవద్దు. కానీ అసాధారణ పరిస్థితుల్లోనే సార్వత్రిక పిలుపులతో ప్రజాపునాది బలపడుతుంది. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ముందుకొచ్చే అలాంటి పెద్దపెద్ద పోరాటాల కోసం ఎదురుచూడకుండా, గ్రామ, వార్డుస్థాయిలలో, బస్తీలో, పని ప్రదేశాలలో, క్లస్టర్‌లో ఉన్న సమస్యలమీద స్థానికంగా కృషి చేయటం అవసరం. కేవలం కొందరు కార్యకర్తలు కలిసి దిష్టిబొమ్మలు తగులబెట్టటం, ధర్నాలు చేయటంతో మాత్రమే ప్రజాపునాది ఏర్పడదు. బాధితులు ఏమేరకు పోరాటాలలో పాల్గొంటే ఆమేరకు పునాది ఏర్పడుతుంది. సింబాలిక్ కార్యక్రమాలతో పార్టీ ఉనికి చాటుకోవటం, సమస్య ప్రజల దృష్టికి తేవటం వరకే ఉపయోగపడుతుంది. గ్రామాలలో ధనిక రైతులు, భూస్వాములు, కాంట్రాక్టర్లు, మిల్లు యజమానులు, వడ్డీ వ్యాపారులు తదితర వర్గాల నుంచి బాధపడుతున్న పేదలను సమీకరించి పోరాడటం అవసరం. గ్రామీణ వ్యవసాయేతర కార్మికుల పరిస్థితులు నిర్దిష్టంగా అధ్యయనం చేసి, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి. పట్టణ ప్రాంతాలలో పౌర సమస్యలతో పాటు, అసంఘటిత కార్మికులు అనేక సమస్యలెదుర్కొంటున్నారు. ఎక్కడికక్కడ స్థానికంగా, ప్రజలమధ్య ఉండి, వారితో మమేకమై, రాత్రీ, పగలూ తేడా లేకుండా ఏ సమస్య వచ్చినా సహాయపడాలి. నీళ్ళలో చేపలాగా ప్రజలతో మమేకం కావాలి. ప్రకృతి వైపరీత్యాలు, సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత సమస్యలలో కూడా సహాయపడాలి. స్థానికంగా ఇలాంటి సమస్యలపైన పనిచేసే క్రమంలోనే వివిధ వర్గాల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు ఘర్షణ పడక తప్పని పరిస్థితులు వస్తాయి.

> **" గతంలో పార్టీ సభ్యులుగా ఉండి, వివిధ కారణాలతో సభ్యత్వం వదులుకున్నవారు ఆగ్జిల్లరీ గ్రూపులలో ఉంటున్నారు. ఇది అవసరం. అలాంటి వారందరినీ సమీకరిం చాలి. కానీ గతంలో సభ్యులుగా ఉన్నవారే కాబట్టీ, పార్టీ గురించి అన్నీ తెలిసినవారే కాబట్టీ, ఆరు నెలలు ఆగ్జిల్లరీ గ్రూపులలో ఉంటే సులభంగా విప్లవ చైతన్యం వస్తుందను కోవటం కూడా సరైంది కాదు. "**

ప్రజలను సమీకరించి హక్కుల కోసం, పరిష్కారాల కోసం పోరాడవల్సి వస్తుంది. ఇలాంటి కృషితోనే ఎంతోకొంత ప్రజాపునాది ఏర్పడటానికీ, పార్టీ విస్తరణకూ అవకాశాలు వస్తాయి. ఒక పెద్ద రాజకీయ కుదుపు వచ్చినపుడు అదే ప్రజాపునాది మరింత బలపడడానికి తోడ్పడుతుంది. ఇలాంటి ప్రజాకార్యాచరణలో పాల్గొంటూనే పైకమిటీ పిలుపులలో కూడా సమీకరించాలి. స్థానికంగా ఇలాంటి కృషి నిరంతరం కొనసాగితే పైకమిటీ పిలుపులలో కూడా సమీకరణ పెరుగుతుంది. సమరశీలత కూడా ప్రదర్శించగలుగుతారు. ఇప్పుడు ఆగ్జిల్లరీ గ్రూపులను నిర్వహించే క్రమంలో సభ్యులందరూ ఇలాంటి స్థానిక కృషిలో భాగస్వాములు కావాలి. స్థానికంగా వర్గ శత్రువుతోగానీ, అధికారులతోగానీ, రాజకీయ శత్రువులతో గానీ ఘర్షణకు సిద్ధపడాలి. ఎర్రజెండా నీడన పోరాటంలో పాల్గొనాలి. ఈ మాత్రం ప్రజా కార్యాచరణ, పోరాట స్ఫూర్తి లేనపుడు ఆగ్జిల్లరీ సభ్యులు కేవలం రెగ్యులర్ సమావేశాలతోనే విప్లవ చైతన్యం గల పార్టీ సభ్యులుగా ఎదగటం సాధ్యం కాదు. కొందరు ఆగ్జిల్లరీ సభ్యులు మొదట మొహమాటానికి అంగీకరించినా, తర్వాత హాజరు కారు. వారికి సహాయ పడినందుకు లేదా వారి సమస్యల మీద పోరాడినందుకు అభిమానంతో ఒప్పుకుంటారు. మంచివాళ్ళు కదా! అని కాదనలేక సరేనంటారు. తీరా సమావేశాలు, పార్టీ కార్యక్రమాలలో పాల్గొనవలసి వచ్చినపుడు విముఖంగా ఉండవచ్చు. అందువల్ల ఆగ్జిల్లరీ గ్రూపులను తరచూ పునర్నిర్మాణం చేసుకోవచ్చు. బూర్జువా పార్టీలకన్నా కమ్యూనిస్టులే మెరుగు అనే నిర్ణయానికి వారు రాకముందే ఆగ్జిల్లరీ గ్రూపులలో పెట్టినపుడు ఇలాంటి సమస్యలొస్తాయి. ఆయా ప్రజాసంఘాల కృషితో వీరు దగ్గరయి ఉండవచ్చు. బూర్జువా పార్టీల కన్నా కమ్యూనిస్టు పార్టీ ఏ విధంగా భిన్నమైందో వారికి అర్థం చేయించి ఆగ్జిల్లరీలో పెట్టాలి.

పార్టీ సభ్యుల విషయంలో కూడా ఇది వర్తిస్తుంది. ఇప్పటికే పార్టీ సభ్యులు కాబట్టి, ఇక వారికి విప్లవ చైతన్యం వచ్చినట్టేననీ, అది శాశ్వతమనీ భావించకూడదు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో వస్తున్న మార్పుల ప్రభావం పార్టీ శ్రేణుల మీద ఉంటుంది కదా ! స్థానికంగా వృత్తి స్థలంలోనూ, నివాస ప్రాంతాలలోనూ ప్రజా సమస్యలపైన నిరంతరం కృషి చేయకుండా పార్టీ సభ్యుల చైతన్యం కూడా నిలబడదు. ఈ కృషి పార్టీ శాఖల ఆధ్వర్యంలో చేయాలి. పార్టీ సభ్యులంతా పాల్గొనాలి. ఆగ్జిల్లరీ సభ్యులు పాల్గొనేటట్టుగా పార్టీ సభ్యులు బాధ్యత తీసుకోవాలి. స్థానికంగా ప్రజా సమస్యల మీద కృషి చేయకుండా పార్టీ సభ్యత్వం కూడా నిలబ డదు. శాఖల పని విధానం కుంటుబడుతుంది. పార్టీ సభ్యులకు, ఆగ్జిల్లరీ సభ్యులకు ప్రజలను సమీకరించే సామర్థ్యం పెరగదు. ప్రజల నాడి తెలియదు. అంతిమంగా పార్టీ ప్రజాపునాది బలపడదు.

గతంలో పార్టీ సభ్యులుగా ఉండి, వివిధ కారణాలతో సభ్యత్వం వదులుకున్నవారు ఆగ్జిల్లరీ గ్రూపులలో ఉంటున్నారు. ఇది అవసరం. అలాంటి వారందరినీ సమీకరించాలి. కానీ గతంలో సభ్యులుగా ఉన్నవారే కాబట్టీ, పార్టీ గురించి అన్నీ తెలిసినవారే కాబట్టీ, ఆరు నెలలు ఆగ్జిల్లరీ గ్రూపులలో ఉంటే సులభంగా విప్లవ చైతన్యం వస్తుందనుకోవటం కూడా సరైంది కాదు. కొద్దిమంది, కొన్ని ప్రత్యేక సమస్యలతో సభ్యత్వం వదులుకున్నవారికి అది వర్తించవచ్చు. కానీ ఈ సూత్రం గతంలో పార్టీ సభ్యులుగా ఉన్నవారందరికీ వర్తిస్తుందని భావించలేము. రకరకాల ప్రభావాలతో పార్టీ పట్ల విశ్వాసం సడలి ఉండవచ్చు. జాతీయ, అంతర్జాతీయ పరిణామాలతో విప్లవ చైతన్యం సడలి ఉండవచ్చు. ఇలాంటి కామ్రేడ్స్ అంతా మళ్ళీ ఆకర్షితులై, విప్లవ చైతన్యం ప్రదర్శించే విధంగా స్ఫూర్తి పొంది వస్తున్నారనుకోలేము. ఇప్పుడు అలాంటి ప్రజా పోరాటాల కాలం కాదు. అయినా ఆగ్జిల్లరీ గ్రూపులో చేరాలని చెప్పగానే అంగీకరించటం సానుకూలాంశం. దీని ఆధారంగానే, ప్రత్యేక శ్రద్ధతో వీరిలో విప్లవ చైతన్యం పెరిగే విధంగా కృషి చేయాలి. ఇందుకు తొలిమెట్టు స్థానికంగా ప్రజా సమస్యల మీద కృషి. పాతవారే కాబట్టి విషయ పరిజ్ఞానం ఉంటుంది. ప్రాథమిక విషయాలన్నీ కొత్తగా నేర్పించవల్సిన అవసరం ఉండదు. కానీ విప్లవ చైతన్యం విషయంలో కొత్తపాతల తేడా లేదు. శాఖ పర్యవేక్షణలో ప్రత్యేక కృషి చేయవలసిందే. పార్టీ సభ్యత్వంలో విప్లవ చైతన్యం లోపించిందనీ, బలహీన సభ్యులను డ్రాప్ చేయాలని కోల్‌కతా ప్లీనం నిర్ణయించింది. అందుకనుగుణంగానే కొంతమందిని తగ్గించాం. ఆగ్జిల్లరీ గ్రూపుల నిర్వహణ, శాఖలు పనిచేసే సందర్భంగా తగు జాగ్రత్తలు పాటించకపోతే అదే సమస్య పునరావృతమవుతుంది.

ఆగ్జిల్లరీ సభ్యులు ఆరు మాసాలు రెగ్యులర్‌గా సమావేశాలకు హాజరైనంత మాత్రాన పార్టీ సభ్యత్వానికి అర్హత సంపాదించినట్టు కాదు. వారి పని విధానం, చైతన్య స్థాయి, అవగాహన, శ్రమశిక్షణ లాంటి విషయాలు పార్టీ శాఖ సమావేశంలో ఒక్కొక్కరి గురించి నిర్దిష్టంగా చర్చించి నిర్ణయించాలి. అర్హులుగా భావించిన వారితో దరఖాస్తు పెట్టించి, శాఖ సిఫారసు చేయాలి.

పార్టీలో శాఖా కార్యదర్శులు, ఆగ్జిల్లరీ గ్రూపుల కన్వీనర్లకు చాలా ప్రాధాన్యత ఉన్నది. ఆగ్జిల్లరీ గ్రూపుల కన్వీనర్లు విప్లవ పార్టీ సభ్యులను తయారుచేసే కీలక బాధ్యతల్లో ఉన్నారు. శాఖ కార్యదర్శులు ఈ బాధ్యతతో పాటు స్థానికంగా వీరే పార్టీ నాయకులు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు ప్రత్యక్ష నాయకత్వం వహించేది వీరే. అందువల్ల ఆగ్జిల్లరీ గ్రూపుల కన్వీనర్లుగానీ, శాఖా కార్యదర్శులు గానీ ఆషామాషీగా తీసుకోవద్దు. విప్లవ చైతన్యం ప్రదర్శించాలి. కనీస బాధ్యతలు నిర్వహిస్తూ తాము ఆదర్శప్రాయంగా ఉండాలి. సమావేశాలు సక్రమంగా నిర్వహించాలి. చొరవ ప్రదర్శించాలి. తమ గ్రూపు సభ్యుల మీద కన్వీనర్ వ్యక్తిగత పర్యవేక్షణ చేయాలి.

పార్టీ శాఖ కార్యదర్శులు మరింత ఆదర్శ ప్రాయంగా ఉండాలి. ఐదు కనీస బాధ్యతలు క్రమం తప్పకుండా పాటించాలి. శాఖను సమావేశపర్చటమే కార్యదర్శి ప్రథమ బాధ్యత. అదే ప్రధానమైన అర్హత అవుతుంది. శాఖలు రెగ్యులర్‌గా సమావేశమైతే పార్టీ సజీవంగా, పటిష్టంగా ఉంటుంది. పార్టీలో ఆంతరంగిక ప్రజాస్వామ్యం బలపడుతుంది. పార్టీ పిలుపులు బాగా అమలవుతాయి. ఇంతటి ప్రాముఖ్యత గల్గినదే శాఖ. అందుకే శాఖ కార్యదర్శి అంటే బాధ్యతాయుత స్థానం. క్షేత్ర స్థాయిలో

ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు శాఖలకే ఉంటాయి. సమావేశానికి కార్యదర్శి తగిన ఎజెండా ప్రతిపాదించాలి. సభ్యుల పనిని పర్యవేక్షించాలి. ఆగ్జిల్లరీ గ్రూపు కన్వీనర్ పనిని ప్రత్యేకంగా పరిశీలించాలి. అవసరమైన సహాయం అందించాలి. కార్యకలాపాల సమీక్ష, స్థానిక సమస్యల మీద కృషి, శాఖ పరిధిలో రాజకీయ పరిస్థితులు, రాజకీయ, సైద్ధాంతిక చర్చ, ఆగ్జిల్లరీ కృషి, కర్తవ్యాలు ఎజెండాగా ఉండాలి. ఆగ్జిల్లరీ గ్రూపు పనివిధానం, స్థానికంగా ప్రజా సమస్యలు ప్రతి సమావేశంలో ప్రత్యేకంగా చర్చించాలి. పార్టీ సభ్యుల పని, శాఖ పని విధానం మీద ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. కొందరు హాజరు కాలేదనే పేరుతో సమావేశాలు వాయిదా వేయకూడదు. వాయిదా వేయటమంటే హాజరైన వారికంటే హాజరు కానివారికే ప్రాధాన్యత నిచ్చినట్టు అవుతుంది. హాజరు కాని వారితో సంబంధమున్న ఎజెండా వాయిదా వేయవచ్చు. సమావేశం సకాలంలో ప్రారంభించాలి. ఎదురు చూడవద్దు. సమావేశానికి హాజరైన వారికీ, సకాలంలో వచ్చినవారికీ తగిన ప్రాధాన్యతనివ్వాలి. అప్పుడే సమావేశాలు సక్రమంగా సాగుతాయి. లేనట్టయితే వీరుకూడా తరువాత సమావేశాలకు ఆలస్యంగా రావటమో, హాజరు కాకపోవటం జరగవచ్చు.

> “ శాఖ కార్యదర్శి స్వతంత్రంగా, చొరవతో పనిచేయాలి. పై కమిటీ సభ్యులు లేదా పూర్తికాలం కార్యకర్తలు గుర్తు చేస్తేనే శాఖ సమావేశం పిలిచే స్థితి ఉండకూడదు. పార్టీ విస్తరణకు ఇది ఆటంకమవుతుంది. శాఖను సమావేశపర్చటం, పని చేయించటం శాఖ కార్యదర్శి బాధ్యత. అవసరాన్ని బట్టి సహాయం అడిగి తీసుకోవచ్చు. తమ పరిధిలోని ఆగ్జిల్లరీ గ్రూపు నిర్వహణ బాధ్యత కూడా శాఖదే. కన్వీనర్ ద్వారా అది సక్రమంగా నడిచేటట్టు చూడటం శాఖ బాధ్యత. ”

శాఖ కార్యదర్శి స్వతంత్రంగా, చొరవతో పనిచేయాలి. పై కమిటీ సభ్యులు లేదా పూర్తికాలం కార్యకర్తలు గుర్తు చేస్తేనే శాఖ సమావేశం పిలిచే స్థితి ఉండకూడదు. పార్టీ విస్తరణకు ఇది ఆటంకమవుతుంది. శాఖను సమావేశపర్చటం, పని చేయించటం శాఖ కార్యదర్శి బాధ్యత. అవసరాన్ని బట్టి సహాయం అడిగి తీసుకోవచ్చు. తమ పరిధిలోని ఆగ్జిల్లరీ గ్రూపు నిర్వహణ బాధ్యత కూడా శాఖదే. కన్వీనర్ ద్వారా అది సక్రమంగా నడిచేటట్టు చూడటం శాఖ బాధ్యత.

**1975-90 మధ్య క్షేత్రస్థాయిలో ప్రజల కోసం అసువులు బాసిన అమరవీరులు:**

**ఉమ్మడి నల్గొండ జిల్లా**

1) అందె నర్సయ్య, పొనుగోడు గ్రామం 2) సుందరి బసవయ్య, పొనుగోడు 3) గాదె శ్రీనివాసరెడ్డి, మిర్యాలగూడెం 4) భిక్షానాయక్, మిర్యాలగూడెం 5) రాగిరెడ్డి వీరారెడ్డి , మిర్యాలగూడెం 6) గండూరి కిషన్‌రావు, తడ్కమల్ల, మిర్యాలగూడెం 7) ఇరుకు హిక్షం, పాలకీడు, నేరేడుచర్ల మండలం 8) ఈసారపు వీరయ్య, వెలిదండ, గరిడిమల్ల మండలం 9) పున్నం రాజు, యాతకిళ్ళ, మటంపల్లి మండలం 10) కందుల గురువారెడ్డి, మల్లారెడ్డి గూడెం 11) యర్రబోలు వెంకటేశ్వరరెడ్డి, మల్లారెడ్డిగూడెం 12) శౌరిరాల సైదయ్య,అన్నారం, పెన్‌పహాడ్ మండలం 13) నకిరికంటి వెంకటేశ్వర్లు, అన్నారం, పెన్‌పహాడ్ మం॥ 14) ఆదిరెడ్డి కృష్ణారెడ్డి, నారాయణ గూడెం గ్రామం 15) ఎడమ చంద్రారెడ్డి, మోతె గ్రామం (మండలం) 16) యాదగిరి, నకిరేకల్, శాలిగౌరారం 17) రుద్రాక్షి యల్లయ్య, కాజిరామారం గ్రామం, నల్గొండ 18) సురిగి లింగయ్య, పజ్జూరు, తిప్పర్తి మండలం 19) కందాల రంగారెడ్డి, పంతంగి, చౌటుప్పల మం. 20) చిలుకూరి రామచంద్రారెడ్డి, బొమ్మాయిపల్లి, భువనగిరి మం. 21) పర్సనబోయిన భిక్షం, జి ఎడవెల్లి, కనగల్లు మం. 22) కొర్వి లింగయ్య, జి ఎడవెల్లి, కనగల్లు మం.

23) పుట్ట భిక్షంరెడ్డి, తిప్పతిర్త మండలం, యర్రగడ్డం గూడెం

**ఉమ్మడి ఖమ్మం జిల్లా**

**ముదిగొండ మండలం:** 1) మొక్కా చిన నర్సయ్య 2) గంద్ర వీరభద్ర రావు 3) బొల్లెద్దుల రామనాథం 4) మందా జగన్నాథం 5) మందా సత్యం 6) రాయబారపు కన్నయ్య 7) తోట వెంకటేశ్వర్లు 8) గండ్లూరి కిషన్‌రావు 9) కోయ బాబు 10) మోర్తాల యలమందారెడ్డి, 11) కేతిరెడ్డి జగన్నాధ రెడ్డి 12) మోర్తాల గోపిరెడ్డి **ఖమ్మం రూరల్:** 1) కొట్టె సత్యం 2) ఊరడి సత్యనారాయణ రెడ్డి 3) చిన్న మొలకయ్య 4) సాల్వే ముత్తయ్య 5) పేరం రంగయ్య **బోనకల్ మండలం:** 1) జొన్నలగడ్డ రామయ్య, 2) పారా వెంకటేశ్వర రావు **వైరా మండలం:** 1) కొణిదెన సీతరామయ్య **నేలకొండపల్లి మండలం:** 1) గుడవర్తి రామయ్య 2) పాపినేని నారాయణ **దుమ్ముగూడెం మండలం:** 1) ముల్లపూడి సత్యనారాయణ **భద్రాచలం డివిజన్ కేంద్రం:** 1) బండారు చందర్‌రావు **చింతూరు మండలం:** 1) బత్తుల భీష్మారావు 2) మడివి మూకయ్య 3) పులి రామయ్య **ములకలపల్లి మండలం:** 1) నరాటి వెంకన్న

**ఉమ్మడి వరంగల్ జిల్లా**

1) వేల్పుల కోటయ్య, నర్సంపేట 2) మన్నూరి చినవీరాస్వామి, నర్సంపేట 3) గోనె మల్లారెడ్డి, వెంకటాపురం, నర్సంపేట 4) తోటకూర బలరాములు, కమ్మేపల్లి, నర్సంపేట 5) మారెల్లి కుమారస్వామి, మహమ్మదాపురం, నర్సంపేట 6) బి సారయ్య, నర్సంపేట

7) గట్టు లింగారెడ్డి, కొమ్మాల, వరంగల్ రూరల్ 8) జి లక్ష్మినారాయణ, వరంగల్ 9) రాయరేకుల రామస్వామి ఎలుకుర్తి, వరంగల్ 10) చింతా కన్నయ్య, గంగవరం, నర్సంపేట 11) మేర్గు కన్నయ్య కాటినాగారం, నర్సంపేట 12) గొడిశాల సాయిలు, పెదమాడూరు, జనగామ 13) బైరబోయిన నర్సయ్య, ఓటాయి, నర్సంపేట 14) బోయిన సమ్మయ్య, ఎలుకుర్తి, వరంగల్ రూరల్ 15) వి సాంబశివరావు, మరిపెడ, మహబూబాబాద్ 16) మోకాళ్ళ చినరామనర్సయ్య, వెలుబెల్లి, నర్సంపేట 17) బల్లం అయిలయ్య, వీరారం, మహబూబాబాద్ 18) చీకటి కట్టయ్య, లింగగిరి, నర్సంపేట 19) గంటా వెంకులు, వీరారం, మహబూబాబాద్

20) వేల్పుల సారయ్య, ద్వారకపేట, నర్సంపేట 21) పోతరాజు కట్టయ్య, ధర్మారావుపేట, నర్సంపేట 22) గాదె సాంబయ్య, రుద్రగూడెం, నర్సంపేట 23) రాపోలు దర్గయ్య, నర్సంపేట 24) పెరుమాళ్ళ జగన్నాథం, మహబూబాబాద్ 25) ఊడుగుల సాంబయ్య, ఉప్పరపల్లి, నర్సంపేట 26) గోనె మల్లారెడ్డి, వెంకటాపురం, నర్సంపేట 27) వేల్పుల కోటయ్య, అశోక్‌నగర్, నర్సంపేట 28) మన్నూరి చినస్వామి, అశోక్‌నగర్, నర్సంపేట 29) తోటకూరి బలరాములు, కమ్మపెల్లి, నర్సంపేట 30) ఖూదియా అమర్‌సింగ్, నెక్కొండ, నర్సంపేట 31) సూర నర్సయ్య, నర్సంపేట 32) కొండవర్తి ఆనందం, నర్సంపేట

**రంగారెడ్డి జిల్లా (ఇబ్రహీంపట్నం ప్రాంతం)**

1) మహబూబ్ పాషా, ఇబ్రహీంపట్నం 2) నరహరి, ఇబ్రహీంపట్నం 3) ఆలంపల్లి రోషయ్య, మేడిపల్లి 4) తుమ్మల యాదగిరి రెడ్డి, రాచకొండ గుట్టలు 5) అనంగల్ల పోచయ్య, ఆరుట్ల 6) దానయ్య, ఆరుట్ల

❋

# జనావాసాలూ, సమాజంలో దొంతరలు

ఎంవిఎస్ శర్మ



రచయిత ప్రజాశక్తి సంపాదకులు

### గ్రామీణ జనావాసాలు

పాళీ భాషలో రచించబడిన బౌద్ధ గ్రంథాలలో "గామ" అన్న పదం ఉపయోగించారు. అంటే గ్రామం అని అర్థం. ఐతే, ఇప్పటి గ్రామాలతో వాటికి పోలిక లేదు. నాలుగైదు కుటీరాలు ఉన్న జనావాసాన్ని కూడా గామ అనే పిలిచారు. ( ఇప్పుడు కూడా విశాఖ జిల్లా ఏజన్సీ ప్రాంతంలోని మారుమూలల్లో ఏడెనిమిది కుటీరాలున్న ఊళ్ళు ఉన్నాయి. ఆ ప్రాంతంలో ఒక నాలుగైదు సంవత్సరాలు పోడు వ్యవసాయం చేసి, ఇక ఆ భూమికి సారం లేదని తెలుసుకున్నాక ఆ ప్రాంతాన్ని వదిలి ఆ ఏడెనిమిది కుటుంబాలూ మరికొంత దూరంపోయి అక్కడ అడవిని పోడుకొట్టి అక్కడ కుటీరాలు కట్టుకుంటారు) పట్టణాలకు వెలుపల కొన్ని నెలలపాటు తాత్కాలిక మకాంలను ఏర్పాటు చేసుకునే వర్తకుల నివాస ప్రాంతాన్ని, పశువుల కాపరులు తమ మందలతో ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక నివాస ప్రాంతాలను కూడా గామ అనే వర్ణించారు. తోటలకు కాపలా కాసేవారు, ఏనుగుల సంరక్షకులు, చాపలు అల్లేవారు,

ఉప్పు తయారు చేసేవారు, గుర్రాల కాపరులూ ఇలా వృత్తి ప్రాతిపదికన కూడా ఈ గ్రామాలు ఉండేవి. రాజు బ్రాహ్మణులకు దానంగా ఇచ్చిన గ్రామాలను బ్రహ్మదేయ (బ్రాహ్మణ గ్రామం) అనేవారు. అడవులను భగవతి అని ప్రస్తావించారు. సంపన్నులు చెట్లు నాటి అడవులను పెంచడం ఒక ఆనవాయితీ గా ఉండేది.

వ్యవసాయం, పశుపోషణ లతో ముడిపడిన క్రతువులు, పండుగలు ఉన్నట్టు ప్రాచీన కాలపు సంస్కృత గ్రంథాలలో ప్రస్తావనలున్నాయి. గృహ్యసూత్రాలలో వీటిని ప్రత్యేకించి పేర్కొన్నారు. పశువుల మందల్ని కాపాడే "పుషన్" అనే దేవుడిని పూజించేవారు. రుద్రుడిని సంతృప్తి పరచడం కోసం ఎద్దును వధించడం, కార్తీక పున్నమి రాత్రి ఒక ఆంబోతును స్వేచ్ఛగా విడిచిపెట్టడం చేసేవారు. పొలాన్ని దున్నేముందు "స్థాలీపాకం" పేరుతో ఆహారం వండి బలి గా సమర్పించేవారు. ఇటువంటి క్రతువులే నాట్లు నాటేముందు, కోతలు కోసే ముందు, గాదెల్లో నిల్వ ఉంచేముందు పాటించేవారు. ఆశ్వియుజ పున్నమి నాడు పాయసాన్నం వండి ఇంద్రుడు, రుద్రుడు, అశ్వినీ దేవతలకు నైవేద్యంగా సమర్పించేవారు.

### పట్టణాలు

పురం, నగరం అనే పదాలతో పాళీ గ్రంథాలు పట్టణ ప్రాంతాలను గురించి ప్రస్తావించాయి. చుట్టూ కట్టుదిట్టంగా ప్రాకారాలను నిర్మించుకునివుండడం నగరాల ప్రత్యేకత అని చెప్పవచ్చు.

చంప. శ్రావస్తి, వారణాసి, కౌశాంబి, సాకేత ( ఇదే నేటి అయోధ్య) రాజగహ అనే ఆరింటినీ మహా నగరాలుగా పాళీ గ్రంథాలు వర్ణించాయి. వైశాలి, ఆంబపాలి, కపిలవస్తు వంటి ఇతర నగరాల ప్రస్తావన కూడా ఉంది. పురావస్తు తవ్వకాలు కూడా తొలుత ఏర్పడిన పట్టణ ప్రాంతాలుగా ఈ ఆరు మహానగరాలను ధృవీకరించాయి.

ఒక ఆసక్తికరమైన అంశం ఏమంటే బౌద్ధగ్రంథాలలో ఎక్కువగా ఈ నగరాల ప్రస్తావన ఉంది. వాటిలో ప్రస్తావనకు వచ్చిన పేర్లలో 6 శాతం మాత్రమే గ్రామాలకు చెందిన వ్యక్తులవి. తక్కినవన్నీ పట్టణాలలోని వ్యక్తులవే. మరీ ముఖ్యంగా 40 శాతం పైన తెలిపిన ఆరు మహానగరాలలో నివసించినవారివే. బౌద్ధ జాతక కథలలో సైతం బోధిసత్త్వుడి 264 అవతారాలలోనూ 223 అవతారాలు పట్టణాల్లో జన్మించినవే. దాదాపు 86 శాతం జన్మల్లో బోధిసత్త్వుడు రాజు గానో, రాజు కొడుకుగానో, సంపన్నుడైన వ్యాపారి గానో అవతరించాడు. అంటే బౌద్ధం పట్టణ ప్రాంతాలలోనే ఎక్కువగా ప్రబలంగా ఉండేదని అనుకోవాలి.

దీనికి భిన్నంగా బ్రాహ్మణుల ధర్మసూత్రాలలో పట్టణప్రాంతాలను చిన్నచూపు చూసే ధోరణి వ్యక్తం అయింది. పట్టణ ప్రాంతాల్లో వేదాల అధ్యయనం చేయరాదని ఆపస్తంబ ధర్మసూత్రాలలో పేర్కొన్నారు. వేదాలను నేర్చిన బ్రహ్మచారి తరచూ పట్టణాలకు పోరాదని అందులో చెప్పారు. ఎంత పవిత్రంగా జీవించినప్పటికీ, పట్టణాల్లో ఉంటూ, అక్కడి దుమ్ముతో శరీరం మలినం అయినవాడికి మోక్షం లభించడం అసాధ్యం అని బౌధయాన ధర్మసూత్రాలు చెప్తున్నాయి. గౌతమ ధర్మసూత్రాలు "ఎక్కడైతే కట్టెపుల్లలు, నీరు, గడ్డి, దర్భలు ఉండి రహదారి ఉంటుందో , ఎక్కడైతే ఆర్యులు ఎక్కువ సంఖ్యలో ఉంటారో, ఎక్కడైతే ధర్మ ప్రభువు ఉంటాడో అక్కడ జీవించాలి" అని చెప్పాయి.

పాణిని "అష్టాధ్యాయి" అనే గ్రంథంలో 'గ్రామం' అంటే ప్రధానంగా బ్రాహ్మణులు, రైతులు నివసించేది అని, 'ఘోష' అంటే పశువుల మందలతో వాటి కాపరులు నివసించేది అని, (మహాభారతం విరాట పర్వంలో ఘోషయాత్ర ప్రస్తావన ఉంది. విరాటుడి పశువుల మందల్ని కౌరవులు ఎత్తుకుపోయేందుకు తలపెట్టిన యాత్ర అది) 'నగరం' అంటే చేతివృత్తుల బృందాలు, వ్యాపార గణాలు ఉండేది అని నిర్వచించాడు. నగరం అనేది ఒక ప్లాను ప్రకారం నిర్మించేది అని చెప్పి, ఎటువంటి స్థలాన్ని నగర నిర్మాణం కోసం ఎంపిక చేయాలో ఆ లక్షణాలను కూడా పేర్కొన్నాడు. నగరానికి దూరంగా ఉంచవలసిన వారి గురించి, నగర పౌరులకు ఉండకూడని అలవాట్ల గురించి కూడా పాణిని చెప్పాడు. దొంగలు, జూదరులు, తాగుబోతులు, వేశ్యలు, తార్పుడుగాళ్ళు నగరాల్లో ఉండదగరని చెప్పాడు.

నగరాల సంస్కృతి రాజకీయ కార్యకలాపాలకు, వ్యాపారానికి, సాహసికులకు, కళాకారులకు, పండితులకు ఎక్కువగా అనువుగా ఉంటుంది. సంపన్నులు ఎక్కువగా సుఖభోగాలు అనుభవించే అవకాశాలు ఉంటాయి. వారికి

అన్నీ అమర్చిపెట్టే మనషులూ అవసరమౌతారు. ప్రధానంగా నగరాలు ఈ తరహాల వారికి ఆవాసంగా ఉండేవి.

క్రీ.పూ. 60ం-300 మధ్య నగరాల జనాభా దాదాపు రెట్టింపు అయివుండాలని పురావస్తు త్రవ్వకాల ఆధారంగా చరిత్రకారులు భావిస్తున్నారు. మలివేదకాలంనాటికన్నా వ్యవసాయం బాగా వృద్ధి చెందివుండాలి. అప్పుడే నగరాల్లో పెరిదిన జనాభా కి తిండి అందుతుంది. దానితోబాటు చేతివృత్తులు కూడా అభివృద్ధి చెందివుండాలి. ఈ కాలంలో అభి వృద్ధి చెందిన నగరాల్లో కొన్నింటి జనాభా ఈ విధంగా ఉండవచ్చునని చరిత్రకారులు నిర్ధా రించారు:

కౌశాంబి: 4000, తక్షశిల: 5200, అయోధ్య:3,240, భుకారి (అంబాలా జిల్లా):4000, బాలా హిసార్ (కాబూల్) : 5,200, భిటా : 2,280, ఎరాన్ : 1,600, అనూరాధపురా:(శ్రీలంక): 7,200, పుష్కలావతి : 4040, అత్రంజిఖెర (ఎటా జిల్లా, యు.పి): 25,600. నేటి జనాభా గణన కొలబద్దల ప్రకారం వీటిని నగరాలు అని అనలేము కాని వాటి ఆర్థిక కార్యకలాపాల స్వభావం రీత్యా అప్పట్లో అవి నగరాలే.

ఈ నగరాల చుట్టూ కందకాలు, ఎత్తైన కోటగోడలు నిర్మించారు. పాటలీపుత్రం నగర కందకం 350 హెక్టార్ల స్థలం చుట్టూ తవ్వబడివుంది. ఉజ్జయిని కోట గోడ ఎత్తు 14 మీటర్లు. దాని వెడల్పు పునాది దగ్గర 75 మీటర్లు. ఈ కందకాలమీదుగా కోట లోపలికి రావడానికి ఇటుకలతో నిర్మించిన వంతెనలు, వాటిని నిలపడానికి కొయ్య పలకలు ఉపయోగించారు.

(చూ. ఫిగర్ 2.1 – రాజగిర్ కోట గోడ)

నగరాలలో కొన్ని ప్రాంతాలకు మెరుగైన వసతులు ఉన్నట్టు, మరికొన్ని ప్రాంతాలకు వసతులు లేనట్టు తవ్వకాలలో గుర్తించారు. బహుశా పేద పట్టణవాసులు వసతులు లేని ప్రాంతాలలో నివసించివుండాలి. భారీగా ముడి ఇనుప నిల్వలు, కొన్ని చోట్ల ఎక్కువ సంఖ్యలో వెండి నాణాలు లభించాయి. కమ్మరి కొలిమిలు ఎక్కువగా ఉండేవని, చేతివృత్తులు బాగా విస్తరించాయని చెప్పవచ్చు. కౌశాంబి వంటి నగరాలలో భూమి సారవంతం కాకపోయినా అక్కడ నగరం నిర్మించడానికి కారణం సమీపం లోనే ఇనుపఖనిజ నిల్వలు, విలువైన రంగురాళ్ళ గనులు ఉండడం. ఐతే ఎక్కువ నగరాల చుట్టూ సారవంతమైన భూములు ఉన్నాయి.

> **❝ నగరాలలో కొన్ని ప్రాంతాలకు మెరుగైన వసతులు ఉన్నట్టు, మరికొన్ని ప్రాంతాలకు వసతులు లేనట్టు తవ్వకాలలో గుర్తించారు. బహుశా పేద పట్టణవాసులు వసతులు లేని ప్రాంతాలలో నివసించివుండాలి. భారీగా ముడి ఇనుప నిల్వలు, కొన్ని చోట్ల ఎక్కువ సంఖ్యలో వెండి నాణాలు లభించాయి. కమ్మరి కొలిమిలు ఎక్కువగా ఉండేవని, చేతివృత్తులు బాగా విస్తరించాయని చెప్పవచ్చు. ❞**


రాయగిరి కోట గోడ లోపలి ముఖం

వాయవ్యంలో కాందహార్, చార్సద్దా, తక్షశిల వంటి నగరాలు అటు మధ్య ఆసియాకు, ఇటు చైనాకు పోయే దారిలో ఏర్పడ్డాయి. గంగ-యమున పరీవాహక ప్రాంతంలో ఏర్పడ్డ నగరాలు, వాటి ఉప నగరాలు క్రమంగా తూర్పున బెంగాల్ దాకా విస్తరించాయి. మధ్యభారత్ కు, దక్షిణానికి కూడా ఇక్కడినుండి దారులు ఏర్పడ్డాయి. పశ్చిమాన భరుచ్ (భరుకచ్చం) సొపారా ( ముంబై దగ్గర) అనేవి ప్రధాన నగరాలుగా ఉండేవి. ఇక్కడినుండి అటు వాయవ్యం వైపుకు, ఇటు ఉత్తరాన గంగా ప్రాంత నగరాలవైపుకు దారులు ఉండేవి. దక్షిణాన బంగారం గనులు ఉండడంతో కర్ణాటకలోను, దక్కను ప్రాంతాల్లో నగరాలు ఏర్పడ్డాయి. అవంతి,

ఉజ్జయిని, ఛేది (జబల్‌పూర్ సమీపం) వంటివి మధ్య భారతంలోని నగరాలు. ఇక తూర్పు, పశ్చిమ సముద్ర తీరాల్లో సముద్రమార్గం గుండా సాగిన వ్యాపారాన్ని నిర్వహించే నగరాలు అనేకం ఏర్పడ్డాయి. మధ్యధరా ప్రాంతం తో సముద్ర మార్గం ద్వారా ఏర్పడిన సంబంధాలు ఇందుకు తోడ్పడ్డాయి.

### సామాజిక గ్రూపులు

పట్టణాలు వృద్ధి చెందడంతో వర్గ సమాజం సంక్లిష్ట రూపం తీసుకోసాగింది. తొలినాటి సమాజాలు రక్త సంబంధీకుల గుంపులుగా, తెగ పెద్దల నాయకత్వంలో, పెద్దగా అంతరాలు లేకుండా ఉండేవి. కాని తర్వాత రూపొందిన సమాజంలో అనేక తరగతులు ఏర్పడ్డాయి. పుట్టుకను బట్టి, సామాజిక హోదాను బట్టి, ముఖ్యంగా వారివద్ద ఉన్న సంపదను బట్టి సమాజంలో వివిధ దొంతరలు ఏర్పడ్డాయి. సామాజిక, రాజకీయ, ఆర్థిక, మతపరమైన ప్రాతిపతికలు వీటి వెనుక ఉన్నాయి.

"బుద్ధుని కాలంలో సమాజం" అన్న అంశంపై పరిశోధనలు చేసిన నరేంద్ర వాగ్లే బ్రాహ్మణుడు, గహపతి, రాజు, గామని, బౌద్ధ సన్యాసి, ఉపాసకుడు, పరివ్రాజకుడు, నిగంతుడు (జైన సన్యాసి) అనేవి ప్రధాన సామాజిక గ్రూపులుగా గుర్తించారు.

**గహపతి లేదా శెట్టి:** పట్టణాలు బతకాలంటే వ్యవసాయంలో ఎక్కువ మిగులు ఉండాలి. దానికి తోడు పశుపెంపకం కూడా

**(మిగతా 34వ పేజీలో)**

ఆదర్శం

# కరోనా బాధితుల కోసం సిపిఐ(ఎం) ఐసోలేషన్ కేంద్రాలు

కరోనా మహమ్మారి ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తున్న వేళ ఉభయ తెలుగురాష్ట్రాలలోని ప్రజలకు సిపిఐ(ఎం) ఆపన్నహస్తం అందించింది. గతం నుంచి ప్రజలు ఆపదలో ఉన్న ప్రతి సమయంలోనూ స్పందించిన విధంగానే కోవిడ్ సమయంలో కూడా ప్రజలకు సేవలందించింది. గతంలో కృష్ణా కాలువలు పూడికవేసి, రైతాంగానికి పంటనీరు సక్రమంగా అందని సమయంలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో కాలువలలో పూడిక తీసి, పంటలకు నీరందించటానికి కృషి చేసింది. 1980వ దశాబ్దంలో మహబూబ్ నగర్ జిల్లాలో తీవ్రమైన కరువు ఏర్పడినపుడు అంబలి కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలు నిలబెట్టింది. కరోనా మొదటి దశ ప్రారంభమైనపుడు ప్రజల బతుకుతెరువు, ఆహారలభ్యతను గురించి ఏ మాత్రం ఆలోచన లేకుండా కేంద్ర ప్రభుత్వం నాలుగు గంటల వ్యవధితో దేశవ్యాపిత లాక్‌డౌన్ విధించింది. దానితో పనిచేసుకుంటేగాని పూట గడవని పేదలు, తమ స్వంత గ్రామాలను విడిచి వందలు, వేల కిలోమీటర్ల దూరంలోని నగరాలు, పట్టణాలకు వలసలు వెళ్ళిన కార్మికులు చెప్పరాని ఇక్కట్లకు గురయ్యారు. తినటానికి తిండి, స్వగ్రామాలకు చేరటానికి ఏ విధమైన రవాణా సౌకర్యాలు లేని పరిస్థితులలో మండుటెండలలో వేల కిలోమీటర్లు నడవటానికి పూనుకున్నారు. ఆ విధంగా నడక సాగిస్తున్న పేదల కడుపు నింపటానికి అనేక ప్రాంతాలలో ఆహారకేంద్రాలను ఏర్పాటు చేసి, వలస కార్మికులకు ఆహారం అందించింది. పట్టణాలు, నగరాలలో పనులు కోల్పోయి తిండికి అలమటిస్తున్న పేదల కోసం స్థానికంగా ఆహార కేంద్రాలను ఏర్పాటుచేసి వారికి ఆహారం అందించటానికి కృషిచేసింది.

వీటితో పాటు మొదటిదశలో కరోనా తీవ్రంగా విస్తరిస్తున్న వేళ ఆసుపత్రులకు వెళ్ళి వైద్యం చేయించుకోలేని, తమ ఇంట్లో ఐసోలేషన్‌లో ఉండటానికి సాధ్యం కాని పేదల కోసం తన పార్టీ కార్యాలయాలను ఐసోలేషన్ కేంద్రాలుగా మార్చి వైద్యం అందించింది. ఈ విధంగా మొదటి దశలో వేలాది మందికి వైద్యం అందించి, కోవిడ్ బారినపడిన వారు ఆరోగ్యంతో తిరిగివెళ్ళేలా చేసింది.

కరోనా రెండవ దశ విజృంభిస్తున్న సమయంలో కుటుంబంలో ఒకరికి వస్తే అందరికీ వచ్చే ప్రమాదం ఏర్పడింది. ఒక సమయంలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో ఆక్సిజన్, సాధారణ బెడ్లు దొరకని పరిస్థితి నెలకొంది. ఆక్సిజన్ అందక అనేకమంది ప్రాణాలు కోల్పోయారు. కొన్నిచోట్ల ప్రభుత్వ ఆసుపత్రులలో వసతుల లేమి, ప్రైవేటు ఆసుపత్రులు లక్షల రూపాయలు బిల్లులు వేయటంతో ప్రజలు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొన్నారు.

### కరోనా రెండవ దశలో ఏపి కమిటీ కృషి

ఈ సంవత్సరం ఏప్రిల్ నుండి రెండవ దశ ఉధృతం అవుతున్న తరుణంలో తిరిగి ఐసోలేషన్ కేంద్రాల నిర్వహణకు పూనుకుంది. రెండవ దశ ఉధృతి అవుతున్న సందర్భంలో సిపిఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ కమిటి ఏప్రిల్ 16వ తేదీన విజయవాడలోని ఎంబివికెలో మొదటి ఐసోలేషన్ కేంద్రాన్ని ప్రారంభించింది. అప్పటి నుండి జూన్ 6వ తేదీ వరకు రాష్ట్రంలోని ఎంబివికెతో పాటు వడ్డేశ్వరం, నెల్లూరు, విశాఖపట్నం, శ్రీకాకుళం, పిడుగురాళ్ళ, ఒంగోలు, గుంటూరు, కర్నూలు, అరకు, భీమవరం, కాకినాడ, యడ్లపాడు, విజయనగరం, ఏలూరు, తిరువూరు, కదిరి, విజయవాడ రాణిగారితోట, బి ఆర్ టి ఎస్ రోడ్డు, సత్తెనపల్లి, బుట్టాయగూడెం, చింతూరు, తిరుపతి, మొత్తం 24 కేంద్రాలలోని పార్టీ కార్యాలయాలలో ఐసోలేషన్ కేంద్రాలను ప్రారంభించి, నిర్వహిస్తున్నది. ఈ కేంద్రాలలో జూన్ 3వ తేదీ వరకు 1,689 మంది చేరి, చికిత్స పొందారు. ఐసోలేషన్ కేంద్రాలు అన్నింటిలోనూ ప్రజలకు వైద్య సౌకర్యం అందించటం కోసం అన్ని చర్యలు తీసుకుంది. ఐసోలేషన్ కేంద్రంలో చేరిన ప్రతి రోగికి తగిన సేవలు అందించటం కోసం అన్ని ఐసోలేషన్ కేంద్రాలలో డాక్టర్లు, నర్సుల బృందాలను ఏర్పాటు చేశారు. వీరు రోగులకు నిరంతరం అవసరమైన సేవలను అందించారు. రోగాన్ని ఎదుర్కొని, రోగ నిరోధక శక్తిని పెంపొందించే విధంగా పోషకాలున్న ఆహారాన్ని అందించారు. వారంలో రెండు రోజులు భోజనంలో మాంసాహారాన్ని


ప్రజలలో గొప్ప స్పందన వచ్చింది. ఎవరూ చేయని సాహసం మీరే చేశారని కొనియాడారు. నిధులు ఇవ్వడం, వస్తు రూపేణా సహాయం చేయటంలో గతంలో ఎన్నడూ లేని తరగతుల నుండి స్పందన వచ్చింది. అనేక మంది అడగకుండానే ముందుకువచ్చి నిధుల ఇచ్చారు. ప్రజలు ఆపదలో ఉన్నపుడు విజ్ఞాన కేంద్రాలు, ప్రజాసంఘాలు సేవా కార్యక్రమాలకు పూనుకుంటే ఎంత స్పందన వస్తుందో అనుభవంలో స్పష్టమైంది. అమెరికా, ఇంగ్లండ్ తదితర దేశాలలోని డాక్టర్లు, ఇతర దేశాలలోని సంస్థలు, ఐఎఎస్‌లు, మేధావులు, వ్యాపారులు, ఐటి ఉద్యోగులు, కూరగాయల రైతులు తదితర తరగతులన్నీ స్పందించాయి. విజయవాడలో 90 లక్షల రూపాయల నిధులు, మరో 20 లక్షల రూపాయుల విలువైన సరుకులు విరాళంగా వచ్చాయి. 24 కేంద్రాలలోనూ సేవా దృక్పథం కలిగిన కొత్త డాక్టర్లు ముందు కొచ్చి, రోగులకు వైద్యసేవలు అందించటం మంచి అనుభవం. 50 నుంచి 60 మంది డాక్టర్లు ఈ కార్యక్రమంలో భాగస్వాములయారు.

### తెలంగాణ సిపిఐ(ఎం) కమిటీ కృషి

కరోనా రెండవ దశ ఉధృతంగా ఉన్న పరిస్థితులలో తెలంగాణ సిపిఐ(ఎం) కమిటి కరోనా బారిన పడుతున్న సామాన్యప్రజలను ఆదుకోవటం కోసం ఐసోలేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.మే నెల 3వ తేదీన పార్టీ పొలిట్‌బ్యూర్ సభ్యులు బివవి రాఘవులు, తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఐసోలేషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. మొదట 20 బెడ్లతో ప్రారంభించిన ఈ కేంద్రాన్ని 50 బెడ్లకు విస్తరించారు. మొత్తం 800 మంది చేరతామని వచ్చినప్పటికీ ఇండ్లలో ఉండలేనివారు, స్వల్ప లక్షణాలున్న వారినే చేర్చుకోవలని నిర్ణయించటంతో 200

మందిని చేర్చుకొని, మిగతా వారు ఆసుపత్రు లలో చేరాలని కోరారు. డాక్టర్లు, నర్సుల నిరంతర పర్యవేక్షణ, అంకితభావంతో సేవలందిస్తున్న ఫలితంగా ఆందోళనతో ఇక్కడికి వచ్చిన రోగులు పూర్తి ఆరోగ్యంతో ఆనందంగా ఇళ్ళకు వెళుతున్నారు. ఇక్కడ చేరిన కరోనా రోగులకు వైద్యం, వసతి, పోషకాహారం ఉచితంగా అందించారు. వారంలో రెండురోజులు మాంసాహారాన్ని అందించారు. అవసరమైన టెస్టులు బయట చేయించినా అవీ ఉచితంగానే చేయిస్తు

> ❝ ఉభయ తెలుగురాష్ట్రాలలో అధికార ప్రతిపక్షాల్లోఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు కోవిడ్ కష్టకాలంలో వైద్యం అందక ఇబ్బంది పడతున్నప్రజలను గురించి పట్టించుకోలేదు. సిపిఐ(ఎం) మాత్రమే ఆ కృషి చేసింది. ప్రజల కోసం పార్టీ ఎంత అంకితభావంతో పని చేస్తున్నదనే విషయం కోవిడ్ సందర్భంగా చేసిన కృషి వెల్లడించింది. ఆర్థిక, రాజకీయ, సామాజిక, రోజువారీ సమస్యలతో పాటు కోవిడ్ లాంటి మహమ్మారులు చుట్టుముట్టినా నిరంతరం ప్రజల కోసమే పనిచేస్తామని ఈ కార్యక్రమం ద్వారా పార్టీ స్పష్టం చేసింది. ❞




హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కరోనా ఐసోలేషన్ సెంటర్ ప్రారంభించి ప్రసంగిస్తున్న సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, పార్టీ తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు. ఆంధ్ర ప్రదేశ్‌లోని బుట్టాయ గూడెంలో కోవిడ్ సెంటర్ ప్రారంభిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి మధు తదితరులు

న్నారు. ఒక్కోరోగికి ఐదువేల నుండి పదిహేను వేల రూపాయల వరకు ఖర్చయ్యాయి. అయినా ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా సేవలందించారు. తెలంగాణ ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ మందులను అందించి ఎస్‌వికెకు సహకరించింది. నలుగురు డాక్టర్లు, నలుగురు నర్సులతో కూడిన బృందం రోగులకు నిరంతరం సేవలు అందించటానికి కృషి చేశారు. ఇంటిధ్యాస లేకుండా వలంటీర్లు రోగుల సేవలో ఉన్నారు. దాతలు అందించిన అంబులెన్స్, డ్రైవర్ 24 గంటలూ అందుబాటులో ఉన్నారు.

### దాతల సహకారం

ఈ కృషితో స్పందించిన దాతలు ఎస్వీకె ఐసోలేషన్ కేంద్రానికి నగదు, వస్తురూపంలో సహాయం అందించారు. లతారాజా ఫౌండేషన్, ఎల్డర్స్ క్లబ్, తానా, కాల్‌హెల్త్, జిగ్రీ ఫౌండేషన్, స్ఫూర్తి ఫౌండేషన్, సీఆర్ కాలేజి పూర్వ విద్యార్థులు, ప్యూర్‌సంస్థ, ఆర్‌బిఐ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, బ్యాంక్, ఇన్యూరెన్స్, కార్మికసంఘాలు, మహిళా, ప్రజా, సామాజిక సంఘాలు, ఎన్జీవోలు, ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్, ఉపాధ్యాయ సంఘాలు, వ్యక్తులు, సంస్థలు ఆర్థికంగా, వస్తురూపంలో సహాయం చేశారు. ఇక్కడ సేవలు పొందిన కొందరు పేషెంట్లు స్పందించి సహకారం అందిస్తున్నారు.

ఎస్వీకెతో పాటు ప్రగతినగర్‌లో సుందరయ్య విజ్ఞానకేంద్రం ఐసోలేషన్ కేంద్రం, ఖమ్మంలో బోడేపూడి విజ్ఞానకేంద్రం, భద్రాద్రి కొత్తగూడెంలో బండారు చంద్రరావు ట్రస్టు, నల్లగొండలో మాలి పురుషోత్తమరెడ్డి ఐసోలేషన్ కేంద్రాలతో పాటు ఫోరం ఆఫ్ ఐటి ప్రొఫెషనల్స్ ఐసోలేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి, రోగులకు అండగా నిలిచాయి.

''హైదరాబాద్‌లోని దోమల్‌గూడ ప్రాంతం లో కరోనా సోకిందని రాత్రికి రాత్రే ఇళ్ళు ఖాళీ చేయిస్తే దిక్కుతోచక పేవ్‌మెంట్‌పై పడుకున్నాం, ఎస్‌వీకెలో ఐసోలేషన్ సెంటర్ ఉందని తెలిసి రాత్రికే ఫోన్ చేసి జాయినయ్యాం. అన్ని రకాల వైద్య సేవలు అందటంతో ప్రశాంతంగా ఉన్నాం. ఆరోగ్యంగా ఇంటికెళుతున్నాం'' అని అక్కడ సేవలు పొందిన తల్లికొడుకు చెప్పారు. "నా భార్యకు కరోనా వస్తే ఎన్ని ఆసుపత్రులు తిరిగినా బెడ్ దొరకలేదు. అబద్ధం చెప్పి, ఆసుపత్రిలో చేర్పించినా చనిపోయింది. తర్వాత నాకు కరోనా వచ్చింది. ఏంచేయాలో అర్థం కాలేదు. ఎస్వీకెలో చేరాను. డాక్టర్లు, నర్సులు చేసిన సేవ, పౌష్టికాహారం, మానసిక ఆందోళన లేకుండా చూసుకోవటం వల్ల బతికాను. ప్రాణదానం చేసినందుకు ఎస్వీకెకు ధన్యవాదాలు" అని వెళ్ళేటపుడు మరొకరు చెప్పారు. ఇక్కడ సేవలు పొందిన వారు అనేకమంది ఈ విధంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఉభయ తెలుగురాష్ట్రాలలో అధికారంలో, ప్రతిపక్షంలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు ఏవీ కోవిడ్ కష్టకాలంలో వైద్యం అందక ఇబ్బంది పడతున్న ప్రజలను గురించి పట్టించుకోలేదు. ఒక్క సిపిఐ(ఎం) మాత్రమే ఆ కృషి చేసింది. ప్రజల కోసం పార్టీ ఎంత అంకితభావంతో పనిచేస్తున్నదనే విషయం కోవిడ్ సందర్భంగా జరిగిన కృషి వెల్లడించింది. ఆర్థిక, రాజకీయ, సామాజిక, రోజువారీ సమస్యలతో పాటు కోవిడ్ లాంటి మహమ్మారులు చుట్టుముట్టినా నిరంతరం ప్రజల కోసమే పనిచేస్తానని ఈ కార్యక్రమం ద్వారా పార్టీ స్పష్టం చేసింది. వైద్యం పొందిన రోగులు పునర్జన్మ పొందినంత ఆనందంగా తమ ఇళ్ళకు తిరిగి వెళ్ళారు.

❊

**అంతర్జాతీయం**

# జి7, నాటో సమావేశాలు : మరో ప్రచ్ఛన్న యుద్ధానికి సన్నాహాలు


రచయిత మార్క్సిస్టు పత్రిక సంపాదకులు

**ఎస్ వెంకట్రావు**

అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్ అధికారం చేపట్టిన తరువాత చైనాకు వ్యతిరేకంగా ఇతర సామ్రాజ్యవాద దేశాలనూ, మిత్ర దేశాలనూ కూడగట్టడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బైడెన్ జి20 దేశాల ప్రాధాన్యతను తగ్గించి జి7 దేశాలకూటమి, నాటో కూటమి వేదికలను చైనా వ్యతిరేక రాజకీయ, సైనిక వేదికలుగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. గత ఫిబ్రవరి, మార్చి మాసాల్లో జరిగిన నాటో,జి7 సమావేశాలకు కొనసాగింపుగా జూన్‌లో జరిగిన ఈ కూటముల సమావేశాలు చర్చించిన అంశాలను పరిశీలిస్తే ప్రపంచాన్ని మళ్లీ ప్రచ్ఛన్న యుద్ధం వైపు తీసుకుపోదానికి అమెరికా ఎంతగా తహతహలాడుతున్నదో తేటతెల్లమవుతుంది.

జి7 అనేది ఏడు సామ్రాజ్యవాద అగ్ర దేశాల కూటమి. అమెరికా నాయకత్వంలోని ఈ కూటమిలో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, ఇటలీ, కెనడాలు ఉన్నాయి. ఐరోపా యూనియన్ అనధికారిక సభ్యురాలిగా ఉంది. ఈ దేశాలన్నీ గతంలో ప్రపంచాన్ని వలసలుగా విభజించుకుని పాలించిన సామ్రాజ్యవాద దేశాలే. 1980 దశకం వరకు ప్రపంచోత్పత్తిలో 70 శాతం ఈ ఏడు దేశాల్లోనే జరుగుతుండేది. కానీ గత మూడు దశాబ్దాల కాలంలో వర్ధమాన దేశాల్లో కొన్ని ముఖ్యంగా చైనా, భారత్ వంటి దేశాలు ఆర్థికంగా ముందుకు రావడంతో అంతర్జాతీయ యవనిక మీద జి7 ప్రాబల్యం తగ్గుతున్నది. ప్రస్తుతం ప్రపంచ స్థూల ఉత్పత్తిలో జి7 దేశాల వాటా 48 శాతానికి పడిపోయింది. ఆర్థిక, సాంకేతిక రంగాల్లో శరవేగంగా అభివృద్ధి సాధిస్తున్న చైనా రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించింది. కరోనా మహమ్మారి నేపథ్యంలో ప్రధాన పశ్చిమ దేశాలన్నీ ఆర్థికాభివృద్ధిలో చతికిలపడిపోగా సోషలిస్టు చైనా మాత్రం సానుకూల అభివృద్ధితో ముందుకుపోతున్నది. ఇదే పద్ధతిలో ఆర్థిక, సాంకేతికాభివృద్ధి సాధిస్తే చైనా త్వరలోనే ఆర్థికంగా అమెరికాను దాటిపోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అలా జరక్కుండా, అమెరికా ప్రపంచాధిపత్యం ఇంకా దిగజారకుండా ఉండాలంటే చైనాను ఆర్థికంగా, సాంకేతికంగా, రాజకీయంగా కట్టడి చేయడమే మార్గమని అమెరికా భావిస్తున్నది. ఇదే గత రెండు దశాబ్దాలుగా అమెరికా విదేశాంగ విధానంలో ప్రధాన వ్యూహంగా ఉంది. అమెరికా అధ్యక్షునిగా బరాక్ ఒబామా అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిపాదించిన 'ఆసియా పైవోట్' (ఆసియా కేంద్రంగా) వ్యూహానికి చైనాను కట్టడి చేయడమే ప్రధాన లక్ష్యం. తరువాత ఆ దేశ అధికార పగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ చైనాతో వాణిజ్య యుద్ధం ప్రారంభించారు. ఇప్పుడు బైడెన్...ట్రంప్ మాదిరిగా మాటలు పెద్దగా చెప్పక పోయినా చైనాను కట్టడి చేయడమే ప్రధాన దీర్ఘకాలిక లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో ఐరోపా దేశాలతో ఏర్పడిన అంతరాలను తగ్గించడానికి బైడెన్ శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. చైనాకు మిత్ర దేశంగా ఉన్న రష్యాను కూడా తమ అక్కున చేర్చుకుని చైనాను ఒంటరిపాటు చేయాలని బైడెన్, రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్‌తో కూడా చర్చలకు ఉపక్రమించారు. నిజానికి సోవియట్ విచ్ఛిన్నం అయిన వెంటనే బోరిస్ ఎల్సిన్ నాయకత్వంలో రష్యాను 1993లో జి7 కూటమిలో చేర్చుకుని జి8గా మార్చారు. అయితే పుతిన్ అధికారం చేపట్టాక వాటి మధ్య వైరుధ్యాలు తీవ్రమైనాయి. ఉక్రెయిన్‌తో సహా రష్యా ముంగిటికి నాటోను విస్తరించడానికి జి7 చేసిన ప్రయత్నాలను పుతిన్ వ్యతిరేకించాడు. దాంతో రష్యాను తొలగించి తిరిగి జి7గా మార్చారు. 2008 ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ప్రపంచ వ్యవహారాలు చక్కదిద్దాలంటే ఎదిగి వస్తున్న (ఎమర్జింగ్) వర్ధమాన దేశాలను కూడా కలుపుకు పోవాల్సిన అవసరం ఉందని భావించి జి7 దేశాలకు తోడు బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) దేశాలనూ, వాటితోపాటు మెక్సికో, అర్జెంటీనా జర్మనీ, ఇండోనేసియా, సౌదీ అరేబియా, దక్షిణ కొరియా, టర్కీ + యూరోపియన్ యూనియన్‌లను కలుపుకుని జి20(20 దేశాల కూటమి)గా ఏర్పడింది. ప్రపంచ వ్యవహారాలు నిర్వహించడంలో జి20 ప్రధాన వేదికగా అఒక దశాబ్దంపైగా పనిచేసింది. కానీ చైనా, రష్యాలతో సామ్రాజ్యవాదుల ఘర్షణ వైఖరితో జి20లో వైరుధ్యాలు పెరుగుతూ వచ్చాయి. ట్రంప్ హయాం నుండి అమెరికా జి20 ప్రాధాన్యత తగ్గిస్తూ, పాత సామ్రాజ్యవాద దేశాల కూటమివైపు ఎక్కువ మొగ్గుచూపడం ప్రారంభించారు. ఇటీవలి కాలంలో జి20 కూటమిలోని తమ అనుకూల దేశాలైన భారత్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియాలను కూడా ఆహ్వానితుల హోదాలో తమ కూటమిలో చేర్చుకున్నారు. ఈ మూడు దేశాలూ ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అమెరికా యుద్ధ వ్యూహానికి జూనియర్ భాగస్వాములుగా పనిచేయడానికి అంగీకరించాయి. అందుకనే ఇప్పుడు ఈ మూడు దేశాలతో కలుపుకుని ఈ కూటమిని 'డి10' అనే కొత్త పేరుతో కూడా పిలుస్తున్నారు.

సోషలిస్టు వ్యవస్థ బలమైన ప్రపంచ శక్తిగా ఉన్నప్పుడు సామ్రాజ్యవాదులు సోవియట్ యూనియన్‌పైనా, సోషలిజం పైనా తీవ్రమైన దుష్ప్రచారం చేయడానికి తమ అమ్ముల పొదిలోని అన్ని అస్త్రాలనూ ఉపయోగించారు. సోవియట్‌ను, ఇతర సోషలిస్టు దేశాల్లోని శ్రామిక వర్గ రాజ్యాలను నియంతృత్వ బూచిగా చూపించి ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని కమ్యూనిజానికి వ్యతిరేకంగా మలచడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. సోవియట్ విచ్ఛిన్నం తరువాత తమ ప్రచారాన్ని కమ్యూనిస్టు వ్యతిరేకత నుండి ఉగ్రవాదం వైపుకు మరలించారు. ఆంక్షల కొరడా ఝుళిపించి చిన్న రాజ్యాలను లొంగదీసుకున్నారు. లొంగని దేశాలపై యుద్ధాలు చేశారు. మొత్తం మీద ప్రపంచంపై అమెరికా నాయత్వంలోని సామ్రాజ్యవాదం తిరుగులేని ఆధిపత్యం సాధిం

చింది. ఇప్పుడు ఆర్థికంగా, సాంకేతికంగా బలపడుతున్న చైనా నుండి దాని ఆధిపత్య ధోరణులకు సవాళ్లు ఎదురవుతున్నాయి. అందువల్లనే ఈ చైనా వ్యతిరేక దుష్ప్రచారం.

సామ్రాజ్యవాద సైనిక కూటమి 'నాటో' (ఉత్తర అట్లాంటిక్ ఒప్పంద కూటమి). ఉత్తర అట్లాంటిక్‌కు ఇరువైపుల గల 12 దేశాలతో ప్రారంభమైన ఈ కూటమి తొలుత సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపా సోషలిస్టు దేశాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడింది. నాటో కూటమిలోని ఏ దేశంమీద ఇతర దేశాలు దాడి జరిపినా నాటోకూటమి దేశాలు తమ దేశం మీదనే దాడి జరిగినట్టు భావించి కలిసి కట్టుగా ఎదుర్కోవాలనేది నాటో నిబంధనల్లో ఒకటి. నాటోకు ప్రతిగా సోవియట్, దాని మిత్ర సోషలిస్టు దేశాలు వార్సా కూటమిని ఏర్పాటు చేశాయి. సోవియట్ విచ్ఛిన్నం తరువాత వార్సా కూటమి రద్దయింది. అమెరికాకు గానీ, దాని మిత్ర దేశాలకు గానీ యుద్ధ ప్రమాదం లేకుండా పోయింది. అయినా అమెరికా నాటోను కొనసాగించడమే కాకుండా పోలెండ్, హంగరీ తదితర మాజీ తూర్పు యూరప్ దేశాలనూ, మాజీ సోవియట్ రిపబ్లిక్కు దేశాలనూ కలుపుకుని 30 దేశాలకు విస్తరించింది. ఇది సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని కాపాడే తిరుగులేని మిలటరీ యంత్రంగా మారింది. ఇప్పుడు ఈ నాటో సైనియక యంత్రం మొత్తాన్ని చైనా, రష్యాలకు వ్యతిరేకంగా నిలపడానికి అమెరికా ప్రయత్నిస్తున్నది. మరోవైపు నాటోతోపాటు చైనాను చుట్టుముట్టే వ్యూహంలో భాగంగా కొత్త సైనిక కూటములకు అమెరికా తెరలేపింది. వాటిలో ప్రధానమైనది ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అమెరికా నాయకత్వంలో ఏర్పడిన నాలుగు దేశాల క్వాడ్ కూటమి. ఇందులో అమెరికా తోబాటు జపాన్, భారత్, ఆస్ట్రేలియాలు ప్రధాన భాగస్వాములుగా ఉన్నాయి. నాడు సోవియట్‌ను సైనిక స్థావరాలతో చుట్టుముట్టి దెబ్బతీయడానికి అనుసరించిన పాత వ్యూహాన్నే అమెరికా నేడు చైనా విషయంలో కూడా అనుసరిస్తోంది.

జూన్‌లో అమెరికా నాయకత్వంలో జరిగిన నాలుగు సమావేశాలు ప్రపంచ రాజకీయాలను సామ్రాజ్యవాద కూటమి ఎలా మలచాలనుకుంటున్నదో తెలియజేస్తున్నాయి. మొదటిది జూన్ 13వ తేదీన ఇంగ్లాండ్‌లోని కార్న్‌వాల్‌లో జరిగిన జి7 సమావేశం. రెండోది జూన్ 14వ తేదీన బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో జరిగిన నాటో కూటమి దేశాల శిఖరాగ్రసభ. మూడోది, జూన్ 16న స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో అమెరికా అధ్యక్షుడు బైడెన్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌ల మధ్య జరిగిన ముఖాముఖి సమావేశం. నాలుగోది, జూన్ 24, 25 తేదీల్లో బ్రెస్సెల్స్‌లో రెండు రోజులపాటు జరిగిన ఐరోపా యూనియన్ శిఖరాగ్ర సమావేశం. ఈ నాలుగు సమావేశాల చర్చలను, తీర్మానాలను పరిశీలిస్తే నేటి ప్రపంచ భూగోళ రాజకీయాల్లోని వైరుధ్యాలు ఎలా పనిచేసున్నాయో అర్థమవుతుంది.

> ❝ భారీ ప్రజా నిరసనల మధ్య ఒక రోజు పాటు జరిగిన జి7 సమావేశం ఆమోదించిన 25 పేజీల తుది ప్రకటన ప్రధానంగా చైనాపై ఎక్కు పెట్టబడింది. చైనాపై ఇటీవలి కాలంలో పశ్చిమ దేశాలు పనిగట్టుకుని చేస్తున్న దుష్ప్రచారాన్ని పునరుద్ధాటిస్తూ రానున్న కాలంలో చైనాను ఒంటరి చేసి దెబ్బతీయడానికి సామ్రాజ్యవాదులు చేసే ప్రయత్నాలను ఈ పత్రంలో ఏకరుపు పెట్టారు. ❞



జి7 శిఖరాగ్ర సమావేశంలో ఏడు దేశాల అధిపతులు

### జి7 శిఖరాగ్ర సమావేశం

భారీ ప్రజా నిరసనల మధ్య ఒక రోజు పాటు జరిగిన ఈ సమావేశం ఆమోదించిన 25 పేజీల తుది ప్రకటన ప్రధానంగా చైనాపై ఎక్కు పెట్టబడింది. చైనాపై ఇటీవలి కాలంలో పశ్చిమ దేశాలు పనిగట్టుకుని చేస్తున్న దుష్ప్రచారాన్ని పునరుద్ఘాటిస్తూ రానున్న కాలంలో చైనాను ఒంటరి చేసి దెబ్బతీయడానికి సామ్రాజ్యవాదులు చేసే ప్రయత్నాలను ఈ పత్రంలో ఏకరుపు పెట్టారు. ఆ ప్రచారాంశాల్లో (1) కరోనా వైరస్ వూహాన్ పరిశోధనా శాలలో పురుడుపోసుకుందనే పేరుతో చైనా వ్యతిరేక ప్రచారాన్ని మరింత ముమ్మరం చేయడం. (2) చైనాలోని సింజియాంగ్ ప్రాంతంలో నివసించే ఉయ్‌ఘుర్ ముస్లింలపై దమనకాండ, హాంగ్‌కాంగ్‌లో ప్రజాస్వామ్య హక్కుల అణచివేత పేరుతో గత కొన్ని సంవత్సరాలుగా పశ్చిమదేశాలు సాగిస్తున్న ప్రచారాన్ని కొనసాగించడం (3) పశ్చిమ దేశాల మేథో హక్కులను తస్కరిస్తున్నదనీ, సైబర్ దాడులకు పాల్పడుతున్నదనీ ఆరోపణలను మరింత ముమ్మరం చేయడం. (4)దక్షిణ చైనా సముద్రంలో నౌకా రవాణా స్వేచ్ఛను కాపాడే పేరుతో ఆ ప్రాంతంలో చైనా సార్వభౌమత్వాన్ని సవాలు చేయడం.

కోవిడ్ –19 మహమ్మారి గబ్బిలాలనుండి మనుషులకు వ్యాపించిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించినప్పటికీ పశ్చిమ దేశాలు ఈ విషయంలో చైనా వ్యతిరేక ప్రచారం కొనసాగించడం వెనుక ఆ వ్యాధిని అరికట్టడంలో ఈ దేశాల వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే లక్ష్యం దాగి ఉంది. ఇప్పటి వరకు ప్రపంచ వ్యాపితంగా 18 కోట్ల మంది వరకు కోవిడ్‌కు మహమ్మారి బారిన పడగా 40 లక్షల మంది మరణించారు. ఇందులో 10 లక్షల మంది అత్యంత సంపన్నమైన జి7 దేశాల్లోనే చనిపోయారు. కోవిడ్‌తో తొలి కొద్ది మాసాలు అతలా కుతలమైన చైనా దాన్ని సమర్ధవంతంగా అదుపు చేసి ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టుకోగలిగింది. కానీ అత్యంత ఆధునిక సదుపాయాలూ, ఆర్థిక స్తోమత ఉన్న అమెరికా, బ్రిటన్ వంటి ధనిక దేశాలు కరోనాను కట్టడి చేయడంలోనూ, ప్రజలకు వైద్యం అందించడంలోనూ, ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకోవడంలోనూ ఘోరంగా విఫలమైనాయి. ఈ వైఫల్యం నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి అవి చైనాపై దుష్ప్రచారాన్ని అంఘించుకున్నాయి. ఇందులో బాగంగా జి7 శిఖరాగ్ర సభ ఊహాన్

**“ జి7 శిఖరాగ్ర సభ తుది ప్రకటన ఒకవైపు రష్యాను చైనాకు వ్యతిరేకంగా తమతో నిలుపుకోడానికి ప్రయత్నిస్తూనే మరోవైపు దానికి హెచ్చరికలు కూడా చేసింది. 51వ పాయింటు లో ఇలా పేర్కొంది: 'రష్యా ఇతర దేశాల ప్రజాస్వామిక వ్యవస్థల్లో జోక్యం చేసుకోవడంతో సహా అస్థిరత సృష్టించే ప్రవర్తన, ప్రమాదరక పోకడలు మానుకోవాలని కోరుతున్నాం.....ఉక్రెయిన్ సరిహద్దు నుండి క్రిమియా ద్వీపకల్పం నుండి సైన్యాన్ని, పరికరాలను ఉపసంహరిం చాల్సిందిగా కోరుతున్నాం.” అని పేర్కొంది. ”**

లాబ్ సిద్ధాంతానికి మద్దతు ప్రకటించింది. “చైనాలో కోవిడ్ మహమ్మారి పుట్టిందనే అంశంపై నిపుణుల కమిటీ నివేదికతో సహా అన్ని అంశాలపైనా త్వరగా, పారదర్శకంగా, నిపుణుల నాయకత్వంలో, సైన్సు ఆధారంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ రెండో దశ విచారణ జరపాలని మేము కోరుతున్నాము” అని శిఖరాగ్ర సహ తుది ప్రకటన పేర్కొంది. డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన ఈ ప్రచారాన్ని సామ్రాజ్యవాదులు రానున్న రోజుల్లో మరింత ముమ్మరం చేయదలచుకున్నారన్న విషయం దీన్ని బట్టి అర్ధమవుతోంది. తుది ప్రకటనలోని 49వ పాయింటు మిగిలిన విషయాలపై కింది విధంగా పేరొంది: సింజియాంగ్, హాంగ్‌కాంగ్ అంశాల తో సహా అన్ని విషయాల్లో “మానవ హక్కులను, మౌలిక స్వేచ్ఛలను చైనా కాపాడాలన్న విషయం తో సహా మేము మా విలువలు అమలయ్యేట్టు చూస్తాము”. “అంతర్జాతీయ చట్టాలపై ఆధారపడి నడవాల్సిన బాధ్యత పెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన దేశాలన్నిటిపై ఉంది....ముఖ్యంగా చైనా అనుసరిస్తున్న మార్కెటేతర విధానాలనూ, కార్యకలాపాలనూ ఎదుర్కోవడంలో మేమంతా సమిష్టగా వ్యవహరిస్తాము. ఈ విధానాల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో న్యాయమైన, పారదర్శ కమైన కార్యకలాపాలకు ఆటంకాలేర్పడుతు న్నాయి” అని ప్రకటన పేర్కొంది. అంటే ప్రత్యామ్నాయ, ప్రజానుకూల విధానాలతో చైనా సాధిస్తున్న అప్రతిహత అభివృద్ధి నుండి, సంక్షోభంలో మునిగిన తమ ఆర్థిక వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికి సామ్రాజ్య వాదులు చైనా ఆర్థిక విధానాలపై దుష్ప్రచారాన్ని కొనసాగించదలచుకున్నారన్న మాట. చైనాతో సైనికంగా ఘర్షణ పడ్డానికి కావలసిన పూర్వరంగాన్ని సంయుక్త ప్రకటనలోని 60వ పాయింటులో పేర్కొన్నారు: “న్యాయసూత్రాలపై ఆధారపడ్డ స్వేచ్ఛాయుత ఇండో పసిఫిక్ ప్రాంతం కావాలని మేము కోరుకుంటున్నాం. తైవాన్ జలసంధిలో స్థిరత్వాన్ని కాపాడాలని, జలసంధి లో సమస్యలను శాంతియుతంగా పరిష్కరించు కోవాలని మేము కోరుకుంటున్నాం. తూర్పు, దక్షిణ చైనా సముద్రాల్లో పరిస్థితి పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నాం. ఇక్కడ యథాతథ స్థితిని మార్చడానికీ, ఉద్రిక్తతలు పెంచడానికీ జరుగుతున్న ఏకపక్ష ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం.” చైనా 'ఏకపక్ష' చర్యలపట్ల 'ఆందోళన' పేరుతో దానిపై సైనికంగా ఘర్షణ పడ్డానికి పత్రం రంగాన్ని సిద్ధం చేయపూను కుంది. జి7 సమావేశానికి ముందు రోజు బైడెన్, బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌లు కోర్నిష్ సముద్ర దీరంలో దక్షిణ చైనా సముద్రానికి పంపనున్న యుద్ధ నౌకల సమీపంలో ద్వైపాక్షిక సమావేశం జరపడం గమనించాల్సిన అంశం. ఈ సమావేశానికి ముందు గత నెలలో విడుదల చేసిన అమెరికా బడ్జెట్‌లో బైడెన్ ప్రభుత్వం సైనిక రంగానికి నిధులను రికార్డు స్థాయిలో 75,300 కోట్ల డాలర్లకు (సుమారు 57 లక్షల కోట్ల రూపాయలకు) పెంచారు. ఇందులో 2,470 కోట్ల డాలర్లను (సుమారు 1.85 లక్షల కోట్ల రూపాయలు) అణ్వస్త్రా ఆధునీకరణకు కేటాయించారు. జి7లో ఇతర పెద్ద దేశాలైన ఫ్రాన్స్, బ్రిటన్, జర్మనీలు కూడా సైనిక వ్యయాన్ని భారీగా పెంచాయి.

ఆర్థిక రంగంలో చైనా బెల్ట్ అండ్ రోడ్డు (ఓబిఓర్) ప్రాజెక్టుకు పోటీగా 'మెరుగైన ప్రపంచాన్ని తిరిగి నిర్మించే' (బి3డబ్ల్యు) ప్రాజెక్టును అమెరికా నేతృత్వంలో ప్రారంభిం చాలని జి7 సమావేశం నిర్ణయించింది. ప్రపంచ దేశాల ఆర్థికాభివృద్ధికి సహకరించడం లో ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకులు పూర్తిగా విఫలం కావడంతో చైనా ప్రకటించిన బెల్ట్ అండ్ రోడ్డు ప్రాజెక్టుకు ఆదరణ పెరిగింది. ఎటువంటి ముందస్తు ప్రజావ్యతిరేక షరతులు లేని ఈ ప్రాజెక్టులో ఐరోపా, ఆసియా, ఆఫ్రికాల్లోని దాదాపు 50 దేశాలకు పైగా భాగస్వాములైనాయి. జి7 ప్రకటించిన బి3డబ్ల్యు ప్రాజెక్టుకు నిధులు ఎక్కడి నుండి సమీకరిస్తారు, ఎన్ని దేశాలు భాగస్వాములవుతాయి అనే వివరాలు ప్రకటించలేదు.

కొండంత రాగం తీసి లల్లాయి పాటలు పాడినట్లు కోవిడ్ మహమ్మారితో అతలా కుతలమవుతున్న ప్రపంచానికి 100 కోట్ల డోసుల వాక్సిన్ సరఫరా చేస్తామని జి7 ప్రకటించింది. ఇప్పటికే చైనా 40కి పైగా దేశాలకు కోట్లాది డోసులు సరఫరా చేస్తుడడంతో దానికి పోటీగా జి7 దేశాలు ఈ ప్రకటన చేశాయి. అయితే 750 కోట్లకు పైగా ఉన్న ప్రపంచజనాభాకు రెండు డోసులు వేయడానికి కావలసి వ్యాక్సిన్‌లో ఇది చాలా కొద్ది మొత్తం మాత్రమే. అదికూడా 2022 చివరి నాటికి అందజేస్తామని ప్రకటించడం కంటితుడుపు సాయంగా భావిస్తున్నారు. ఈ లోగా బహుళ జాతి సంస్థలు వ్యాక్సిన్‌లపై పేటెంట్ హక్కులు ఉపయోగించుకుని సూపర్ లాభాలు గడిస్తున్నాయి. అత్యవసర కరోనా వ్యాక్సిన్‌లపైనా, మందులపైనా పేటెంట్ హక్కులు రద్దు చేయాలని ప్రపంచ దేశాలు చేసిన విజ్ఞప్తిని జి7 దేశాలు పెడచెవిన పెట్టాయి. టాక్స్ హెవెన్‌లను ఉపయోగించుకని బహుళజాతి సంస్థలు పన్నులు ఎగవేయకుండా వాటిపై 15 శాతం పన్ను విధించాలని నిర్ణయించాయి.

జి7 శిఖరాగ్ర సభ తుది ప్రకటన ఒకవైపు రష్యాను చైనాకు వ్యతిరేకంగా తమతో నిలుపుకోడానికి ప్రయత్నిస్తూనే మరోవైపు దానికి హెచ్చరికలు కూడా చేసింది. 51వ పాయింటు లో ఇలా పేర్కొంది: 'రష్యా ఇతర దేశాల ప్రజాస్వామిక వ్యవస్థల్లో జోక్యం చేసుకోవడంతో సహా అస్థిరత సృష్టించే ప్రవర్తన, ప్రమాదరక పోకడలు మానుకోవాలని కోరుతున్నాం.....ఉక్రెయిన్ సరిహద్దు నుండి క్రిమియా ద్వీపకల్పం నుండి సైన్యాన్ని, పరికరాలను ఉపసంహరిం చాల్సిందిగా కోరుతున్నాం.” అని పేర్కొంది.

ఈ చైనా వ్యతిరేక ప్రచారం, సైనిక చర్యల వెనుక అమెరికా అసలు లక్ష్యం ఏమిటో బైడెన్, ఆయన అధికార వర్గం పలుమార్లు స్పష్టం చేస్తూనే ఉన్నారు. జి7 శిఖరాగ్ర సభకు వెళ్లే ముందు బైడెన్ వాషింగ్టన్ పోస్టు పత్రికకు ఇంటర్వ్యూ ఇస్తూ “వాణిజ్యం, సాంకేతిక రంగాల్లో 21వ శతాబ్దపు రూల్స్‌ను చైనా గానీ, ఇతర దేశాలుగానీ నిర్ణయించడానికి వీలులేదు” అని చెప్పారు. గత ఏప్రిల్‌లో అమెరికా పార్లమెంటులో ఆయన మాట్లాడుతూ “21వ శతాబ్దంలో విజయం కోసం మనం చైనాతోనూ, ఇతర దేశాలతోనూ పోటీలో ఉన్నాం” అని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగానే జూన్ 8న

అమెరికాసెనెట్‌లో 25,000 కోట్ల డాలర్ల "చైనాతో పోటీ బిల్లు"ను ఆమోదించారు. చైనాతో వాణిజ్య, సైనిక సంఘర్షణను పెంచడమే ఈ బిల్లు ఉద్దేశం. ఈ విషయంలో అమెరికా ప్రయత్నాలకు సహకరించగల సామర్థ్యం ప్రంచంలో ఐరోపా యూనియన్‌కు మాత్రమే ఉందనినాటో అధినేత, అమెరికా నౌకా దళ అడ్మిరల్ జేమ్స్ స్టేరిడిస్ బ్లూమ్‌బెర్గ్ పత్రికకు ఇంటర్వ్యూ ఇస్తూ పేర్కొన్నారు. అందుకనే ట్రంప్ దూరం చేసుకున్న ఐరోపాను అక్కున చేర్చుకోడానికి బైడన్ శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.


**నాటో శిఖరాగ్ర సమావేశం**

ఈ సారి నాటో శిఖరాగ్ర సమావేశం చైనానే లక్ష్యంగా చేసుకుని సాగింది. చైనా తమకు "వ్యవస్థాగత సవాలు"గా మారిందని శిఖరాగ్ర సభ తుది ప్రకటన పేర్కొంది. చైనాను ఎదుర్కొనడానిక ప్రపంచాన్ని కూడదీయాలి అన్న బైడెన్ వ్యూహంలో భాగంగానే నాటో సమావేంలో చర్చలు సాగాయి. తుది ప్రకటన లో డజను సార్లు చైనా పేరు పేర్కొనడం జరిగింది. 2010లో నాటో వ్యూహ పత్రం తయారు చేసినప్పుడు అందులో అసలు చైనా పేరు లేదు. 2019 నాటో ప్రకటనలో ఒక్కసారి మాత్రమే చైనా పేరు పేర్కొన్నారు. కానీ "ఇప్పుడు ఏడాదిన్నర కాలంలో చైనా (సామ్రాజ్యవాదులకు) వ్యవస్థాగత ప్రత్యర్థిగా మారిపోయింది" అని ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక రాసింది. రష్యాతో సహకారం నెరుపుతూ చైనా నిబంధనల ఆధారంగా నడిచే అంతర్జాతీయ వ్యవస్థకు వ్యవస్థాగత సవాలుగా మారింది అని పేర్కొనడం ద్వారా నాటో కూటమి రానున్న రోజుల్లో తన గురిని చైనా మీద కేంద్రీకరించబోతున్నట్లు అర్థమవుతుంది. 'ఆర్థికంగా చైనా గొంతు నులమడం, ప్రపంచ ప్రజల దృష్టిలో దాన్ని భూతంలా చూపిండం, దాంతో సైనిక ఘర్షణకు సిద్ధం కావడం' అమెరికా వ్యూహంలో ప్రధానాంశంగా ఉంది.

**పుతిన్‌తో బైడెన్ భేటీ**

నాటో సమావేశం నుండి బైడెన్ నేరుగా జెనీవా వెళ్లి రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్‌తో ముఖాముఖి సమావేశమయ్యారు. సమావేశానంతరం బైడెన్, పుతిన్‌లు వేరువేరుగా పత్రికల వారితో మాట్లాడుతూ తాము ఉక్రెయిన్ సమస్య నుండి అణ్వస్త్ర నిల్వల వరకు అనేక విషయాలపై చర్చించామని చెబుతూ ముందుముందు "వ్యూహాత్మక స్థిరత్వం" సాధించేందుకు రెండు దేశాలూ మరికొన్ని సార్లు సమావేశమవుతాయిని చెప్పారు. మొత్తం మీద చర్చలు సానుకూలంగా,

> **❝ ఈ సారి నాటో శిఖరాగ్ర సమావేశం చైనానే లక్ష్యంగా చేసుకుని సాగింది. చైనా తమకు "వ్యవస్థాగత సవాలు"గా మారిందని శిఖరాగ్ర సభ తుది ప్రకటన పేర్కొంది. చైనాను ఎదుర్కొనడానిక ప్రపంచాన్ని కూడదీయాలి అన్న బైడెన్ వ్యూహంలో భాగంగానే నాటో సమావేంలో చర్చలు సాగాయి. తుది ప్రకటన లో డజను సార్లు చైనా పేరు పేర్కొనడం జరిగింది. ❞**



రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అమెరికా అధ్యక్షుడు బైడన్ భేటీ

ప్రయజనకరంగా జరిగాయని చెప్పారు. ఈ సమావేశానికి ముందు బైడెన్ పత్రికల వారితో మాట్లాడుతూ "రష్యాతో మేము ఘర్షణ పడదలుచుకోలేదని నేను పుతిన్‌కు తెలియజేస్తాను" అని పేర్కొన్నారు. బైడెన్ ఒకవైపు రష్యాని అనేక అంశాల్లో బెదిరిస్తూనే మరోవైపు చైనాకు గుడ్‌బై చెప్పి తమ కూటమిలో చేరమని అనేక బుజ్జగింపులూ చేశారు. రష్యాతో ఘర్షణ పడుతున్న ఉక్రెయిన్‌ను నాటో కూటమిలో చేర్చుకుంటున్నట్లు ప్రకటించకుండా ఆగడం కూడా రష్యాను బుజ్జగించే చర్యల్లో భాగమే.

**ఐరోపా యూనియన్ సమావేశం**

చైనాకు సంబంధించి నంతవరకు అమెరికాకూ, ఐరోపాకూ మధ్య పెద్ద ఎత్తున విభేదాలున్నాయని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ విషయంలో బ్రిటన్ పూర్తిగా అమెరికా కొమ్ము కాస్తుండగా జర్మనీ, ఫ్రాన్స్‌లు కొంత స్వతంత్రంగా వ్యవహరించడానికి ప్రయత్నిస్తున్నాయి. "ఐరోపా దేశాలకు చైనాతో తమ స్వంత ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలున్నాయి. అమెరికా కోసం వాటిని అవి వదులుకోలేవు" అని రాజకీయ నిపుణులు పేర్కొంటున్నారు. ఐరోపాతో అతి పెద్ద వాణిజ్య భాగస్వామి పాత్ర నుండి గత సంవత్సరమే అమెరికాను తొలగించి చైనా ఆక్రమించింది. చైనా బ్రిటన్‌కు అతి పెద్ద దిగమతి మార్కెట్ అయితే జర్మనీకి అతి పెద్ద ఎగుమతి మార్కెట్. అమెరికా కోసం ఈ మార్కెట్‌ను వదులుకోడానికి అవి సిద్ధంగా లేవు. సుదీర్ఘ చర్చల తరువాత చైనాతో ఇయు అతి పెద్ద వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోడానికి సిద్ధ పడింది. అయితే అమెరికా ఒత్తిడితో ప్రస్తుతం దాన్ని పక్కన బెట్టారు.

గత నెల 24న జరిగిన ఇయు సమావేశం ప్రధానంగా రష్యాతో వ్యవహరించాల్సిన విషయంలో రెండుగా విడిపోయింది. రష్యాతో చర్చలు జరపాలని జర్మనీ, ఫ్రాన్స్‌లు చేసిన ప్రతిపాదనను ప్రధానంగా తూర్పు యూరప్ దేశాలు వ్యతిరేకించాయి. రష్యా నుండి జర్మనీకి నిర్మించబడుతున్న భారీ గ్యాస్ పైపు లైన్ ప్రాజెక్టును అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. చౌకగా లభించే రష్యన్ గ్యాస్ తమ ఆర్థికాభివృద్ధికి అవసరమని జర్మనీ వాదిస్తోంది. మొత్తం మీద చైనా, రష్యాల విషయంలో ఐరోపాను ఏకతాటిపై నిలపడం అమెరికాకు అంత తేలికైన విషయం కాదు. కరోనాతో సంక్షుభితమైన ప్రపంచంలో ఆర్థికాభివృద్ధికి ఐరోపా దేశాలతోపాటు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని అనేక దేశాలకు చైనాతో ఆర్థిక వాణిజ్య సంబంధాలు కీలకం. అదే సమయంలో చైనాను "వ్యవస్థాగత ప్రత్యర్థిగా" భావిస్తున్న అమెరికా ఒత్తిళ్లు ఆయా దేశాల మీద తీవ్రంగా ఉన్నాయి. రానున్న కాలంలో ఈ వైరుధ్యాలు ఎలా పనిచేస్తాయో వేచి చూడాలి. ❋

**వ్యవసాయ రంగం**

# సరళీకరణ విధానాలతో తీవ్రమౌతున్న వ్యవసాయ సంక్షోభం



రచయిత మార్క్సిస్టు మాసపత్రిక బాధ్యులు

**ఎ. కోటిరెడ్డి**

వ్యవసాయరంగం ఈనాటికీ దేశంలోని మెజారిటీ ప్రజానీకానికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉపాధి కల్పిస్తున్నది. ఎక్కువమందికి ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయరంగం వెనుకబడి ఉండటం వలన ప్రజలు దారిద్ర్యంలో ఉన్నారని, అందువలన దారిద్ర్యాన్ని తగ్గించాలంటే వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేయాలనే పేరుతో వ్యవసాయంపై ఆధిపత్యాన్ని కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలకు కట్టబెట్టే విధానాన్ని అనుసరిస్తున్నారు. అందులో భాగంగానే సంస్కరణల పేరుతో నరేంద్రమోడి ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను తీసుకు వచ్చింది. అయితే ఇటువంటి సంస్కరణలను తీసుకురావటంలో ఈ ప్రభుత్వమే మొదటిది కాదు. గత ప్రభుత్వాలు కూడా రైతాంగం పేరు చెబుతూనే రైతాంగానికి వ్యతిరేకమైన చట్టాలను తీసుకొచ్చాయి. వాటికి మోడి ప్రభుత్వానికి తేడా ఏమిటంటే గత ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాలు పెట్టుబడిదారులకే ప్రయోజనం కలిగించినప్పటికీ, కొన్ని అంశాలలోనైనా రైతాంగ ప్రయోజనాలను కాపాడేవి. మోడి ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు వ్యవసాయ రంగాన్ని, రైతుల జీవితాలను బడా పెట్టుబడిదారులు, బహుళజాతి సంస్థల చేతుల్లో పెడతాయి.

స్వాతంత్ర్యానంతరం, ముఖ్యంగా 1960వ దశకంలో హరిత విప్లవం పేరుతో ఆనాటి ప్రభుత్వం వ్యవసాయరంగంలో సంస్కరణలు ప్రారంభించింది. రైతాంగంలోని పైతరగతుల వారికి, నీటిపారుదల సదుపాయం ఉన్న ప్రాంతాల రైతులకు ఆ సంస్కరణలు కొంతమేరకు ఉపయోగపడ్డాయి. వ్యవసాయోత్పత్తులు, ముఖ్యంగా ఆహారధాన్యాల ఉత్పాదకత పెరిగింది. దానితో ఆహారోత్పత్తిలో దేశం స్వయం సమృద్ధి సాధించిందని ప్రభుత్వం ప్రచారం చేసింది. గమనించాల్సిన విషయమేమిటంటే మనదేశ ప్రజల కొనుగోలు శక్తి తక్కువగా ఉండటం వలన మాత్రమే ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించినట్లు కనిపిస్తున్నది. కాని ప్రజలకు అవసరమైన రోజుకు తలసరి కాలరీల ప్రాతిపదికగా చూస్తే మనం అప్పటికి లోటులోనే ఉన్నాం. 1980 దశకంలో తిరిగి వ్యవసాయోత్పత్తి పెరుగుదల మందగించింది. దాని నుండి బయటపడటం కోసం ప్రయత్నాలు చేశారు. ఆ ప్రయత్నాలు సఫలం కాలేదు.

1990వ దశాబ్దంలో ప్రారంభించిన నయా ఉదారవాద విధానాలు వ్యవసాయ రంగంలో తీవ్రమైన మార్పులకు దారితీశాయి. వ్యవసాయరంగంలో సరళీకరణ విధానాలను ప్రవేశపెట్టటం, ప్రభుత్వ పెట్టుబడులను ఉపసంహరిస్తూ ప్రైవేటురంగానికి పెద్దపీట వేయటం, వ్యవసాయోత్పత్తుల దిగుమతులపై ఉన్న ఆంక్షలను తొలగించటం చేశారు. 1997లో 470 ఉత్పత్తులపైనా, 1999లో మరో 1,400 ఉత్పత్తులపైనా పరిమాణాత్మక ఆంక్షలను ఎత్తివేసి, ఓపెన్ లైసెన్సింగ్ విధానం కిందకు తీసుకువచ్చారు. 1990లో వ్యవసాయోత్పత్తుల దిగుమతులపై ఉన్న 100 శాతం టారిఫ్‌లను 1997 నాటికి 30 శాతానికి తగ్గించారు. ఆ తర్వాతి కాలంలో కొన్ని ఉత్పత్తులపై మరింతగా తగ్గించారు. దేశంలోకి కనీస మొత్తం ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోటం అన్న విధానానికి గతంలో భారత్ వ్యతిరేకంగా ఉన్నప్పటికీ 2 శాతం ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవటం ప్రారంభమైంది. విత్తనాల దిగుమతులను సరళీకరణ చేసి, దిగుమతులను పెంచారు. 1991 నుండి విత్తనోత్పత్తి పరిశ్రమలోకి 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించారు. అదే సంవత్సరం నుండి రసాయనిక ఎరువుల సబ్సిడీలను తగ్గించటం మొదలైంది. 1997 నుండి విద్యుత్‌రంగంలో సంస్కరణలతో విద్యుత్ రేట్లు పెంచే విధానాలను అమలుచేయటం ప్రారంభించారు. నీటి వినియోగదారుల సంఘాలను ఏర్పాటు చేయటం ద్వారా వినియోగంలో రైతుల భాగస్వామ్యాన్ని పెంచుతామని ప్రకటించారు. కొన్ని రాష్ట్రాలలో నీటితీరువాను పెంచారు. ప్రాజెక్టుల కింద నీటిని వినియోగించుకొనే భాగస్వాముల పెట్టుబడి లేకుండా భారీ ప్రాజెక్టులను కట్టరాదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం చేసింది.

వాణిజ్యబ్యాంకుల పాత్రను కుదించటం కోసం ఖుస్రో కమిటి, నరసింహం కమిటీలను నియమించారు. వ్యవసాయ మార్కెటింగ్‌కు సంబంధించి, నిత్యావసర సరుకుల చట్టానికి సవరణలు చేయాలని, వ్యవసాయోత్పత్తుల రాష్ట్రాంతర వాణిజ్యానికి అవకాశం కల్పించాలని, వ్యవసాయ మార్కెట్ యార్డుల నమూనా చట్టాన్ని రూపొందించాలని, కాంట్రాక్టు వ్యవసాయానికి ప్రోత్సాహాన్ని ఇవ్వాలని, వ్యవసాయోత్పత్తులకు ఫార్వర్డ్ మార్కెట్ విధానాలను అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పెట్టుబడులు తగ్గటం వలన ఏర్పడే కొరతను పూరించటం కోసం వ్యవసాయరంగంలోకి వచ్చే ప్రైవేటు పెట్టుబడులపై పన్నులు తగ్గించాలని చెప్పారు.

సరళీకరణ విధానాలు ప్రారంభమైనప్పటి నుండి కేంద్ర ప్రభుత్వం, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధానాలను అమలు జరుపుతున్నాయి. వీటిని పూర్తిగా అమలు జరపాలని పాలకవర్గాల నుండి వత్తిడి వస్తున్నప్పటికీ, రైతాంగ ఉద్యమాలు, కమ్యూనిస్టు, వామపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించటంతో వీటిలోని అనేక అంశాలను ఈనాటికీ ప్రభుత్వాలు అమలు చేయలేకపోతున్నాయి.

ప్రస్తుత బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలు అమలు జరిగితే కార్పొరేట్లు, ఎంఎన్‌సిలే వ్యవసాయరంగంపై ఆధిపత్యం వహిస్తాయి. గతంలో ఈ విధానాలను అరకొరగా అమలు జరిపినపుడే దేశంలో నాలుగు లక్షల మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్యలు అంతకు ముందుకన్నా 50 శాతం పెరిగాయి. ఈ విధానాలను సంపూర్ణంగా అమలు జరిపితే రైతులు, కౌలురైతుల ఆత్మహత్యలు అనేకరెట్లు పెరుగుతాయి. రైతులతో పాటు వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలు కూడా పెరుగుతాయి. వ్యవసాయరంగంపై ఆధారపడి జీవిస్తున్నవారి జీవితాలు దుర్భరంగా మారతాయి. మరోవైపున కార్పొరేట్లు, ఎంఎన్‌సిలు అపారమైన లాభాలు పొందుతారు. వారి లాభాల కోసమే ప్రభుత్వం వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చింది. దేశంలోని రైతాంగం అంతా వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం ఆ చట్టాలను అమలు జరపాలనే మొండి పట్టుదలతో ఉంది. నయా ఉదారవాద విధానాలు ప్రారంభమైన తర్వాత ఇప్పటి వరకు అమలు జరిపిన విధానాల ఫలితాలను పరిశీలిస్తే రానున్న కాలంలో ఎటువంటి పర్యవసానాలు ఎదురౌతాయో స్పష్టమౌతుంది.

**ప్రభుత్వ పెట్టుబడులను తగ్గించటంతో ప్రతికూల ఫలితాలు**

సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత వ్యవసాయరంగంలో ప్రభుత్వం పెట్టుబడులను తగ్గిస్తున్నది. ప్రైవేటు పెట్టుబడులు వచ్చి వ్యవసాయరంగంలో మౌలిక సదుపాయాలను నిర్మిస్తాయని, తద్వారా వ్యవసాయాభివృద్ధిలో వారు ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తారని చెబుతున్నది. 1980తో పోల్చుకుంటే 1999-2000 నాటికి వ్యవసాయరంగంలో ప్రభుత్వ పెట్టుబడులు మూడింట ఒకవంతుకు పడిపోయాయి. 1981-82లో వ్యవసాయ రంగంలోకి వచ్చిన పెట్టుబడులలో ప్రభుత్వరంగ వాటా 43.2 శాతం ఉండగా, 1991-92 నాటికి 22.6 శాతానికి, 2002-03 నాటికి మరింతగా తగ్గి 15.5 శాతానికి దిగజారింది. తర్వాతి కాలంలో కొద్ది మేరకు మాత్రమే పెరిగాయి. మరోవైపున ప్రైవేటు పెట్టుబడులు ఆశించినంతగా పెరగకపోగా తగ్గిపోయాయి. ఫలితంగా వ్యవసాయ రంగంలో మొతంగా పెట్టుబడుల రాక అంతకు ముందుకన్నా తగ్గిపోయింది. దీనితో వ్యవసాయరంగంలో ప్రణాళికాబద్ధంగా పెడుతున్న పెట్టుబడులు 6.1 శాతం నుండి 4.5 శాతానికి తగ్గిపోయాయి. దానితో పాటుగా గ్రామీణాభివృద్ధికి పెడుతున్న ఖర్చు కూడా 1991-92లో 11.7 శాతం నుండి 2000-01లో 5.9 శాతానికి పడిపోయింది. ఈ విధంగా ప్రైవేటు పెట్టుబడులు రాకపోవటం, ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోవటంతో వ్యవసాయం, అనుబంధ రంగాలు, గ్రామీణాభివృద్ధికి తీవ్ర విఘాతం కలిగింది.

> **“ సరళీకరణ విధానాలు ప్రారంభమైన తర్వాత వ్యవసాయ రంగంలో ప్రభుత్వం పెట్టుబడులను తగ్గిస్తున్నది. ప్రైవేటు పెట్టుబడులు వచ్చి వ్యవసాయరంగంలో మౌలిక సదుపాయాలను నిర్మిస్తాయని, తద్వారా వ్యవసాయాభివృద్ధిలో వారు ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తారని చెబుతున్నది. 1980తో పోల్చుకుంటే 1999-2000 నాటికి వ్యవసాయరంగంలో ప్రభుత్వ పెట్టుబడులు మూడింట ఒకవంతుకు పడిపోయాయి. ”**

1970-71 నుండి 74-75 సంవత్సరాల మధ్య వ్యవసాయరంగంలో ప్రభుత్వ, ప్రైవేటురంగ పెట్టుబడులు పెరగలేదు. 1974-75 తర్వాత ఈ రెండు రంగాల నుండి పెట్టుబడులు పెరగటం ప్రారంభమైంది. 77-78 నుండి 83-84 వరకు ప్రభుత్వ పెట్టుబడులే ఎక్కువగా ఉన్నాయి. తర్వాత క్రమంగా ప్రభుత్వ పెట్టుబడుల తగ్గుదల ప్రారంభమైంది. నయా ఉదారవాద విధానాలు ప్రారంభమైన 1990-91లో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులు 4,871కోట్లు, 10,934 కోట్ల రూపాయలుగా ఉన్నాయి. 2002-03 నాటికి ప్రభుత్వ పెట్టుబడులు 4,788 కోట్లకు తగ్గగా, ప్రైవేటు పెట్టుబడులు 40 శాతంకు పైగా పెరిగాయి. 2016-17 నాటికి ప్రభుత్వ పెట్టుబడులు 64,410 కోట్లు కాగా, ప్రైవేటు పెట్టుబడులు 2,79,066 కోట్ల రూపాయలకు పెరిగాయి. ప్రభుత్వ పెట్టుబడుల కన్నా ప్రైవేటు పెట్టుబడులు నాలుగు రెట్లకు మించి పెరిగాయి. ప్రైవేటు పెట్టుబడులు అంటే రైతులు స్వంతంగా బోరుబావులు, కాలువలు, ఇతర సదుపాయాలను మెరుగు చేసుకోవటం కోసం పెట్టిన పెట్టుబడులు మినహా కార్పొరేట్లు, ఎంఎన్‌సిలు పెట్టిన పెట్టుబడులు లేవు. 2019లో పార్లమెంటులో చేసిన ప్రకటనలో ప్రధాని స్వయంగా ఈ విషయం వెల్లడించారు.

**అంతర్జాతీయ మార్కెట్‌లో లాభాలు వస్తాయని ప్రచారం**

వ్యవసాయోత్పత్తుల వాణిజ్యాన్ని సరళీకరించటం వలన వ్యవసాయోత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి చేసుకోవచ్చునని, తద్వారా రైతాంగం అధికలాభాలు పొందవచ్చుననే వాదనను తరచుగా ముందుకు తెస్తున్నారు. కాని భారతదేశానికి లబ్ది కలిగించే బియ్యం, పత్తిలాంటి పంటల ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో తీవ్రమైన ఒడిదుడుకులకు గురవుతున్నాయి. మనదేశంలో పండుతున్న పంటలకు ప్రభుత్వం నిర్ణయిస్తున్న ధరలకు, రైతులు మార్కెట్‌లో అమ్ముకొంటున్న ధరలకు సంబంధం ఉండటం లేదు. ప్రభుత్వం గత సంవత్సరం సాధారణ రకం వరి ధాన్యం మద్దతు ధరను క్వింటాలుకు 1868, గ్రేడ్ ఎ రకం ధాన్యానికి 1,888 రూపాయలుగా నిర్ణయించింది. కాని ఈ ధరలకు ప్రభుత్వం కొద్ది మొత్తాన్ని మాత్రమే కొనుగోలు చేసింది. ధాన్యం పండించిన రైతులలో అత్యధిక భాగం ఖరీఫ్‌లోనూ, రబీలోనూ 75 కిలోల బస్తాను 1,000 నుండి 1,150 రూపాయల మధ్యనే అమ్ముకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం 1,418 రూపాయలు రావాలి. కాని ప్రభుత్వ మద్దతు ధర కన్నా 268 నుండి 418 రూపాయల వరకు తక్కువ ధరలకు రైతులు అమ్ముకున్నారు. ఎకరా వరి పండించిన రైతు 6,000 నుండి 12,000 రూపాయల వరకు నష్టపోయాడు. ఇక పత్తి విషయంలోనూ రైతులు ఇదే విధమైన నష్టాన్ని ఎదుర్కొన్నారు. గత సంవత్సరం పత్తి పొట్టిపింజ రకానికి 5,515, పొడుగు పింజ రకానికి 5,825 రూపాయలుగా ప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయించింది. కాని సిసిఐ ఈ ధరలకు 10 శాతం పంటను కూడా కొనలేదు. మిగతా పంటను రైతులు క్వింటాలు 3,000 నుండి 4,500 రూపాయల ధరలకే అమ్ముకున్నారు. సగటున క్వింటాలుకు 1,500 రూపాయలకు పైగా రైతులు నష్టపోయారు. రైతాంగం మద్దతు ధరలు పొందటంలో ప్రభుత్వ ప్రమేయం ఎంత కీలకం అన్న అంశాన్ని పై

> **❝ మరోవైపున సాంప్రదాయకంగా రైతాంగం వినియోగించుకొంటున్న ఉపరితల జల వనరుల వినియోగాన్ని నిర్లక్ష్యం చేశారు. దేశంలో అసంఖ్యాకంగా ఉన్న చెరువులు, వాగులు, ఇతర చిన్నతరహా జల వనరులను పరిరక్షించటం, వినియోగించుకోవటానికి పూనుకోలేదు. ఫలితంగా లక్షలాది ఎకరాల భూములు సాగునీటి సదుపాయానికి దూరమైనాయి. ❞**

విషయాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ మద్దతు లేక దేశీయ మార్కెట్‌లోనే రైతాంగం ఈ విధంగా నష్టపోతున్న పరిస్థితులలో అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్ముకొని లాభాలు పొందమని రైతాంగానికి చెప్పటం హాస్యాస్పదం కాదా!

1998-99 వరకు దూది (గింజలు తీసిన పత్తి) ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఎక్కువ ఉండటంతో ఎగుమతులు చేశారు. కాని పరిమాణాత్మక ఆంక్షలు తొలగించటం, అంతర్జాతీయ మార్కెట్‌లో దూది ధరలు పడిపోవటంతో మనదేశం ఎగుమతులు చేయటం నుండి దిగుమతులు చేసుకోవటం ప్రారంభించింది. ఫలితంగా దేశంలో పత్తికి ధరలు పడిపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. 1994లో కన్నా 2002లో అంతర్జాతీయ మార్కెట్‌లో అనేక వ్యవసాయోత్పత్తుల ధరలు తీవ్రంగా పతనమయాయి. ఈనాటికి కూడా ఆ ఒడిదుడుకులు ఆ విధంగానే కొనసాగుతున్నాయి. ఒకవేళ అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగినప్పటికీ ఆ ఫలితం రైతులకు చేరటం లేదని, మధ్య దళారులు కాజేస్తున్నారని అనేక అధ్యయనాలలో వెల్లడైంది. ధరలు తగ్గినపుడు మాత్రం ఆ భారాన్ని రైతాంగం పైకి నెడుతున్నారు. అందువలన వ్యవసాయోత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లో పెరిగిన ధరల వలన రైతులకు ఎటువంటి ప్రయోజనం చేకూరటం లేదు.

**నీటిపారుదల సదుపాయం కల్పించటంలో ప్రభుత్వపాత్ర**

వ్యవసాయ భూములకు నీటి పారుదల సదుపాయాన్ని కల్పించటంలో ప్రభుత్వం ప్రధానపాత్ర వహించింది. స్వాతంత్ర్యం వచ్చేనాటికి 10 శాతంకు పైగా సాగుభూమికి మాత్రమే నీటి పారుదల సదుపాయం ఉన్నది. తర్వాత ప్రభుత్వం కొన్ని భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకున్నది. ఫలితంగా 1970 దశాబ్దం నాటికి రెట్టింపు భూమికి నీటి పారుదల సదుపాయం కల్పించారు. కాని 1970 దశాబ్దం తర్వాత ప్రాజెక్టుల నిర్మాణం మందగించింది. ప్రభుత్వం అవసరమైన మేరకు నిధులు కేటాయించకపోవటం, అంతర్రాష్ట్ర జల వివాదాలు, పర్యావరణ అంశాలు తదితరాలతో భారీ ప్రాజెక్టుల నిర్మాణం అనుకున్నంత వేగంగా సాగలేదు. మరోవైపున ప్రభుత్వ పెట్టుబడులు తగ్గితే ప్రైవేటు పెట్టుబడులు వచ్చి వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేస్తాయన్నది ఆచరణలో అమలు జరగలేదు. త్వరగా లాభాలు సంపాదించుకు పోవటానికి వీలైన విత్తనాలు, ఎరువుల అమ్మకం తదితర రంగాలలోకి ప్రైవేటు పెట్టుబడులు వచ్చాయి తప్ప లాభాల కోసం దీర్ఘకాలం ఎదురుచూడాల్సిన భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, పరిశోధన, అభివృద్ధి తదితర రంగాలలోకి రాలేదు.

మరోవైపున సాంప్రదాయకంగా రైతాంగం వినియోగించుకొంటున్న ఉపరితల జల వనరుల వినియోగాన్ని నిర్లక్ష్యం చేశారు. దేశంలో అసంఖ్యాకంగా ఉన్న చెరువులు, వాగులు, ఇతర చిన్నతరహా జల వనరులను పరిరక్షించటం, వినియోగించుకోవటానికి పూనుకోలేదు. ఫలితంగా లక్షలాది ఎకరాల భూములు సాగునీటి సదుపాయానికి దూరమైనాయి.

ఈ వనరులు పోయినచోట్ల, ప్రాజెక్టులు, కాలువల ద్వారా భూములకు నీరు అందనిచోట్ల రైతాంగం అనివార్యంగా బోర్ల తవ్వకంపై ఆధారపడాల్సి వచ్చింది. బోరుబావుల తవ్వకం వ్యవసాయ ఖర్చులను మరింతగా పెంచింది. ఒక్కో బోరుబావి లోతు 100 నుండి 800 అడుగుల వరకు తవ్వాల్సి వచ్చింది. ఒక బోరుబావి కోసం రైతులు 30,000 నుండి 1,00,000 రూపాయలకు పైగా ఖర్చు చేస్తున్నారు. బోరుబావిని తవ్వటంతో పాటు మోటారు బిగించి, విద్యుత్ వినియోగం, దానికి బిల్లుచెల్లించటం రైతులపై తీవ్రమైన భారం మోపింది. బోరుబావుల తవ్వకం, విద్యుత్ వినియోగం పెరుగుతున్న పరిస్థితులలో విద్యుత్ బిల్లుల చెల్లింపు భారమై అనేక రాష్ట్రాలలో విద్యుత్ బిల్లులు రద్దుచేయాలని రైతాంగం ఉద్యమాలు సాగించింది. ఆ ఉద్యమాల ఫలితంగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మరికొన్ని రాష్ట్రాలలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. ఈ విధంగా వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయటం రైతాంగానికి ఉపశమనం కలిగించింది. కాని ప్రస్తుతం మోడి ప్రభుత్వం రూపొందించిన విద్యుత్ సవరణ బిల్లు 2020 అమలులోకి వస్తే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ రద్దవుతుంది. విద్యుత్ ఛార్జీలు పెరుగుతాయి. వాడిన ప్రతి యూనిట్ విద్యుత్‌కు బిల్లు చెల్లించటం రైతాంగానికి పెనుభారంగా మారుతుంది. రైతుల ఆత్మహత్యలు మరింత పెరగటానికి ఇది దారితీస్తుంది.

**గ్రామీణ దారిద్ర్యాన్ని తగ్గించిన బ్యాంకు రుణాలు**


నయా ఉదారవాద విధానాలు ప్రారంభం కావటానికి ముందు గ్రామీణప్రాంతంలో బ్యాంకు బ్రాంచీలు ఏర్పాటు కావటం, పేదలకు రుణాలు లభించటంతో దారిద్ర్యం గణనీయంగా తగ్గింది. గ్రామీణ ప్రాంతాల లోని దిగువకులాలు, ఎస్‌సి, ఎస్టిలు గణనీయంగా రుణాలు పొందటానికి అవకాశం కలగటంతో పాటు వ్యవసాయేతర రంగాలలో అభివృద్ధి పెరగటానికి అవకాశం కలిగింది. 1977-90 మధ్యకాలంలో గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకులు ఎక్కువ బ్రాంచీలను ఏర్పాటు చేశాయి. నయా ఉదారవాద విధానాల అమలులో భాగంగా 1992లో నియమించిన ఖుస్రో కమిటి, నరసింహం కమిటీలు చేసిన సిఫార్సులు వాణిజ్యబ్యాంకులు రైతులకు రుణాలు ఇచ్చే విధానంలో మార్పులు తీసుకొచ్చాయి. ఈ సిఫార్సులు ప్రాధాన్యతా రంగమైన వ్యవసాయానికి రుణాలు ఇవ్వటాన్ని తగ్గించటంతో బ్యాంకు రుణాల ద్వారా లబ్దిపొందుతున్న రైతుల ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగింది. లక్ష్యాలకు అనుగుణంగా రుణాలు ఇవ్వటంలో ఉదాసీనతకు అవకాశం కల్పించాయి. ఈ సిఫార్సుల అమలులో భాగంగా గ్రామీణ ప్రాంతాలలోని అనేక బ్యాంకు బ్రాంచీలను మూసివేశారు. గ్రామీణ ప్రాంతాలలోని బలహీనవర్గాల వారికి రీజినల్ రూరల్ బ్యాంకులు రుణాలను ఇవ్వటం అన్న విధానాన్ని 1997 నుండి

(మిగతా 35వ పేజీలో)

పౌర హక్కులు

# బీమా కోరేగావ్ కేసులో తప్పుడు సాక్షాల సృష్టి

**ఎజి నూరాని**



రచయిత ప్రముఖ న్యాయవాది, రాజకీయ విశ్లేషకుడు

విమర్శకుల, ప్రతిపక్షాల నోళ్లు మూయించడానికి ఈనాటి ప్రభుత్వం చట్టపరమైన విచారణ ప్రక్రియనే శిక్షగా, ఒక ఆయుధంగా వాడుకుంటున్నది. పోలీసుల ఉన్నతాధికారులతోనే అత్యుత్తముడు, నీతిమంతుడు; సమర్ధుడు; బీమా కొరేగావ్ కేసులో సాక్ష్యాలను తారుమారు చేశారని, తప్పుడు సాక్ష్యాలను సృష్టించారని భారతదేశ పాఠకుల దృష్టికి తెచ్చి మహోన్నత సేవచేసిన వ్యక్తి జూలియో రెబీరో. ఆర్సెనల్ కన్సల్టింగ్ అనేది ఒక ప్రైవేటు డిజిటల్ ఫోరెన్సిక్ కంపెనీ; ఆ సంస్థ అధిపతి మార్క్ స్పెన్సర్ భారతదేశంలోని ఒక టివి ఛానల్ ఇంటర్వ్యూలో 'ఒక తెలివైన హ్యాకర్ భారతదేశ పోలీసులను సమర్ధవంతంగా తప్పుదోవ పట్టించాడు 'అని అనడం విన్నాడు. ఫిబ్రవరి 22 న ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో "నిజం కళ్ళెదురుగా ఉంది" అనే శీర్షికతో ఒక వ్యాసం రాశాడు. "బీమా కోరేగావ్ కేసులో ఆరోపణల విషయంలో సాక్ష్యాలు తారుమారు చేయబడ్డాయా, సృష్టించబడ్డాయా అని పరిశోధన చేయాల్సి ఉంది. పోలీసుల నిజాయితీయే ప్రశ్నార్ధకంగా ఉంది" అని రాశారు. ది వాషింగ్టన్ పోస్ట్ అర్సెనల్ పరిశోధన వివరాలను ప్రచురించింది.

"నిందితులుగా చెప్పబడుతున్న కార్యకర్తలకు వ్యతిరేకంగా జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను కంప్యూటర్ల నుండి సేకరించి, దోషులపై మోపిన ఆరోపణలకు వాటిని సాక్ష్యాలుగా చూపారు. నిషేధిత మావోయిస్టు గ్రూపులతో నిందితులకు సంబంధాలున్నట్టు అవి తెలియ చేస్తున్నాయని ఆరోపణలు చేశారు. కంప్యూటర్లో పది ఉత్తరాలు దొరికాయి; ఢిల్లీలో ఉన్న రోనా విల్సన్, హైదరాబాద్‌లో ఉన్న కవి-కార్యకర్త వరవరరావు, ఇప్పుడు ఖైదు చేయబడిన ఇతరులకు మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలుగా ఆ ఉత్తరాలు చూపబడుతున్నాయి.

"ఈ ఉత్తరాలు తన కంప్యూటర్ లో కనిపించడం విల్సన్‌నే సంభ్రమాశ్చర్యాలకు గురిచేసిందన్నది స్పష్టం. తన దేశంలో ప్రభుత్వం నిజాయితీగా నిజనిర్ధారణ చేయనివ్వదన్న అనుమానంతో విల్సన్ న్యాయవాది అమెరికాలో ఉన్న మానవ హక్కుల ఆఫీస్ ద్వారా, అత్యున్నత ప్రమాణాలు కలిగిన కంపెనీగా గౌరవం పొందిన ప్రైవేటు కంపెనీ అయిన ఆర్సెనల్ సేవలను వినియోగించుకున్నారు. ఆ కంపెనీ దర్యాప్తు చేసిన అంశాలను మరో మూడు ఇతర డిజిటల్ ఫోరెన్సిక్ సంస్థల నిపుణులకు ఇచ్చి వాస్తవాలను నిర్ధారించుకున్న తరువాత వాషింగ్టన్ పోస్ట్ ప్రచురించింది.

"నేను టివిలో స్పెన్సర్ మాట్లాడడం విన్నాను. ఇంత ధైర్యంగా, జిత్తులమారితనంగా వాస్తవాలను తారుమారుచేయడాన్ని నేనెప్పుడూ చూడలేదు. విల్సన్ కంప్యూటర్‌లోకి ఒక మాల్వేర్ ద్వారా రెండేళ్ల కాల వ్యవధిలో(అంటే మొదటిసారిగా అతని కంప్యూటర్‌లో ఉత్తరం జొరబడిన నాటి నుండి చివరి ఉత్తరంవరకు) సాక్ష్యాలుగా చెప్పబడుతున్న ఆ పది ఉత్తరాలు జొప్పించ బడ్డాయి".

"ప్రధాన మంత్రిని హత్య చేయటం అన్న ఆరోపణ నాలో అనుమానాలను రేపింది. దేశంలోని వివిధ ప్రాంతాలలో నివసించే 15 మంది ఇంతటి పైశాచిక పథకంలో భాగస్వాములయారని చెప్పటం నేను నమ్మలేకపోయాను. ఇటువంటి పథకం సఫలీకృతం కావాలంటే రహస్యంగా చేయాలి. అటువంటప్పుడు ఇంతమంది, ఇటువంటి అపాయకరమైన పథకంలో కలిసి పని చేయడం వారి భద్రతా దృష్ట్యా కూడా సమంజసంగా లేదు. పైగా ఆరునెలల కిందటే స్టాన్‌స్వామి అనే మతబోధకుడిని జాతీయ పరిశోధనా సంస్థ అదుపులోకి తీసుకోవడం నా అనుమానాలను బలపరించింది. చర్చికి మావోయిజానికి సైద్ధాంతికంగా పొసగదు. స్టాన్‌స్వామి చర్చిని ఎదిరించే సాహసం చేసే మనిషి కాదు. అంటే కోర్టులు జోక్యం చేసుకుని న్యాయాన్ని అందించవలసిన కేసు ఇది అని నిర్ధారించుకున్నాను" అని ఆయన పేర్కొన్నాడు.

## భివాండీ అల్లర్లు

అయితే ఈ దుష్ట పథక రచన చేసినదెవరనేదే అసలైన ప్రశ్న. ఈ పనికి ఎవరు వినియోగించారు, ఆర్ధిక సహాయాన్ని అందించినదెవరనేది అంతకన్నా ముఖ్యమైనది. అయితే ఇదేమీ కొత్త విషయం కాదు. 1970 మే లో ఏర్పడిన డి పి మదన్ విచారణ కమిషన్ పట్టణంలోని ముస్లింలను తప్పుడు సాక్ష్యాలతో కేసులలో ఇరికించే ప్రయత్నం జరిగినట్టు తేల్చింది. కమిషన్ విచారణ చివరి దశలో ఉండగా 'రహస్యం' పేరిట విచారణలో వెల్లడైన అంశాలను బయటపెట్టడాన్ని నిలిపివేశారు. కేసు ఉపసంహరించుకోబడింది.

భారతదేశానికి స్వతంత్రం వచ్చిన ఈ 73 ఏళ్లలో కుప్పలు తెప్పలుగా ఎఫ్ ఐ ఆర్ లు నమోదవడం, ఇంత పెద్ద ఎత్తున విచారణలు జరగడం ఎప్పుడయినా చూశారా? 2021 ఫిబ్రవరి 23 న 22 ఏళ్ల దిశా రవికేసులో అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి ధర్మేంద్ర రాణా బైలు మంజూరు చేస్తూ తీవ్రమైన పద ప్రయోగం చేశారు.

స్వీడిష్ హక్కుల కార్యకర్త గ్రెటా థన్‌బర్గ్ టూల్ కిట్ అంశం గురించి చాలా ప్రచారం జరిగింది. దిశా రవి ఫిబ్రవరి 13 నుండి 23 వరకు అంటే 11 రోజులు జైలులో గడపవలసి వచ్చింది. కోర్టులో ప్రవేశ పెట్టిన తరువాత ఎఫ్ఐఆర్ లో ఏ మాత్రం బలం లేదని, సాక్ష్యాలు అరకొరగా నమోదు అయ్యాయని జడ్జి అన్నారు. దిగువ కోర్టులు చూయిస్తున్న తెగువపై ఎన్‌డిటివి వ్యాఖ్యాత సోనియా సింగ్ వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టు పౌరహక్కులను కాపాడాలన్న ఆకాంక్షను ఆమె వ్యక్తం చేశారు. వీటన్నిటి బట్టి ఏమర్ధమవుతున్నది? భారతదేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఇటువంటి కేసులను కోర్టులలో ప్రవేశపెట్టటానికి అవకాశం ఇస్తూ, వాటిని బలపరుస్తూ వాదిస్తున్నారు. అటార్నీ జనరల్ నుండి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వరకు సంపూర్ణ రక్షణ ఉంది. వాళ్లపై సివిల్ కోర్టులలో పరిహారాల కొరకు వాజ్యాలు వేయలేము. క్రిమినల్ కోర్టులలో విచారణలు జరప లేము- అలా జరపాలంటే వారి యజమాని నుండి, అంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల

**“భారతదేశంలో అయదుగురు జడ్జీలు కలిసి ఉమ్మడిగా ఒక కమ్యూనిస్టు పై దేశద్రోహం ఆరోపణలను నిర్ధారించారు. రాజ్యాంగంలో నుండి ‘దేశ ద్రోహం ‘అనే పదాన్ని తీసేస్తే, శిక్షాస్మృతిలో ఉన్న 124 ఏ ఎందుకూ కొరగాకుండా పోతుంది అన్నది ఎవరికయినా తెలిసిన విషయమే. ఒక్కసారి కూడా రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చలను పరికించకుండా, 1958 నుండి కేదార్‌నాథ్ సింగ్ కేసంటూ పాటపాడే జడ్జీల, న్యాయవాదుల మనస్తత్వం గురించి ఏమని చెప్పాలి? ”**

అనుమతి ఉండాల్సిన అవసరం ఉంటుంది. అదే కెనడాలో అయితే అటార్నీ జనరల్ వ్యక్తిగతంగా తప్పుడు కేసులు నమోదు చేస్తే పర్యవసానాలు ఎదుర్కోవలసి ఉంటుంది.

భారతదేశంలో అయదుగురు జడ్జీలు కలిసి ఉమ్మడిగా ఒక కమ్యూనిస్టు పై దేశద్రోహం ఆరోపణలను నిర్ధారించారు. రాజ్యాంగంలో నుండి ‘దేశ ద్రోహం ‘అనే పదాన్ని తీసేస్తే, శిక్షాస్మృతిలో ఉన్న 124 ఏ ఎందుకూ కొరగాకుండా పోతుంది అన్నది ఎవరికయినా తెలిసిన విషయమే. ఒక్క సారి కూడా రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చలను పరికించకుండా, 1958 నుండి కేదార్‌నాథ్ సింగ్ కేసంటూ పాటపాడే జడ్జీల, న్యాయవాదుల మనస్తత్వం గురించి ఏమని చెప్పాలి?

**అటార్నీ జనరల్ పాత్ర**

పూర్వపు అటార్నీ జనరల్ సర్ పీటర్ సైమన్ గారి మాటల్లో చెప్పాలంటే, ప్రతి పిర్యాదుదారుడు కొన్ని ప్రధానమైన ప్రశ్నలను గుర్తుంచుకోవాలి. 1925 డిసెంబర్‌లో జరిగిన కింది సభలో “ప్రతి కేసులోనూ నేర నిరూపణ కోసం అటార్నీ జనరల్ వాదించాలనుకోవడం మూర్ఖత్వం. అది అసంభవం. ఆ అధికారంలో ఉన్నవారెవరూ ఆలా అనుకోరు” అని చెప్పాడు.

“అటార్నీ జనరల్ బాధ్యత ఇలా ఉంటుందని అనుకుంటున్నాను. ఫిర్యాదుదారుల గురించి ఎం చేయాలన్న ఆదేశాలను అతను ప్రధానమంత్రి, క్యాబినెట్ లేదా ఇతరులెవరి నుంచి గాని తీసుకోకూడదు. బార్ సర్వాధికారిగా అటార్నీ జనరల్ న్యాయ దేవతనను సరించి ఫిర్యాదిదారునికి వ్యతిరేకంగా కేసు ఉందని విశ్వాసిస్తేనే శిక్షించాలి. అతను ఎవరి నిర్దేశాలను స్వీకరించకూడదు. శిక్షార్హమైన నేరమని భావించినప్పుడు అటార్నీ ప్రభుత్వం, ఇతర సహచరుల అభిప్రాయాన్ని, సలహాలు తీసుకోకూడదని దానర్థం కాదు. అలా అని నేనంటే మూర్ఖత్వం అవుతుంది. దేశద్రోహం, రాజద్రోహం, అవినీతి వగైరా ప్రజలపై తీవ్రమైన ప్రభావాలు పడే అవకాశాలు ఉన్న



స్టాన్ స్వామి

కేసులలో దోషులను శిక్షించడంలో తన సహచరులకు తెలియకుండా, ప్రభుత్వ విధానాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కేవలం తనంతటనే నిర్ణయాలు తీసుకోవాలని నేనంటే– నేనొక తెలివితక్కువ వాడినవుతాను.”

ఇదే అభిప్రాయాన్ని అటార్నీ జనరల్ సర్ హార్టీ షా క్రాస్ 1951 జనవరిలో వెలిబుచ్చారు. “ దోషిగా అనుమానించబడుతున్న ప్రతివాడిని విచారణ జరపాలన్న సూత్రం ఈ దేశంలో ఏనాడూ లేదు. ...పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనుసరించాల్సిన మొదటి సూత్రం అతను వాదిగా చేరాలంటే: నేరం లేదా నేరం జరిగిన పరిస్థితులలో జోక్యం చేసుకోవడం వలన ప్రజాప్రయోజనాలు కాపాడబడాలి; వాదిగా చేరేందుకు ఇప్పటికీ అదే ప్రధానమైన అంశం. కొన్ని సమయాలలో విచారణ అవసరం మరింత విస్తృతంగా ఉండి ఉండవచ్చు. విచారించడం విధానపర నిర్ణయాలకు, లేదా జాతీయ అంతర్జాతీయ ప్రయోజనాలకు సంబంధించినది అయి ఉండవచ్చు. కానీ అటార్నీ జనరల్ రాజకీయపరంగా ఆలోచించి నిర్ణయం తీసుకోకూడదు. అతనే పాక్షిక న్యాయనిర్ణేతగా ప్రభుత్వ పాలనపై చట్టం అమలు ప్రభావం ఎలా ఉంటుందో ఆలోచించాలి.“ఒక సందర్భంలో యువరాణి పై వచ్చిన ఆరోపణలు దేశంపై కలిగించే ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని కేసు ఉపసంహరించుకోవలసి వచ్చింది”.

ప్రజాస్వామ్య స్వేచ్ఛ నరనరాన ప్రవహి స్తున్న ఏ ప్రభుత్వం కూడా భారతదేశ ప్రభుత్వం అంత స్వేచ్ఛగా అభియోగాలను నమోదు చేయటాన్ని కొనసాగించలేదు. జేన్ బోర్గ్స్ ఎంతో శ్రమకోర్చి భారతదేశంలో జరిగిన ఇటువంటి కేసుల జాబితాను సండే మిడ్ డే పత్రికలో ప్రచురించాడు.

చదువులేని వారు టూల్‌కిట్స్‌ను అణచివేతకు ఆయుధాలుగా ఉపయోగించుకొంటున్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో కూడా విదేశీ మద్దతుదారుల నుండి అన్ని పార్టీల నాయకులు కుప్పలుతెప్పలుగా సలహాలను పొందారు. జీన్ షార్ప్ ఈ సలహాల ప్రవాహాన్ని గ్రంథస్తం చేశారు.

అమెరికా, ఇంగ్లాండ్ లేదా ఇతర అభివృద్ధి చెందిన దేశాలలో వలెకాక భారతదేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజ్యం అధీనంలో పనిచేయవలసి వస్తుంది. (1973 నేరశిక్షాస్మృతిలోని 24 వ విభాగం)

“హై కోర్టును సంప్రదించిన తరువాత” అనే వాక్యాన్ని మహారాష్ట్ర తొలగించింది. 2005లో సెక్షన్ 25 ఏ లో చేర్చిన అంశాలు, డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్‌ని నియమించే హక్కు రాజ్యానికి కల్పించబడింది. ఇందులో డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ ఉంటారు. ఈ డైరెక్టర్ గృహ మంత్రిత్వశాఖ అధీనంలో పనిచేయవలసి ఉంటుంది. “పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అంతా ఈ డైరెక్టరేట్ ఆధీనంలోనే ఉంటారు. అందువలన పథకం అంతా స్పష్టమే. పబ్లిక్ ప్రాసిక్యూటర్ డైరెక్టర్ కింద, డైరెక్టర్ గృహ మంత్రిత్వ శాఖ కింద పనిచేయాలి.

ఇవి వలస వాద విధానాల కొనసాగింపే. ఇంగ్లీష్ వారి పద్ధతులు వేరుగా ఉంటాయి. అటార్నీ జనరల్‌ని గాని, ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్‌ని గాని అధికారంలో ఉన్న రాజకీయ నాయకులు ఆదేశించలేరు. తన కాలంలో మేధావి అయిన అటార్ని జనరల్ సర్ పాట్రిక్ హేస్టింగ్స్ అప్పటి లేబర్ ప్రభుత్వ కాలంలో, – 1924 లో– కాంప్ బెల్ కేసులో ఫిర్యాదును ఉపసంహరించుకునే అంశంపై వివాదం ఏర్పడి రాజీనామా చేయవలసి వచ్చింది.

భారతదేశంలో పూర్తిగా మరుగున పడిన మరో విస్తృతమైన అంశం ఉంది. ఏ అంశాలపై అటార్నీ జనరల్ పిర్యాదులను తీసుకోవచ్చు? బ్రిటన్‌లో రెండు రకాల పిర్యాదులుంటాయి – ‘పాక్షిక రాజకీయాలు’, ‘రాజకీయాలు’ అని వాటిని గురించి అంటుంటారు. మొదటిరకం భారతదేశంలో లాగా పార్టీల ప్రయోజనాలకు సంబంధించినది; రెండోరకం ‘రాజ్యం ప్రయోజనాల పరిరక్షణ కోసం శిక్షించటానికి’ సంబంధించినది. విమర్శకులను, రాజకీయ ప్రత్యర్థులను బెదిరించడానికే నరేంద్రమోడీ ప్రభుత్వం అభియోగాలను మోపుతున్నది.

**(అనువాదం: కె ఉషారాణి)**

# రాష్ట్రంలో బిజెపి పెరుగుదలను నిరోధించాలి


సందేహాలు సమాధానాలు

బి.వి. రాఘవులు




రాఘవులుగారికి,

మొదటి నుండి మనం అధికారంలో ఉన్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమస్యను బట్టి ప్రతిపక్షాలతో కలిసి పోరాడుతున్నాం. కాని ఈ బూర్జువా పార్టీలు మరలా అధికారంలోకి వచ్చిన తరువాత అవే విధానాలు అనుసరిస్తూ అవినీతి పరులుగా మారుతున్నారు. ఇప్పుడు వీరు బరితెగించి దోపిడీలకు, ఓట్లు కొనటానికి వామపక్ష ఉద్యమా లను అణచటానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా కాల్చులు, హౌస్ అరెస్టులు, చట్టం పేరు చెప్పి ప్రజాసంఘాల పోరాటాలను అణచటం, కేంద్రంలో, రాష్ట్రంలో తన అవసరాలకు బిజెపితో అంటకాగడం, అభివృద్ధి కోసం కలిశానని చెప్పడం పచ్చి అవకాశవాద విధానాలు అవలంభించటం చేస్తున్నాయి. అనవసరముగా బిజెపితో తెగతెంపుల చేసుకొని నాయకత్వం తొందరపడిందని, అట్లాగే అంటకాగితే హాయిగా ఉండేవాళ్ళమని, ఈ జగన్ పార్టీ ఉండేది కాదని టిడిపి నాయకత్వం బావిస్తు న్నది. బిజెపి మతపిచ్చి ఉన్నా, లౌకిక, రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసంచేసినా, బడుగు, బలహీన వర్గాలు బాధలు పడ్డా మన ఆస్తులకు, పదవులకు బిజెపితో ఉంటేనే రక్షణ ఉండేదని టిడిపి పాలక వర్గాలు కింది నుండి పైదాకా భావిస్తున్నాయి. కావున ప్రస్తుతం ప్రజలు ప్రభుత్వం మీద వ్యతిరేకత వస్తే విధానాలను చూడకుండా ఓడించే పార్టీలకే ఓటు వేస్తున్నారు. వర్గరీత్యా మన రాష్ట్రం వైసిపి, టిడిపి రెండూ, రెండు సామాజిక వర్గాలకు మరికొన్ని కొన్ని వర్గాలకు పదవులు ఇచ్చి పెత్తనం చేస్తున్నాయి. అందుకని అన్ని ఎన్నికలలో ఓడిపోయి బలహీనంగా ఉన్న టిడిపిని మరలా ఎదగకుండా, బలహీనపడి పోయేలా చేసేలా వామపక్షాల కార్యక్రమాలుండాలి. వామపక్షాలు ఐక్యత, పోరాటాలతో రాష్ట్రంలో ప్రతిపక్ష రూపంలోకి వచ్చే వరకు బిజెపి, టిడిపిని రెంటిని ఎండగట్టాలి. సిపిఐ, సిపియంలు చిన్న చిన్న పార్టీల తో మళ్ళీ దారికొస్తే జనసేనతో ప్రయత్నించ కూడదా? అని నా అభిప్రాయం, వైసిపిని, టిడిపిని ఒకేసారి ఓడించలేం. ముందుగా ఒకటి పోతే తరువాత ప్రజలే రెండో దాన్ని పంపుతారు. టిడిపికి ఎక్కడా ఏ రూపంలో మనం తోడ్పడకూడదు. మన పార్టీ అభిప్రాయము చెప్పగలరు.

**వట్టికొండ రమేశ్, దళ్మ రమేశ్**
**వీరులపాడు, కృష్ణా జిల్లా**

ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ అనుసరిం చాల్సిన ఎత్తుగడల గురించి మీ అభిప్రాయం స్పష్టంగా వ్యక్తం చేశారు. ప్రస్తుతం తెలుగు దేశాన్ని బలహీనం చెయ్యడంపై ప్రధానంగా పార్టీ దృష్టిపెట్టాలన్నది మీ అభిప్రాయంగా అనుకుం టున్నాను. మనం ఎదుర్కొంటున్న రాజకీయ కర్తవ్యాన్ని బట్టి మన రాజకీయ, ఎన్నికల ఎత్తుగడలు, నిర్ణయాలు ఉంటాయని మీకు తెలుసు. ఇప్పుడు దేశంలోనూ, రాష్ట్రంలో కూడా భారతీయ జనతాపార్టీని ఎదుర్కోవడం ప్రధాన రాజకీయ కర్తవ్యం అని పార్టీ భావిస్తు న్నది. రాష్ట్రంలో బి.జె.పి ప్రజా మద్దతు, ఓటింగ్ బలం రీత్యా పెద్ద శక్తికాదు. అయినా కేంద్రం లోని అధికారాన్ని, వైఎస్ఆర్‌సిపి నిశ్శబ్దాన్ని, తెలుగుదేశంలో సానుకూలతను ఉపయోగించు కుని రాష్ట్రంలో ఒక శక్తిగా ఎదగాలని తీవ్ర ప్రయత్నం చేస్తున్నది. ప్రతి చిన్న మత సంబంధ విషయాన్ని వినియోగించుకుని, అవసరమైతే పుకార్లు పుట్టించి మత విద్వేషాలను పెంచి లాభపడాలని చూస్తున్నది. ఈ మధ్య కాలంలో కొన్ని సమస్యలను వివాదాస్పదం చేసిన తీరు మనం చూశాం. అంతే కాకుండా ఇతర పార్టీల నుండి అసంతృప్త రాజకీయ నాయకు లను ఫిరాయింపులకు ప్రోత్సహించి బలప డాలని ప్రయత్నం చేస్తున్నది. సినిమా నటుడు నడుపుతున్న జనసేనపార్టీని ఆకర్షించడం ద్వారా కొన్ని సామాజిక తరగతుల్లో అయినా బలమైన పునాదిని ఏర్పర్చుకోవాలని ప్రయత్నం చేస్తున్నది. ఎన్నో అభ్యుదయ కబుర్లు చెప్పిన జనసేన అధినేత మతతత్వ బిజెపి ఉచ్చులో చిక్కుకున్నాడు. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఓటమి వలన బిజెపి రాజకీయాకర్ష కొంత నెమ్మ దించినా, ఆగిపోయిందనుకోలేం. బిజెపి మన రాష్ట్రానికి ద్రోహం చేసిన విషయం కూడా ఉంది. వాగ్దానం చేసిన ప్రత్యేకహోదాను ఇవ్వలేదు. విభజన చట్టంలో ఉన్న అంశాలను అమలు చేయటం లేదు. అందువల్ల రాష్ట్రంలో మతోన్మాదాన్ని, దానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి, సంఘ్ పరివార్ శక్తులు పెరగకుండా చూడాల్సిన ప్రధాన రాజకీయ కర్తవ్యం నేడు మన ముందుంది.

రాష్ట్రంలో మన రాజకీయ విధానం, ఎన్నికల ఎత్తుగడలు పై రాజకీయ కర్తవ్యాన్ని సాధించే దృష్టితో నిర్ణయించుకుంటాం. పై ప్రధాన రాజకీయ అంశాన్ని దృష్టిలో పెట్టుకుని –వైఎస్ఆర్‌సిపి, తెలుగుదేశం, జనసేన, మరే ఇతర పార్టీలైనా – వాటి పట్ల మన రాజకీయ వైఖరిని నిర్ణయించుకుంటాం. జనసేన పూర్తిగా బిజెపికి దాసోహం అయింది. దాని వైఖరి మార నంత కాలం రాజకీయంగా గాని, ఎన్నికలలో గాని కలిసి వ్యవహరించడం సాధ్యం కాదు. బిజెపి తాను కలుపుకున్న ప్రాంతీయ పార్టీలన్నిం టినీ నాశనం చేసి, తాను బలపడిన విషయాన్ని తెలుసుకుని ముందుగానే మేల్కొంటే జనసేనకు భవిష్యత్తు ఉంటుంది. లేకపోతే అతి తొందర లోనే అది నామమాత్ర స్థితికి చేరుకుంటే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు.

ఇక రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఎంత అన్యాయం చేస్తున్నా వైఎస్ఆర్‌సిపి నోరు మెదపడం లేదు. బిజెపి ప్రభుత్వం చేస్తున్న తప్పుడు నిర్ణయాలను, ప్రమాదకర చట్టాలన్నిం టిని సమర్థిస్తున్నది. కారణం ఏదైనా – బిజెపి బ్లాక్ మెయిల్‌కు భయపడా, నిజంగానే బిజెపి విధానాలపై మోజుపడా – రాష్ట్రంలో బిజెపిని ఎండగట్టే పనికి పూనుకోవడం లేదు. మరోవైపు బిజెపి విధానాలను కేంద్రంలో పూర్తిగా సమర్థించడమే కాకుండా, దానితో పోటీపడి మత అంశాలను కెలుకుతున్నది. మొత్తం మీద అధికార పార్టీ – ప్రధాన ప్రతిపక్ష పార్టీ రెండూ బిజెపి మతోన్మాద ప్రమాదాన్ని విస్మరిస్తున్నాయి. లౌకిక ప్రజాస్వామ్యం, రాష్ట్ర ప్రయోజనాలకు బిజెపి వలన జరుగుతున్న ప్రమాదాన్ని వివ రించి ప్రజలను చైతన్యపరచడంలో ఘోరంగా విఫలం అవుతున్నాయి.

ఈ రెండు పార్టీల వైఫల్యాన్ని ఎండగట్టి ప్రజలను చైతన్యవంతం చేసే పని వామపక్షాల పై పడింది. ఈ పార్టీలు ఎంత చిన్న శక్తిగా వున్నా ఈ బాధ్యతను నిర్వహిస్తున్నాయి.

ఎన్నికలొచ్చినప్పుడు ఈ రెండు పార్టీలు ఎలా వ్యవహరిస్తాయి అన్నదాన్ని బట్టి ఆనాడు మన వైఖరిని నిర్ణయించుకుంటాం. ఎవరు బిజెపికి వ్యతిరేకంగా నిలబడతారు, ఎవరు దానితో అంటకాగుతారు అన్నదాన్ని బట్టి ఆనాడు మన వైఖరి వుంటుంది. ఇప్పుడు మాత్రం వాటి పూగిసలాటలను బట్టబయలు చేస్తాం. మీరన్నట్లు తెలుగుదేశం పార్టీయే బిజెపికి పూర్తి మిత్రుడుగా మారిపోతే బిజెపి, దాని మిత్రులను ఓడించే కర్తవ్యంలో భాగంగా మనం నిర్ణయం తీసుకుంటాం. ఎన్నికలు

రాకుండా మనం అటువంటి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం లేదు.

ఎన్నికల్లో ఎవరు గెలవాలి, ఎవరు ఓడాలి అని నిర్ణయించగల్గేంత నిర్ణాయక శక్తిగా ప్రస్తుతం వామపక్షాలు లేవు. అలాగే ఇప్పుడు ఒకరిని, ఆ తర్వాత ఒకరిని ఓడించాలని రాజకీయ దృష్టితో కాకుండా నిర్ణయించుకోలేం. ఎన్నికల సమయం వచ్చినప్పుడు బిజెపి, దాని మిత్రులను ఓడించే రాజకీయ విధానానికి అనుగుణంగా నిర్ణయించుకుంటాం. రాష్ట్రంలో ఎన్నికల్లో బిజెపికి మిత్రులు దొరకని పరిస్థితులుంటే అప్పుడు ప్రజా ఉద్యమ ప్రయోజ నాన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల ఎత్తుగడలను నిర్ణయించుకుంటాం. ప్రస్తుతం రాష్ట్రంలో మన స్వతంత్ర శక్తిని ఎలా పెంచుకో వడం, వామపక్ష ప్రభావాన్ని ఎలా బలపర్చు కోవడం అన్నది మన ముందున్న కర్తవ్యం. ఇది జరగక పోతే ఎన్నికలను కూడా ప్రభావితం చేయలేం. అందువలన ఎన్నికలొచ్చినప్పుడు, ఆ పరిస్థితు లను బట్టి రాజకీయ విధానాని కనుగుణంగా నిర్ణయాలు తీసుకోవచ్చు. ఎన్నికల దృష్టే మన నిత్య వ్యాపకం కాకూడదు. మన స్వతంత్ర శక్తి పెంచుకోవడంపై నిరంతర దృష్టి వుండాలి.

**వ్యవస్థీకృత మతం గురించి. అలాగే పెట్టుబడి దారీ సమాజంలో వ్యవస్థీకృత మతం ప్రభావం గురించి వివరించగలరు.**

**వర్ధని, ప్రజాశక్తి, విజయవాడ**

ఒక అధికారిక ధర్మం, సిద్ధాంతం వున్న, పై నుండి క్రింది వరకు మత వ్యవహారాలను నియంత్రించే నాయకత్వ శ్రేణికల్గి, అందరికీ వర్తించే క్రతువులు, విధి విధానాలు వున్న మతాన్ని వ్యవస్థీకృత మతం అంటారు. ఈ కొలబద్దలను ప్రమాణంగా తీసుకుంటే క్రైస్తవం, ఇస్లాం, బౌద్ధం, జూడాయిజం మతాలను వ్యవస్థీకృతమైనవిగా చెప్పుకొవచ్చు. హిందూ మతం వ్యవస్థీకృతమైనదా కాదా అన్న విషయం మీద వివాదం ఉంది. ఎందుకంటే హిందూ మతానికి పై నుండి కింది వరకు నియంత్రించే ఉమ్మడి నాయకత్వ శ్రేణిలేదు. హిందూ ధర్మానికి ప్రామాణికంగా వ్యవహరించే ఒకే గ్రంథం (బైబిల్, ఖురాన్‌లాగా) లేదు. అలాగే దేవుళ్ళు, దేవతలు, సంప్రదాయాలు, పండగలు వగైరాలు ఎంతో వైవిధ్యంతో కూడి ఉంటాయి. అనేక భిన్నమైన, స్వతంత్రమైన మతశాఖలను కలిపి హిందూమతంగా పరిగణిస్తుంటారు. ఈ వైవిధ్యం మూలంగానే హిందూమతాన్ని ఎక్కువ మంది వ్యవస్థీకృత మతంగా అంగీకరించరు. ఈ అంశాన్ని గమనంలోకి తీసుకునే సంఘ పరివార్ హిందూ మతాన్ని వ్యవస్థీకృతం చేయాలని శతవిధాలా ప్రయత్నిస్తున్నది. మన ధర్మశాస్త్రాన్ని ఏకైక ధర్మంగా చెప్పే ధైర్యం జేయలేక భగవద్గీతను ప్రామాణికంగా ముందుకు తెస్తున్నారు. ఆయోధ్య రామాలయాన్ని (రోమ్, మక్కాలలాగా) హిందూ మతకేంద్రంగా సృష్టించదలచారు. విడివిడిగా వున్న సాధు సంతులను, మఠాధిపతులను ఒక వేదికపైకి తెచ్చి కేంద్రీకృత నాయకత్వాన్ని రూపొందించే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా కుల వ్యవస్థ ఉన్నంత కాలం హిందూ మతాన్ని వ్యవస్థీకృతం చేయడం సుళువు కాదు. ఎంత వ్యవస్థీకృతంగా వున్నా దానిలో ఏకీకృతంగా ఉన్న అంశం అత్యంత అభివృద్ధి నిరోధక కుల వ్యవస్థ మాత్రమే. వ్యవస్థీకృతంగా వుందా లేదా అనేదానితో నిమిత్తం లేకుండా మతం అన్ని సమాజాలలో ప్రభావం చూపింది. ఆయా సమాజాల స్వభావాన్ని బట్టి మతం నిర్వహించే పాత్రలో కొన్ని సర్దుబాట్లు చేసుకుని కొన సాగుతుంది. మనిషి పుట్టుక, మరణానికి సంబంధించిన విషయాలపై అంతిమ సమా ధానాలను చెప్పడం ద్వారా మనిషికి తృప్తినిచ్చే పనిని మతం నిర్వహిస్తుంది. దీనినే మనం ఆధ్యాత్మిక పాత్రగా పేర్కొంటాం. అంతేగాక దోపిడీ సామాజిక వ్యవస్థను సమర్థించడం కూడా మతం తన బాధ్యతగా తీసుకుంది. పెట్టుబడిదారీ విధానంలో కూడా మతం ఈ రెండు పనులను చేస్తున్నది.

అయితే పెట్టుబడిదారీ విధానంలో మతం లో కొన్ని మార్పులొచ్చాయి. పెట్టుబడిదారీ విధానంలో అన్నీ సరుకులుగా మారినట్లు, మతానికి సంబంధించిన అన్ని అంశాలు సరుకులుగా మారాయి. పుణ్యం, పాపం, భక్తి, మోక్షం వంటివన్నీ కొనుగోలు అమ్మకాల మూసలోకి మారిపోయాయి. ఆ రకంగా మతం కూడా వ్యాపారమయం అయింది. అలాగే ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా మత క్రతువులు వగైరా సర్దుబాట్లు చేసుకున్నాయి. కొత్త కొత్త మతశాఖలు, బాబాలు, సిద్ధాంతాలు, గురువులు పుట్టుకొ స్తున్నారు.

పెట్టుబడిదారీ విధానం మతమౌఢ్యానికి భిన్నంగా శాస్త్రాన్ని, శాస్త్ర విజ్ఞానాన్ని ఒకవైపున అభివృద్ధి చేస్తుంది. ఎందుకంటే ఉత్పాదకతను పెంచుకుని అధిక లాభాలు కావాలంటే శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి కావాలి. అదే సందర్భంలో పెట్టుబడిదారీ విధానానికి సంక్షో భం వలన ఇబ్బందులొచ్చినప్పుడు, ప్రజా ఉ ద్యమాల వలన ముప్పువచ్చిపుడు ప్రజలను మభ్యపెట్టడానికి వ్యవస్థను మార్చు కోవాలన్న చైతన్యం రాకుండా చేసేందుకు పెట్టుబడిదారీ విధానం మతాన్ని వినియోగిస్తుంది.

# జనావాసాలూ, సమాజంలో దొంతరలు

**(21వ పేజీ తరువాయి)**

బాగా జరగాలి. అప్పుడే మాంసం, పాల ఉత్పత్తులు,తోళ్ళు అందుబాటులోకి వస్తాయి. వ్యవసాయ ఉత్పత్తులను సేకరించి వ్యాపారం చేసే గహపతి వేదకాలపు గహపతి కన్నా విభిన్నమైనవాడు. వేదకాలంలో అతడు కేవలం ఇంటికి యజమాని. కాని ఇప్పుడు వ్యవసాయం నుండి వచ్చిన సంపద మీద పెత్తనంతోబాటు ఆ వ్యవసాయ ఉత్పత్తులతో చేసినవ వ్యాపారం ద్వారా కూడా సంపద పెంచుకున్నవాడయ్యాడు. ఈ గహపతి బ్రాహ్మణ మతాన్ని, బౌద్ధమతాన్ని రెండింటినీ ఆదరించేవాడు. ఈ రెండు మతాలవారూ అతని ఆతిధ్యాన్ని స్వీకరించడానికి సుముఖంగానే ఉండేవారు. రాజు వద్దనుండి భూమిని దానంగా స్వీకరించిన బ్రాహ్మణుడు కూడా గహపతిగా రూపం దాల్చిన దృష్టాం తాలు ఉన్నాయి. ఐతే క్షత్రియుల్లో మాత్రం గహపతులు లేదు. బ్రాహ్మణులకు, క్షత్రియులకు నడుమ ఉండిన వైరం వంటిది క్షత్రియులకు, గహపతులకు నడుమ లేదు. గహపతి పెద్ద మొత్తంలో రాజుకు పన్ను చెల్లించడమే అతడి ప్రత్యేకతకు కారణం. మత ప్రచారకులను ఆదరించడం, వారికి పెద్ద ఎత్తున విరాళాలు ఇవ్వడం, యుద్ధ సమయాల్లో సైనికులను ఆదరించడం వంటివి గహపతి చేసేవాడు. గహపతులకు, బౌద్ధ సన్యాసులకు నడుమ వివాదం తలెత్తినప్పుడల్లా బుద్ధుడు గహపతులనే సమర్థించాడు.

**పుట్టుకతోటే తమ సామాజిక హోదా నిర్ధారణ అయిన బ్రాహ్మణులు, క్షత్రియుల మాదిరిగా కాకుండా తమ సంపదద్వారా, వ్యాపార కార్యకలాపాలద్వారా ఒక మధ్య తరగతి హోదాను సంపాదించుకున్నవారు గహపతులు. అటు బ్రాహ్మణులు, ఇటు బౌద్ధులు ఇద్దరూ ఈ గహపతుల ప్రాపకం కోసం ప్రాకు లాడేవారు.**

ఒక మామూలు గృహస్తు స్థాయినుండి కీలకమైన సామాజిక స్థానానికి గహపతులు ఎగబాకడం సమాజంలో పెరుగుతున్న సంపదకు, మనుషుల మధ్య పెరుగుతున్న అంతరాలకు సంకేతం. పట్టణాలలోని గహప తులు లేదా శెట్టి లు గ్రామాల్లోని గహపతుల కన్నా మెరుగైన స్థాయిలో ఉండేవారు. గహ పతుల సంపద 3 నుండి 24 కోట్ల బంగారు కాసులవరకూ ఉండేదని బౌద్ధ గ్రంథాలు చెప్తున్నాయి. ఐతే వాటిలోని అతిశయోక్తుల విషయంలో మనం జాగ్రత్త వహించాలి.

రక్త సంబంధం ఆధారంగా ఏర్పడ్డ గ్రూపుల గురించి, సామాజిక సంబంధాల గురించి వచ్చే సంచికలో తెలుసుకుందాం. ❊

# నాల్గవ మహాసభ -
# పార్టీ అంతర్గత పోరాటం ప్రారంభం

(2వ పేజీ తరువాయి)

పార్టీలో చోటు చేసుకున్న మార్పులు పార్టీ మహాసభపై ప్రభావం చూయించాయి. 1956లో సి పి ఎస్ యు 20వ మహాసభ జరిగింది. ఆ మహాసభ తీర్మానాలలోని తప్పుడు అంచనాలు రివిజనిస్టు శక్తుల బలాన్ని మళ్ళీ పెంచాయి. పాల్ఘాట్ మహాసభకు కేంద్ర కమిటీ తయారు చేసిన ముసాయిదా తీర్మానాలలో ఎన్నో రివిజనిస్టు సూత్రీకరణలు ఉన్నాయి. అవి పార్టీలో వర్గ సామరస్య ధోరణులను ప్రోత్సహించాయి. ఈ రివిజనిస్టు ధోరణులను అంగీకరించని వర్గం తన ప్రత్యామ్నాయ ముసాయిదాను ప్రవేశపెట్టింది. 1951 పార్టీ కార్యక్రమం ఆధారంగా రూపొందినందువలన ఈ ముసాయిదాలో కూడా తప్పులు లేకపోలేదు. అందువలన దీనికి కూడా పరిమితులు ఉన్నాయి. అయితే ఈ ముసాయిదాలో భారతదేశ పాలకవర్గాల యొక్క వర్గ స్వభావం గరించి సరైన విశ్లేషణ చేశారు. వర్గ సామరస్య ధోరణులపై తీవ్రమైన విమర్శ చేశారు. ఈ పత్రాలపై లోతైన చర్చ జరిగింది. ఫలితంగా వర్గ సామరస్య ధోరణితో ఉన్నవారు పార్టీ నంతటిని తమ విధానం వెనుక సమీకరించలేకపోయారు. ఈ చర్చలు, వాదోపవాదాలు జనతా ప్రజాస్వామ్యం, కార్మికవర్గ నాయకత్వంలో జనతా ప్రజాస్వామ్య సంఘటనను ఏర్పాటు చేయటం తదితర వ్యూహాత్మక అంశాలను ముసాయిదాలో ఉంచేటట్టు చేశాయి. ప్రత్యామ్నాయ ముసాయిదాను ప్రవేశపెట్టాలనుకున్న వారిని ఈ సవరణలు సంతృప్తిపరచటంతో ప్రత్యామ్నాయ ముసాయిదాను ఉపసంహరించుకున్నారు.

సవరించిన ముసాయిదా వర్గ సామరస్యాన్ని కోరుకున్న వారి ఆలోచనలకు అనుగుణంగా లేదు. సమాజంలో జరుగుతున్న మార్పులను పరిగణనలోనికి తీసుకోకుండా, పడికట్లు సూత్రాలకు, ఎత్తుగడలకు అంటిపెట్టుకున్న వారంటూ ఇతరులను నిందించారు-ఇది పార్టీకి తీరని నష్టం కలిగించింది. పార్టీ మహాసభలో వారు తమ ప్రత్యామ్నాయ ముసాయిదాను ప్రవేశ పెట్టారు. అది ఓడిపోయినా, మూడో వంతు ప్రతినిధులు దానికి ఓటు వేశారని గమనించాలి.

మహాసభ ముందు ప్రవేశ పెట్టిన నిర్మాణ రిపోర్టులో పార్టీలో క్రమశిక్షణ లోపించిందని, నిర్ణయాలు అమలు కావడం లేదని గుర్తించింది. ఈ కాలంలో పార్టీ కేంద్రంలో తరగతులు నిర్వహించినా, అందులో పార్టీ అంటే ఒక సమగ్ర అవగాహన కల్పించలేదు. పార్టీలో ఉమ్మడి పనివిధానం దెబ్బతిన్నది. పార్టీ కేంద్రం బలహీనపడింది. ఇది పార్టీ పత్రిక ప్రచురణలో, సాహిత్య అమ్మకాలలో కూడా వ్యక్తమైంది. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సిద్ధాంతాన్ని రూపొందించడంలో, పార్టీని అభివృద్ధి చేయడంలో పార్టీ నాయకత్వం విఫలమైనట్లు రిపోర్టులో అంగీకరించింది.

క్రెడెన్షియల్స్ కమిటీ సమర్పించిన నివేదిక ప్రకారం మహాసభకు 407 మంది కామ్రేడ్లు హాజరయ్యారు. మొత్తం ప్రతినిధులు 1,344 సంవత్సరాలు జైళ్లలో గడిపారు. అంటే ప్రతి ప్రతినిధి కనీసం మూడేళ్లు జైళ్లలో గడిపినట్టు తేలుతున్నది. ప్రతినిధులంతా కలిసి 1,021 సంవత్సరాలు రహస్య జీవితం గడిపారు. అంటే నగటున ప్రతి ఒక్కరూ రెండున్నర సంవ్సత్సరాలు రహస్య జీవితం గడిపారు. ఇది పార్టీ పోరాట పటిమను తెలియచేస్తుంది.

ప్రపంచశక్తుల బలాబలాలలో సోషలిజంవైపే నిశితమైన మొగ్గు ఉన్నదని, సామ్రాజ్యవాదం బలహీన పడుతున్నదని మహాసభ ఆమోదించిన రాజకీయ తీర్మానంలో పేర్కొన్నారు. పార్లమెంటులో మెజారిటీ సాధించడం ద్వారా శాంతియుతంగా సోషలిజం సాధించే అవకాశం ఉన్నదని, అందుకు 'అవసరమైన పరిస్థితులు' కల్పించుకోడమే పార్టీ ముందున్న సవాలని కొంతమంది భావించటానికి దారితీసింది. కార్యక్రమంపైన, తక్షణం అనుసరించాల్సిన ఎత్తుగడల పంథా పైన పార్టీ విడిపోయి ఉన్నదని ఈ చర్చలు స్పష్టం చేశాయి.

పార్టీ మహాసభ రాజకీయ తీర్మానాన్ని ఆమోదించినప్పటికీ, భారత కమ్యూనిస్టు ఉద్యమంలో కొన్ని ముఖ్యమైన సమస్యలపై పార్టీలో ఏకాభిప్రాయం లేదని స్పష్టంగా తెలుస్తున్నది (రాజ్యం యొక్క స్వభావం, అనుసరించవలసిన వ్యూహం, ఎత్తుగడలు). ఆ తరువాత దశాబ్దకాలం పాటు పార్టీ కార్యక్రమం, సైద్ధాంతిక సమస్యలపై జరిగిన అంతర్గత పోరాటాలకు ఈ మహాసభ నాంది పలికింది.

**(అనువాదం: కె ఉషారాణి)**

# సరళీకరణ విధానాలతో తీవ్రమౌతున్న వ్యవసాయ సంక్షోభం

(30వ పేజీ తరువాయి)

దిగజారుస్తూ వచ్చారు. వాణిజ్య విధానాల ప్రాతిపదికగా ఈ బ్యాంకులను పునర్వ్యవస్థీకరించారు. నయా ఉదారవాద విధానాలు ప్రారంభమైన తర్వాత చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, స్వయం ఉపాధి, వృత్తులు, వ్యాపారాలకు ఇచ్చే రుణాలను తగ్గించారు. అసంఘటిత రంగానికి రుణాలు ఇవ్వటం పట్ల ఉదాసీనంగా వ్యవహరించారు. బ్యాంకు బ్రాంచీల సంఖ్యను కుదించటంతో పాటు రుణాలివ్వటాన్ని తగ్గించారు. 1990 నాటికి వ్యవసాయ రంగానికి 17.7 శాతం రుణాలు ఇస్తుండగా, 2000-01నాటికి ఇది 10 శాతంకు పడిపోయింది.

వ్యవసాయోపకరణాల ధరలు నిరంతరం పెరుగుతుండటం, ఉత్పత్తుల ధరలు అస్థిరంగా ఉండటం, మద్దతు ధరల విధానం లేకపోవటం, మద్దతు ధరలు నిర్ణయిస్తున్న పంటల ధరలు మార్కెట్‌లో తక్కువ ఉన్నపుడు ప్రభుత్వం కొనుగోలు చేయటపోవటం వ్యవసాయ రంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభానికి ప్రధాన కారణాలు. వీటితో పాటు రైతులు తిండి, బట్ట, ఇల్లు, విద్య, వైద్యం తదితర అవసరాలను తీర్చుకోవాల్సివుంది. వీటి ధరలు నిరంతరం పెరుగుతున్నాయి. ప్రభుత్వాలు విద్య, వైద్యాన్ని అంతకంతకూ ప్రైవేటీకరిస్తున్నాయి. ఈ విధానాలు రైతాంగంపై మోయలేని భారాలను మోపుతున్నాయి. రైతాంగ ఆత్మహత్యలు అసాధారణంగా పెరగటంలో ఇవి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఇదే విధానాలను కొనసాగిస్తే రైతాంగం మరింత త్వరగా దివాళా తీయటం, ఆత్మహత్యలు మరింతగా పెరగటం జరుగుతుంది. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటం ద్వారా మాత్రమే రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల ప్రయోజనాలను కాపాడటం సాధ్యమౌతుంది. ❊

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-07-2021 (36 pages) Postal Regd. No D/VJ/172/2021-23

# భారత దేశంలో ఏటేటా పెరుగుతున్న ఆర్థిక అంతరాలు



2000–2019 సంవత్సరాల మధ్య భారత దేశ ప్రజల తలసరి స్థూల జాతీయోత్పత్తి (పెర్ కాపిటా జిడిపి) అయిదు రెట్లు పెరిగింది. 2000 సంవత్సరంలో రూ. 443 ఉండేది 2019 నాటికి రూ. 2014కు పెరిగింది. అయితే దేశ ప్రజలందరి ఆదాయాలు పెరిగాయనుకోకండి. 2019లో దేశ ఆదాయంలో 21 శాతాన్ని ఒక్క శాతం ధనికులు చేజిక్కించుకున్నారు. 1990లో వీరి వాటా 11 శాతం మాత్రమే ఉండేది. అంటే రెండు దశాబ్దాల్లో వారి ఆదాయం వాటా రెండు రెట్లు పెరిగింది. 2019లో దేశంలోని 10 శాతం ఉన్నత వర్గాలు దేశం మొత్తం ఆదాయంలో 56 శాతాన్ని చేజిక్కించుకున్నారు. అదే సమయంలో కింది స్థాయిలోని 10 శాతం మంది ప్రజలకు దక్కింది 3.5 శాతం మాత్రమే. ఆదాయమే కాదు సంపద పంపిణీ కూడా ఇదే కథ చెబుతోంది. దేశంలోని 10 శాతం అతి ధనవంతుల చేతుల్లో 80.7 శాతం సంపద కేంద్రీకరించబడి ఉంది.

గినీ కోఎఫిసియంట్ (ఆదాయ పంపిణీలో అసమానతలు కొలిచే) పాయింట్లను బట్టి చూసినా భారత దేశంలో ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరుగుతున్నాయని తెలుస్తుంది. 2011లో గిని కోఎఫిసియంట్ 34.4 శాతం ఉండేది. (100 శాతం ఉంటే పూర్తి అసమానతుల ఉన్నట్లు, 0 శాతం ఉంటే పూర్తి సమానత్వం ఉన్నట్లు). దేశంలో ఈ కోఎఫిసయంట్ 2014లో 35.7 శాతానికీ, 2018లో 47.9 శాతానికీ పెరిగింది. అసమానతల్లో భారత దేశం ప్రపంచంలో రష్యా తరువాత రెండో స్థానంలో ఉంది.

కరోనా మహమ్మారి కాలంలో ఈ అసమానతలు మరింత పెరిగాయి. కరోనా కాలంలో భారత దేశ ఆర్థికాభివృద్ధి (జిడిపి పెరుగుదల) మైనస్ 10 శాతం పడిపోతే, దేశంలోని శతకోటీశ్వరుల నికర ఆస్తులు 35 శాతం పెరిగాయి.

**(డౌన్ టు ఎర్త్ పత్రిక 2021 మార్చి సంచికలో దివ్యేందు చౌదరి, పారిజాత్ ఘోష్‌లు రాసిన వ్యాసం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి)**

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

**చందా వివరాలు**
విడిపత్రిక: రూ.10, సంవత్సర చందా:రూ.100, పోస్టు ద్వారా రూ. 120 పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు.....................................................
వీధి...................................................................
గ్రామం.................................................................
మండలం లేదా పట్టణం.......................................
జిల్లా..................................................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.16, No.2. Published on July 1, 2021